కిషన్‌చందర్ రచనలు-1
రూ॥ 200/-
పేజీలు: 220


నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★


ఆకాశానికి, బిజెపి అవకాశవాదానికి హద్దే లేదు

మీకంటే పెద్దదేశంపై యుద్ధం ఎందుకు మొదలెట్టావ్?

సింగపూర్ పార్లమెంటు రద్దు


లోపలి పేజీల్లో



సంపుటి 27, సంచిక: 295 | బుధవారం | 16-04-2025 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00


## సోనియా, రాహుల్‌గాంధీలపై
# ఇడి చార్జిషీటు




- 'నేషనల్ హెరాల్డ్' కేసులో ఈనెల 9న దాఖలు
- కాంగ్రెస్ నేతలు శామ్ పిట్రోడా, సుమన్ దూబే పేర్లను చేర్చిన దర్యాప్తు సంస్థ
- ఈనెల 25న విచారణ

**న్యూఢిల్లీ :** 'నేషనల్ హెరాల్డ్' కేసులో కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ, లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్‌గాంధీ తదితరులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇ.డి) చార్జిషీట్ దాఖలు చేసింది. ఏప్రిల్ తొమ్మిదోతే దీన ఈ చార్జిషీటు దాఖలైంది. ప్రత్యేక న్యాయమూర్తి విశాల్ గోగ్నే ఈ చార్జిషీటును పరిశీలించారు. ఈ కేసు తదుపరి విచారణను ఈనెల 25న చేపట్టనున్నారు. ఈ చార్జిషీట్‌లో కాంగ్రెస్ నాయకులు శామ్ పిట్రోడా, సుమన్ దూబే పేర్లను కూడా నిందితులుగా పేర్కొన్నారు. "ప్రస్తుత ప్రాసిక్యూషన్ ఈ ఫిర్యాదుపై విచారణను ఏప్రిల్ 25కు వాయిదా వేసింది. ఆ రోజునే దీనిని పరిశీలన నిమిత్తం విచారణకు తీసుకుంటుంది, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, విచారణాధికారి ఇద్దరూ ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను


తరువాయి 2లో




## తెలంగాణ పథకాలతో
# మోదీ ఉక్కిరిబిక్కిరి

> ప్రభుత్వం ఎంత మంచి చేసినా ప్రజల్లోకి తీసుకెళ్లకపోతే ప్రయోజనం ఉండదు. ఎమ్మెల్యేలు ప్రతి గ్రామంలో పర్యటించేలా కార్యాచరణ చేపట్టాలి. బుధవారం నుంచి జూన్ 2 వరకు ఎమ్మెల్యేలు గ్రామాల్లో పర్యటించాలి. నేను కూడా మే 1 నుంచి జూన్ 2 వరకు ప్రజలతో మమేకమవుతా. ఎమ్మెల్యేలు నియోజకవర్గంలో ఏం కావాలో ఒక నివేదిక తయారు చేసుకోవాలి. ఆ పనులను పూర్తి చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది. సన్నబియ్యం కాంగ్రెస్ పథకం. అది కాంగ్రెస్ పేటెంట్, బ్రాండ్. బిజెపి పాలిత రాష్ట్రాల్లో సన్నబియ్యం ఎందుకు ఇవ్వడంలేదో చెప్పాలి.
> – సిఎం రేవంత్‌రెడ్డి

- అందుకే కాంగ్రెస్ పార్టీపై, ప్రభుత్వంపై ప్రధాని విమర్శలు
- తెలంగాణ మోడల్‌పై చర్చ, ఎస్‌సి కులాల వర్గీకరణ కేంద్ర సర్కార్‌కు గుదిబండగా మారింది
- కులగణన మోదీకి మరణశాసనం రాయబోతోంది
- బిజెపి, బిఆర్‌ఎస్ కలిసి ప్రజాప్రభుత్వంపై విషప్రచారం చేస్తున్నాయి
- అబద్ధపు ప్రచారాన్ని నమ్మి హెచ్‌సియు భూముల్లోకి బుల్డోజర్లు పంపించారని మోదీ మాట్లాడడం విచారకరం
- సిఎల్‌పి సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహం

ప్రజాపక్షం / హైదరాబాద్

బిజెపి, బిఆర్‌ఎస్ పార్టీలు కలిసి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తున్నాయని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల వరకు కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డి కాంగ్రెస్‌పార్టీపై, ప్రభుత్వంపై విమర్శలు చేశారని, ఇప్పుడు ఏకంగా ప్రధాని మోదీనే రంగంలోకి దిగారని, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో ప్రధాని మోదీ ఉక్కిరిబిక్కిరి అవుతున్నారన్నారు. దేశంలో తెలంగాణ మోడల్ పై చర్చ జరుగుతోందని, ఎస్‌సి కులాల వర్గీకరణ మోదీకి గుదిబండగా మారిందని, కులగణన మోదీకి మరణశాసనం


తరువాయి 2లో


## ప్రభుత్వాన్ని కూల్చుతామంటే..
# ఊరుకుంటామా

### బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి వ్యాఖ్యలను ఖండించిన మంత్రులు

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టాలని వ్యాపారస్తులు చూస్తున్నారని బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎ కొత్త ప్రభాకర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను మంత్రి పొన్నం ప్రభాకర్ ఖండించారు. కొత్త ప్రభాకర్ రెడ్డిది ట్రాన్స్ పోర్ట్ వ్యాపారం అనుకున్నా.. కానీ ఈ మధ్య జ్యోతిష్యం కూడా చెబుతున్నారని సెటైర్లు వేశారు. అలాగే బిఆర్‌ఎస్ నేతలు ప్రభుత్వాన్ని కూలుస్తాం అంటే ఊరుకుంటామా అని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చుతామంటే.. ఇక్కడ ఎవరు చేతులు కట్టుకుని కూర్చోలేదని తీవ్ర స్థాయిలో మంత్రి పొన్నం వార్నింగ్ ఇచ్చారు. ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించే బిఆర్‌ఎస్ ఆవిర్భావసభ నేపథ్యంలో సోమవారం


తరువాయి 2లో




## బిసి సర్వే, ఎస్‌సి వర్గీకరణ
# నిశ్శబ్ద విప్లవాలు

### వీటి ఫలితాలను కాంగ్రెస్ పార్టీ ప్రజల్లోకి తీసుకెళ్లాలి : డిప్యూటీ సిఎం భట్టి

బిసి కుల గణన, ఎస్‌సి ఉప కులాల వర్గీకరణ అంశాలను పట్టించుకోకపోవడం వల్లనే పదేళ్ల పాటు రాష్ట్రాన్ని పాలించిన బిఆర్‌ఎస్‌ను, కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి పార్టీలను రాష్ట్రంలో ప్రజలు మూట కట్టి మూలన పడేశారని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క అన్నారు. ఈ విషయాలు ఆ పార్టీల అస్తిత్వానికే ప్రమాదం కాబట్టి బిఆర్‌ఎస్, బిజెపి చేతులు కలిపి ఉన్నది లేనట్టు లేనిది ఉన్నట్టు చిత్రీకరిస్తున్నారని మండిపడ్డారు. దేశంలో కొద్దిమందికి ఇష్టం లేకపోయినా భూసంస్కరణలు వంటి గొప్ప నిర్ణయాలు కాంగ్రెస్ పార్టీ గతంలో చేపట్టిందని, అందుకే దేశంలో సుదీర్ఘ కాలం పాటు కాంగ్రెస్ అధికారంలో కొనసాగిందని


తరువాయి 2లో


## రాష్ట్ర స్వయం ప్రతిపత్తిపై
# హైలెవల్ కమిటీ

### తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె.స్టాలిన్ ప్రకటన

- సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి కురియన్ జోసెఫ్ నేతృత్వంలో ప్యానెల్ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడి
- రాష్ట్రాల హక్కులను కేంద్రం క్రమంగా లాక్కుంటున్నదని ధ్వజం



**చెన్నై :** తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె.స్టాలిన్ కేంద్రంపై తన వ్యతిరేక స్వరాన్ని మరింతగా పెంచారు. రాష్ట్రాల హక్కులను కేంద్రం క్రమంగా లాక్కుంటోందని ఆరోపించారు. తమిళనాడు రాష్ట్ర స్వయం ప్రతిపత్తిపై చర్యలను సిఫారసు చేయడానికి సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో ఒక అత్యున్నత స్థాయి కమిటీని నెలకొల్పుతున్నట్లు స్టాలిన్ మంగళవారం ప్రకటించారు. అయితే ఈ ప్రకటన నేపథ్యంలో ప్రతిపక్ష ఆల్ ఇండియా అన్నా ద్రవిడ మున్నేట్ర కజగం (ఎఐడిఎంకె) ఆయనపై విమర్శలదాడి కొనసాగించింది. ఇంతకుముందు కాంగ్రెస్ పార్టీ సారథ్యంలోని యుపిఎతో ఆయన డిఎంకె అధికారం పంచుకున్నప్పుడు ఇన్నేళ్లుగా ఆయన ఏమిచేస్తున్నారో అని ఎఐడిఎంకె ఎద్దేవా చేసింది. ఈ చర్య


తరువాయి 2లో


## నోవాటెల్‌లో సిఎంకు తప్పిన ప్రమాదం

## నేటి నుంచి ముఖ్యమంత్రి బృందం జపాన్ పర్యటన


లోపలి పేజీల్లో








# చల్లని కబురు

- ఈ ఏడాది సాధారణం కంటే అధిక వర్షపాతం
- సీజన్ మొత్తంలో ఎల్‌నినో పరిస్థితులు ఉండే అవకాశం లేదు : ఐఎండి



**న్యూఢిల్లీ :** ఈ ఏడాది వర్షాకాల సీజన్‌లో దేశంలో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుందని భారత వాతావరణ శాఖ మంగళవారం తెలిపింది. సీజన్ మొత్తంలో ఎల్ నినో పరిస్థితులు ఉండే అవకాశం లేదని పేర్కొంది. నాలుగు నెలల వర్షాకాల సీజన్‌లో (జూన్ నుండి సెప్టెంబర్ వరకు) భారతదేశంలో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. దీర్ఘకాలిక సగటు 87 సెం.మీ.లో 105 శాతం వర్షపాతం నమోదవుతుందని అంచానా వేసినట్లు భారత వాతావరణ శాఖ (ఐఎండి) చీఫ్ మృత్యుంజయ్ మోహపాత్ర మీడియాకు వెల్లడించారు. భారత ఉపఖండంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతంతో సంబంధం ఉన్న ఎల్ నినో పరిస్థితులు ఈసారి అభివృద్ధి చెందే అవకాశం లేదని ఆయన అన్నారు. దేశంలోని కొన్ని ప్రాంతాలు ఇప్పటికే తీవ్రమైన


తరువాయి 12లో


## రాష్ట్రం ఉత్తరం రాయగానే
# నిధులు ఇస్తామా?

- రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చేంత నిధులే కేంద్రం ఇస్తుంది
- నిధులు లేక అప్పు చేయాల్సి వస్తోంది
- జర్నలిస్టుల 'ఇష్టాగోష్ఠి'లో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం వద్ద మిగులు నిధులు లేవని, అందుకే అప్పులు చేయాల్సి వస్తుందని కేంద్ర మంత్రి,బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని పలు ప్రాజెక్ట్‌లకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చేంత నిధులను మాత్రమే ఇస్తుందని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అడిగినంతగా, ఉత్తరం రాయగానే నిధులను ఇస్తుందా?అని ప్రశ్నించారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం వద్ద మిగులు నిధులు లేవని ఆయన స్పష్టం చేశారు. వక్ఫ్ చట్టాన్ని వ్యతిరేకిస్తున్న వారు భూ బకాసురులకు పరోక్షంగా వత్తాసు పలకడమేనని అన్నారు. హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన మంగళవారం జర్నలిస్టులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం


తరువాయి 2లో


## వడ దెబ్బ మృతుల కుటుంబాలకు
# రూ.4లక్షల ఎక్స్‌గ్రేషియా

### కలెక్టర్లకు ప్రభుత్వం ఆదేశం

ప్రజాపక్షం/హైదరాబాద్

రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశాలు ఉన్నందున 'వడ గాలుల కార్యాచరణ ప్రణాళిక'ను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కలెక్టర్లను ఆదేశించింది. వడ దెబ్బతో మృతి చెందిన కుటుంబాలకు రూ. 4లక్షల ఎక్స్‌గ్రేషియాను చెల్లించాలని నిర్ణయించింది. ఇది వరకు వడదెబ్బతో మృతి చెందిన కుటుంబాలకు చెల్లించే ఎక్స్‌గ్రేషియా రూ.50వేలు ఏమాత్రం సరిపోవడం లేదని, వడగాలులను రాష్ట్ర విపత్తుగా గుర్తించి, అందుకు అవసరమైన


తరువాయి 12లో



## బందీలలో సగం మందిని
# విడుదల చేస్తేనే..

- ఆయుధాలనూ వీడాలి
- హమాస్‌కు ఇజ్రాయెల్ కాల్పుల విరమణ ప్రతిపాదన
- మధ్యవర్తిత్వ దేశం ఈజిప్టుకు అందజేత



**కైరో :** కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి గాజాలో మరింత అల్లకల్లోలం సృష్టిస్తున్న ఇజ్రాయెల్ ప్రభుత్వం తాజాగా హమాస్‌కు 45 రోజుల కాల్పుల విరమణ ఒప్పందాన్ని ప్రతిపాదించింది. ఈ మేరకు ప్రతిపాదనను మధ్యవర్తి దేశం ఈజిప్టుకు అందజేసింది. ఈజిప్టు ప్రభుత్వం అధికారికంగా మంగళవారంనాడు ఈ విషయం వెల్లడించింది. బందీలలో కనీసం సగంమందిని విడుదల చేసినాగానీ కాల్పుల విరమణ ఒప్పందాన్ని అమలు చేస్తామని ఇజ్రాయెల్ ప్రభుత్వం ఈజిప్టుకు తెలియజేసింది. అదేవిధంగా హమాస్ ఉగ్రవాదులు ఆయుధాలను కిందపడేయాలని కూడా ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నేతన్యాహూ ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదన తమవద్దకు చేరిందని, దీనిని పరిశీలించి తగినవిధంగా స్పందిస్తామని


తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## నైజీరియాలో మళ్ళీదాడి

### 51 మంది మృతి



**అబుజా:** ఆఫ్రికా పశ్చిమ తీరప్రాంత దేశం నైజీరియాలో మరోసారి జరిగిన దాడుల్లో తాజాగా 51 మంది మరణించారు. ఇటీవల జరిగిన దాడుల్లో ఇప్పటికే 50 మందిపైగా మరణించారు. 36 రాష్ట్రాలతో కూడిన నైజీరియా ఫెడరల్ రిపబ్లిక్‌లోని మిడిల్ బెల్ట్ రాష్ట్రం బోక్కోస్‌లో ఈ దాడులు జరిగాయి. నైజీరియాలో భూమికోసం తెగలమధ్య జరుగుతున్న అంతఃసంఘర్షణలు జరుగుతున్నాయి. ఈ సంఘర్షణలు మతానికి కూడా ముడిపడి ఉన్నాయి. ఈనెల ఐదోతేదీన కూడా ఈ రాష్ట్రంలో ఇదేవిధంగా హింస చెలరేగడంతో దాదాపు 50 మంది మరణించారు. అనేకమంది ఇళ్ళు వదలిపారిపోయారు. మతాలమధ్య జరుగుతున్న ఘర్షణలవల్ల ఈ ఏడాదిలో ఈ రెండు దాడులు అత్యంత హింసాత్మకమైనవిగా నమోదయ్యాయి. అధికారులు ఇప్పటివరకూ 48 మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. ఒక ముస్లిం గన్‌మెన్ మరొక క్రైస్తవ కుటుంబంపై దాడి చేయడంతో హింస ప్రారంభమై అది అన్నిచోట్లకూ విస్తరించింది.

## మీకంటే పెద్దదేశంపై యుద్ధం ఎందుకు మొదలెట్టావ్?

### జెలెన్‌స్కీపై ట్రంప్ ఆగ్రహం






**వాషింగ్టన్ :** ''నువ్వెందుకు యుద్ధం మొదలుపెట్టావ్?'' అంటూ ఉక్రేన్ అధ్యక్షుడు వి.జెలెన్‌స్కీపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మట్టల ఆదివారం (పామ్ సేండే) ఏప్రిల్ 13న ఉక్రేన్‌లోని సుమీ నివాసిత ప్రాంతాలపై రష్యా క్షిపణులు చేసినదాడిలో 34 మంది మరణించిన తర్వాత ట్రంప్ మంగళవారంనాడు పైవిధంగా స్పందించారు. సుమీలో దారుణంపై ప్రపంచం కఠినంగా స్పందించాలని, ట్రంప్ స్వయంగా తమ దేశానికి వచ్చి ఇక్కడి దీనపరిస్థితిని చూడాలని జెలెన్స్కీ విజ్ఞప్తి చేసిన మరునాడు ట్రంప్ స్పందిస్తూ, రష్యాపై నువ్వెందుకు యుద్ధం ప్రారంభించావని ఆగ్రహించారు. వైట్‌హౌస్‌లో ట్రంప్ పాత్రికేయులతో మాట్లాడుతూ, ఉక్రేన్‌లో యుద్ధంవల్ల లక్షల మంది మరణించారని, రష్యాతోపాటు ఉక్రేన్ కూడా సమానస్థాయిలో ఆ నిందను భరించిందన్నారు. తనకంటే 20 రెట్లు పెద్దదైన దేశంతో యుద్ధం ప్రారంభించిన ఉక్రేన్ తనమీద సానుభూతితో ప్రపంచం క్షిపణులు, ఇతర ఆయుధాలు సమకూరుస్తుందని ఆశించిందని జెలెన్స్కీని ట్రంప్ తప్పుపట్టారు. ఈ విషయంలో ఆయుధాలు ఇచ్చి జెలెన్స్కీని ప్రోత్సహించిన అమెరికా పూర్వ అధ్యక్షుడు జో బైడెన్‌ను కూడా ట్రంప్ విమర్శించారు. జెలెన్స్కీ నిరంతరం క్షిపణులు కొనుగోలు చేయడంపైనే ఎక్కువ దృష్టి సారించారని విమర్శించారు. సుమీ పై రష్యా చేసిన దాడిలో పెద్దసంఖ్యలో ప్రజలు పండుగరోజు మరణి ంచడంతో అనేకదేశాలు రష్యాను విమర్శించాయి. ఈ ఏడాది రష్యా చేసిన అతిపెద్ద దాడి ఇదే. ఈ ఘటన తర్వాత ట్రంప్ జెలెన్స్కీనే ప్రధానంగా తప్పు పట్టారు. ఐతే అంతకుముందు ఈ దాడిని ఆయన భయంకరమైనదిగా పేర్కొన్నారు. ట్రంప్ అధికారం చేపట్టిన తర్వాత ఉక్రేన్ యుద్ధాన్ని ఆపేందుకు తీవ్ర ప్రయత్నాలు ఒకవైపు చేస్తూనే అనేక సార్లు జెలెన్స్కీపై గొంతెత్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫిబ్రవరిలో మొదటిసారి ట్రంప్‌ను జెలెన్స్కీ వైట్‌హౌస్‌లో కలుసుకున్నప్పుడు బాహాటంగా జరిగిన అరుపులాట ప్రపంచాన్ని నివ్వెరపరచింది. రష్యాతో గొడవ పెట్టుకుని మూడో ప్రపంచ యుద్ధంతో నువ్వు చెలగాటం ఆడుతున్నావ్..అని జెలెన్స్కీపై ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ఎదురుతిరిగిన హార్వర్డ్ యూనివర్సిటీకి నిధులు స్తంభింపజేసిన ట్రంప్**

**హార్వర్డ్ :** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం విధించిన షరతులు అంగీకరించకపోవడంతో ఆయన యంత్రాంగం హార్వర్డ్ విశ్వవిద్యాలయానికి రెండు బిలియన్ డాలర్ల ఫెడరల్ ప్రభుత్వ నిధుల సరఫరాను స్తంభింపజేసింది. విశ్వవిద్యాలయాలలో ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా, పాలస్తినాకు అనుకూలంగా వేలాదిమంది నిరసన ప్రదర్శనలు జరుగుతున్నాయి. ఈ నిరసనలకు యూనివర్సిటీలు వేదికగా మారుతూ ఉండటంతో ట్రంప్ వారికి కొన్ని షరతులు విధించారు. గడచిన కొద్ది రోజులుగా ఈ వివాదం కొనసాగుతోంది. అడ్మిషన్లు, యాజమాన్య నిర్వహణ, బోధనావిధానాలు వంటి విషయాలకు సంబంధించి వైట్‌హౌస్ పంపిన డిమాండ్ల జాబితాను యూనివర్సిటీ తిరస్కరించిన కొద్దిగంటలకే ట్రంప్ యంత్రాంగం ఈ నిర్ణయం తీసుకుంది. ట్రంప్ అధికారంలోకి వచ్చినప్పటినుండీ పరిశోధనలపై చాలా ఎక్కువగా ఖర్చులు పెడుతున్న ఉన్నతశ్రేణి విశ్వవిద్యాలయాలను బెదిరింపులకు గురిచేస్తున్నది. దేశంలో ఉన్న అగ్రశ్రేణి విశ్వవిద్యాలయాల పనితీరును పునఃపరిశీలించి ప్రక్షాళన చేయాలని ట్రంప్ ప్రభుత్వం భావిస్తున్నది. ఇందులో భాగంగా, తమ మాట వినకపోతే ఫెడరల్ ప్రభుత్వ నిధుల కేటాయింపు రద్దుచేస్తామని ట్రంప్ ప్రభుత్వం హెచ్చరిస్తున్నది. ఈ క్రమంలో భాగంగానే హార్వర్డ్ విశ్వవిద్యాలయానికి ట్రంప్ యంత్రాంగం మంగళవారంనాడు నిధుల కేటాయింపును రద్దుచేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.

## సింగపూర్ పార్లమెంటు రద్దు

### మే 3న ఎన్నికలు




**సింగపూర్ :** సింగపూర్ పార్లమెంటును రద్దుచేశారు. మే 3వ తేదీన పార్లమెంటుకు మళ్ళీ ఎన్నికలు జరుగుతాయి. ఈ సిటీ స్టేట్‌ను పీపుల్స్ యాక్షన్ పార్టీ (పిఎపి) దీర్ఘకాలంగా పరిపాలిస్తున్నది. ప్రధానమంత్రి లారెన్స్ వోంగ్ నాయకత్వంలో ఈ పార్టీ తిరిగి తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవాలన్న కృతనిశ్చయంతో పార్లమెంటును రద్దు చేసింది. 1965లో సింగపూర్ స్వాతంత్ర్యం సంపాదించుకున్నప్పటినుండీ మధ్యలో కొంత విరామంతో 'పాప్' పరిపాలనలోనే దేశం నడుస్తోంది. గత ఏడాది మే నెలలో లారెన్స్ వోంగ్ దేశ ప్రధానమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. సింగపూర్కు ఆయన నాలుగోతరం నాయకుడు. ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేయడంతో 2020లో ''పాప్'' నాయకత్వానికి చేదు అనుభవాలు ఎదురయ్యాయి. రెండు దశాబ్దాలపాటు దేశాన్ని పాలించిన హ్సీన్ లూంగ్ నుండి అధికారాన్ని స్వాధీనం చేసుకున్నారు. తండ్రి లీ కుయాన్ యూ నుండి ప్రారంభమైన వంశపారంపర్యపాలన గత ఏడాది లీ హ్సీన్ లూంగ్ పదవి నుండి వైదొలడంతో అంతమైంది. లీ కుయాన్ యూ సింగపూర్ తొలి దేశీయ నాయకుడు, దేశాన్ని వాణిజ్యకేంద్రంగా తీర్చిదిద్దారు. ఆయన 31 సంవత్సరాల పరిపాలనలో ప్రపంచంలో అత్యంత ధనిక దేశంగా సింగపూర్‌ను ఆయన తీర్చిదిద్దారు. 2020 ఎన్నికల్లో ''పాప్'' మొత్తం 93 పార్లమెంటు స్థానాలకుగాను 83 స్థానాలు గెలుచుకున్నప్పటికీ ఆ తర్వాత ప్రతిపక్షాలు తమ బలం పెంచుకున్నాయి. పాప్ ప్రజాదరణ కూడా రికార్డుస్థాయిలో తగ్గింది. ఇప్పుడు పార్టీని పునరుద్ధరించేందుకు వీలుగా పాప్ 30 మంది కొత్త అభ్యర్థులను రంగంలోకి దించింది. ఈసారి ఎన్నికలు దేశంలో రాజకీయపార్టీలమధ్య అతిపెద్ద పోటీగా మారాయి. తమ దేశాన్ని మరింత సంపద్వంతంగా, స్థిరంగా, ప్రగతిశీలంగా తీర్చిదిద్దుతామని తిరిగి ఎన్నికల్లో పోటీ చేస్తున్న లారెన్స్ వోంగ్ ఆశాభావం వ్యక్తం చేశారు.





## పాకిస్థాన్‌లో ఉగ్రదాడి

### ముగ్గురు పోలీసులు మృతి

**ఇస్లామాబాద్ :** బలూచిస్థాన్ విమోచన సాయుధ సైన్యం (బిఎల్‌ఎ) చేసిన దాడుల్లో ముగ్గురు పాకిస్థాన్ పోలీసు అధికారులు మరణించారు. ఈ దాడిలో మరో 18 మంది గాయపడ్డారు. కలాత్ నుండి తిరిగి వస్తున్న ఒక పోలీసు వాహనాన్ని లక్ష్యంగా చేసుకున బిఎల్‌ఎ ఉగ్రవాదులు మంగళవారంనాడు దాడి చేశారని బలూచిస్థాన్ ప్రభుత్వ ప్రతినిధి షాహిద్ రింద్ చెప్పారు. ఉగ్రవాదుల దాడిని పాకిస్థాన్ అధ్యక్షుడు జర్దారీ, ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ తీవ్రంగా ఖండించారు. ఉగ్రవాదంపై జరిగే పోరాటం ఆగకుండా కొనసాగుతుందని వారు పేర్కొన్నారు. తీవ్రంగా గాయపడినవారిని క్వెట్టాలోని ఆసుపత్రికి తరలించారు. గత ఏడాది నుండి పాకిస్థాన్‌లో బలూచిస్థాన్ విమోచనదళం ఎంతో చురుగ్గా పనిచేస్తూ హింసాత్మక దాడులు చేస్తోంది.

## సూడాన్ అంతర్యుద్ధ నివారణకు మరో ప్రయత్నం

### అంతర్గత పోరుకు రెండేళ్ళుపూర్తి

### నాలుగు రోజుల దాడుల్లో 300 మంది మృతి





**లండన్ :** ఆఫ్రికా ఈశాన్యప్రాంతదేశం సూడాన్‌లో అంతర్యుద్ధం ప్రారంభమై మంగళవారం నాటికి (ఏప్రిల్ 15) రెండు సంవత్సరాలు పూర్తయింది. ఐనాగానీ సూడాన్‌లో రెండు సైనిక వర్గాలమధ్య జరుగుతున్న అత్యర్యుద్ధం చల్లారలేదు. అంతర్జాతీయ ప్రపంచం జోక్యం చేసుకుని 2023లో జెడ్డాలో సంప్రతింపులు చేసి ఒప్పందం కుదిర్చినప్పటికీ రెండు వర్గాలమధ్య అంతర్యుద్ధాన్ని నివారించలేకపోయారు. తాజాగా మరోసారి ప్రపంచవ్యాప్తంగా ఉన్న దౌత్యవేత్తలు జోక్యం చేసుకుని మంగళవారం నాడు లండన్ వేదికగా ఒక అంతర్జాతీయ సదస్సు ఏర్పాటు చేసి సూడాన్‌లో అంతర్యుద్ధ నివారణకు ప్రయత్నాలు చేస్తున్నారు. బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, యూరోపియన్ యూనియన్, ఆఫ్రియా యూనియన్ దేశాలు కలిసి మంగళవారంనాడు ఈ ఒకరోజు సమావేశం ఏర్పాటు చేశాయి. ఈ రెండేళ్ళ అంతర్యుద్ధంలో వేలాదిమంది మరణించగా, 1.40 కోట్లమంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. కరువు విలయ తాండవం చేస్తున్నది. గతనెలలో సూడాన్ సైన్యం రాజధాని రాష్ట్రం ఖార్టూమ్‌లో పైచేయి సాధించింది. కానీ ఆర్‌ఎస్‌ఎఫ్ వర్గం పశ్చిమ డార్ఫర్‌లోని అధికభాగాన్ని తన అధీనంలోనే ఉంచుకుంది. ఉత్తర డార్ఫర్ రాష్ట్ర రాజధాని ఎల్‌ఫాషర్ ప్రాంతంలో తాత్కాలిక శిబిరాలు వేసుకుని తలదాచుకున్న శరణార్థులపై ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్స్ (ఆర్‌ఎస్‌ఎఫ్) నాలుగు రోజులుగా జరిపిన దాడుల్లో దాదాపు 300 మంది పౌరులు మరణించారు. జామ్ జామ్ శరణార్థ శిబిరంపై గడచిన శుక్రవారం జరిపిన దాడుల్లో 100 మంది మరణించారు. అబూ షౌక్ శరణార్థ శిబిరంపై జరిపిన దాడుల్లో మరణించినవారిలో స్వచ్ఛంధసేవకులు తొమ్మిదిమంది ఉన్నారు. గత ఏడాది మే నెల నుండి ఎల్‌ఫాషర్ ప్రాంతంలో ఆర్‌ఎస్‌ఎఫ్, ఎస్‌ఎఎఫ్ వైరి సైన్యాలమధ్య ఉద్ధృతపోరాటం జరుగుతోంది. 2023 ఏప్రిల్ 15వ తేదీన రంజాన్ సందర్భంగా రెండు సైనిక వర్గాలమధ్య విభేదాలు తలెత్తాయి. అబ్దెల్ ఫతా అల్‌బుర్హాన్ నాయకత్వానగల సూడానీస్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్ (ఎస్‌ఎఎఫ్)కు, పారామిలిటరీ ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్ (ఆర్‌ఎస్‌ఎఫ్), దాని మిత్రకూటమి జంజబీట్ నాయకుడు హేమెద్టిలతో చెలరేగిన ఘర్షణ ఈ రెండు వర్గాలమధ్య అధికారంకోసం అంతర్యుద్ధంగా మారింది. దేశరాజధాని ఖార్టూమ్ రాష్ట్రంలోనే 61,000 మంది మరణించారు. 80.80 లక్షలమంది ఇళ్ళువదలి పారిపోయారు. మరో 30.50 లక్షల మంది ప్రజలు దేశం విడిచి వెళ్ళిపోయారు.

## ఊరుకుంటామా (మొదటి పేజీ తరువాయి)

తొగుట మండలంలో పార్టీ నేతలతో ప్రభాకర్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీపై ఏడాదిలోనే తీవ్ర వ్యతిరేకత వచ్చిందని, బిల్డర్లు, పారిశ్రామికవేత్తలు ప్రభుత్వాన్ని పడగొట్టాలంటున్నారని, అవసరమైతే ఎంఎల్‌ఎలను కొనుగోలు చేయాలని, ఆ ఖర్చుకు డబ్బులు కూడా ఇస్తామంటున్నారని, రాష్ట్రంలో చిన్న పిల్లల నుంచి పెద్దల దాకా అందరూ కాంగ్రెస్ పాలనతో విసిగిపోయారని సంచలన వ్యాఖ్యలు చేశారు.

**బిఆర్‌ఎస్ నేతలది అధికార దాహం : మంత్రి పొంగులేటి**

బిఆర్‌ఎస్ నాయకులు అధికార దాహంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వారం రోజుల నుంచే ప్రభుత్వాన్ని కూల్చివేస్తామని మాట్లాడుతున్నారని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు సూచన మేరకే కొత్త ప్రభాకర్ రెడ్డి ఆ వ్యాఖ్యలు చేశారని అన్నారు. కంచ గచ్చిబౌలిలో 400 ఎకరాల భూమిని ప్రభుత్వం వెనక్కి తీసుకోవడాన్ని బిఆర్‌ఎస్ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు. ఇందిరమ్మ ప్రభుత్వాన్ని కూల్చుతామంటూ బిఆర్‌ఎస్ నేతలు పగటి కలలు కంటున్నారని అన్నారు. కొత్త ప్రభాకర్ రెడ్డి కెసిఆర్ ఆత్మ అని పొంగులేటి అన్నారు. తమ ప్రభుత్వంపై మొదటి నుంచి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. వెంటనే ముఖ్యమంత్రి అయిపోవాలని తండ్రీ కొడుకులు చూస్తున్నారని కెసిఆర్, కెటిఆర్‌లను ఉద్దేశించి అన్నారు.

**పార్టీలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్లు**

పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని నిర్ణయించామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. అర్హులైన అందరికీ సన్న బియ్యం అందిస్తున్నామని చెప్పారు. ఎస్‌సి వర్గీకరణపై ఇప్పటికే జీఓను విడుదల చేశామని అన్నారు. భూభారతి వచ్చాక కొత్త ప్రభాకర్ రెడ్డి గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని ఎద్దేవా చేశారు. అందుకే ఆయన భయాందోళనకు గురవుతున్నారని అన్నారు.

## ఇడి చార్జిషీటు (మొదటి పేజీ తరువాయి)

సమగ్రంగా అందుబాటులోకి తీసుకురావాలి'' అని న్యాయమూర్తి ఈ సందర్భంగా ఆదేశించారు. అక్రమ కార్యకలాపాలద్వారా సంపాదించిన సొమ్మును చట్టానికి తెలియకుండా దాచిపెట్టే వారిని విచారణ చేసేందుకు ఉద్దేశించిన మనీలాండరింగ్ చట్టం సెక్షన్–3,4ల ప్రకారం, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు చెందిన ప్రత్యేక ప్రభుత్వ న్యాయవాది ఎన్.కె.మట్టా ఈ ఛార్జిషీటును దాఖలు చేశారు. ''మొదట ఈ ఫిర్యాదును పరిశీలించి రిజిస్టరు చేసుకోవాల్సి ఉంది, కోర్టు సిబ్బంది ఈ మొత్తం కేసుకు సంబంధించిన పత్రాలను, సంబంధిత స్వాధీన ఆస్తులను ఖరారు చేసుకోవాలి, దీనికి సంబంధించిన వివరాలను ఆన్‌లైన్ ద్వారా పంపించాలని ఇ.డికి ఆదేశిస్తున్నాం, తదుపరి తేదీనాటికి ఇవన్నీ సిద్ధంగా ఉండాలి'' అని న్యాయమూర్తి పేర్కొన్నారు. దీనికి సంబంధించి కుట్ర, మోసం ఇతర నేరారోపణలపై సిబిఐ దర్యాప్తు చేస్తున్న కేసులు ఇతర కోర్టులలో ఉంటే వాటిని తమ కోర్టుకు బదిలీ చేయాలని కోరుతూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఒక విజ్ఞప్తిని జిల్లా న్యాయమూర్తి ఎదుట దాఖలు చేయాలని కూడా ప్రత్యేక న్యాయమూర్తి గోగ్నే చెప్పారు. తప్పులు జరిగాన్న ఆరోపణలపై దర్యాప్తులు జరుతుంటే ఈ కేసులను ఆయా కోర్టుల పరిధి నుండి తెచ్చి ఒకే కోర్టులో విచారణ చేయాల్సిన అవసరం ఉందని న్యాయమూర్తి చెప్పారు. పిఎంఎల్‌ఎ చట్టంలోని సెక్షన్ త్రీ కింద వీటిని పరిగణనలోకి తీసుకుంటామన్నారు. సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ ఇద్దరూ వరుసగా పార్లమెంటు ఉభయసభల్లో ప్రాతినిధ్యం వహిస్తున్నారు. పిఎంఎల్‌ఎ చట్టం కింద ఈ కేసులను సంబంధిత కోర్టులో మాత్రమే విచారణ చేయాల్సి ఉంటుందని న్యాయమూర్తి పేర్కొన్నారు. నేరం జరిగిందన్న ఊహతో ఈ ఆరోపణలు చేసి కేసులు నమోదు చేసినందువల్ల నిరూపణ కాని ఈ ఈ ఊహాజనిత ఫిర్యాదులకు సంబంధించిన అన్ని వివరాలను న్యాయస్థానం పూర్తిగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొంది. ఈ అంశాన్ని ఇతర కోర్టులకు బదిలీచేసే అధికారం ఈ కోర్టుకు లేదని పేర్కొంది. 2021లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఈ కేసు దర్యాప్తు ప్రారంభించింది. బిజెపి నాయకుడు సుబ్రహ్మణ్యస్వామి 2014 జూన్ 26న ఢిల్లీలోని పటియాలా హౌస్ కోర్టులో వ్యక్తిగతంగా ఫిర్యాదు చేశారు. ఈ వ్యక్తిగత ఫిర్యాదును మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ పరిగణనలోకి తీసుకుని పరిశీలన చేపట్టడంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఒరగంలోకి దిగి దర్యాప్తు ప్రారంభించింది. అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఎజెఎల్)కు చెందిన రూ.2000 కోట్లు విలువైన ఆస్తులను మోసపూరితగా స్వాధీనం చేసుకోవడంలో సోనియా గాంధీ, ఆమె కుమారుడు ఎంపి రాహుల్‌గాంధీలతోపాటు మరణించిన కాంగ్రెస్ నాయకులు మోతీలాల్ వోరా, ఆస్కార్ ఫెర్నాండెజ్ యంగ్ ఇండియన్ కంపెనీలో డైరెక్టర్లుగా ఉన్నారు. రూ.5 లక్షలతో ఈ కంపెనీ పెట్టారు. ఇందులో 76 శాతం సోనియా,రాహుల్ వాటాగా ఉండగా, మిగిలినవి వోరా, ఫెర్నాండెజ్‌ల వాటాగా ఉన్నాయి. 1937లో ఐదువేలమంది స్వాతంత్ర్య సమరయోధులను షేర్‌హోల్డర్లుగా పెట్టి జవహర్‌లాల్ నెహ్రూ ఈ ఎజెఎల్ అన్‌లిస్టెడ్ పబ్లిక్ లిమిటెడ్ కంపెనీ పెట్టారు. ఇది నెహ్రూ సొంత ఆస్తి కాదు. షేర్‌హోల్డర్లకు చెందాల్సిన ఈ ధనాన్ని అక్రమ మార్గంలో స్వాధీనం చేసుకోవడంకోసమే యంగ్ ఇండియన్ ప్రైవేటు కంపెనీ పెట్టి అందులోకి ఆ డబ్బునంతా బదిలీచేసే కుట్ర జరిగిందన సుబ్రమణ్యస్వామి తన పిటిషన్‌లో ఆరోపించారు. అవినీతి జరిగిందన్న ఊహతో ఆయన ఈ పిటిషన్ వేశారు. ఈ వాస్తవాలను తెలుసుకోవడానికి ఇ.డి.రంగంలోకి దిగి దర్యాప్తు ప్రారంభించింది. నేషనల్ హెరాల్డ్ పత్రిక ప్రచురణకర్త ఎజెఎల్ కంపెనీ. ఇందులో వార్తాపత్రికతోపాటు వెబ్‌పోర్టల్ కూడా ఉంది. ఇది యంగ్ ఇండియన్ ప్రైవేటు లిమిటెడ్ సొంతం. సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలు ఇందులో మేజర్ షేర్ హోల్డర్లుగా ఉన్నారు. కొన్ని సంవత్సరాలక్రితం ఈ కేసులో ఇ.డి అధికారులు సోనియా,రాహుల్‌గాంధీలను అనేక గంటలపాటు ప్రశ్నించి వారి వాంగ్మూలాన్ని రికార్డు చేశారు. యంగ్ ఇండియన్ అనేది సోనియా,రాహుల్‌లకు సంబంధించిన దనీ, ఇందులో వారే ప్రధాన లబ్ధిదారులనీ, ఎజెఎల్‌కు చెందిన రూ.2000 కోట్లు ఆస్తులను కేవలం రూ.50 లక్షలు పెట్టుబడిగా పెట్టి సొంతం చేసుకునేందుకు యత్నించారనీ కనుగొన్నట్లు ఇడి పేర్కొంది.

## నిధులు ఇస్తుందా? (మొదటి పేజీ తరువాయి)

నుంచి ఒకేసారి రూ.లక్షన్నర కోట్లు కావాలని ప్రతిపాదనలు పంపిస్తే ఎలా? అని అన్నారు. వివిధ రాష్ట్రాలకు ప్రాధాన్యత క్రమంలో నిధులు కేటాయిస్తున్నామని వివరించారు. హైదరాబాద్‌లో ఎక్కువ ఆదాయం వస్తుందని, ఆదిలాబాద్‌లో తక్కువ ఆదాయం వస్తుందని, అలాగని ఆదిలాబాద్ జిల్లాకు నిధులు కేటాయించవద్దు అని అంటామా? అని అన్నారు. రక్షణ రంగంలో రాజీపడే పరిస్థితి ఉండబోదని, రక్షణ రంగానికి నిధులు కేటాయించాలని, జాతీయ రహదారులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. వక్స్ ఆస్తులపైన వక్ఫ్ బోర్డు తీసుకున్న నిర్ణయంపైన తాము కోర్టుకు వెళ్లే అవకాశం కల్పించామని, వక్ఫ్ చట్టం తెస్తామని తాము మేనిఫెస్టోలో పెట్టామన్నారు. అన్యాక్రాంతం అవుతున్న భూములను కాపాడటమే తమ లక్ష్యమని, వక్ఫ్ భూముల పైన అక్రమంగా లబ్ధి పొందిన వారే ఈ ధర్నాలు చేస్తున్నారని ఆరోపించారు. వక్ఫ్ నుంచి ఆదాయం పెంచుతామని, వచ్చిన ఆదాయాన్ని వారికే పంచుతామన్నారు. పాత బస్తీలో హిందువుల బస్తీలు ఖాళీ అవుతున్నాయని కిషన్ రెడ్డి అన్నారు. వారిని భయ భ్రాంతులకు గురి చేసి, అక్కడి నుంచి వెళ్లిపోయేలా కొంతమంది ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. పాత బస్తీకి పరిమితమైన ఎంఐఎం ఇప్పుడు కొత్త నగరానికి విస్తరిస్తోందని, ఎర్రగడ్డ, బోరబండ, అంబర్‌పేట్, ముషీరాబాద్ బోలక్‌పూర్ లాంటి ప్రాంతాల్లో ఎంఐఎం విస్తరిస్తోందని చెప్పారు. ఈ పార్టీకి కాంగ్రెస్, బిఆర్‌ఎస్ సహకరిస్తోందని ఆరోపించారు. ఎవరు అధికారంలో ఉంటే వారితో ఎంఐఎం నేతలు అంటకాగుతున్నారని మండిపడ్డారు. దేశవ్యాప్తంగా పోటీ చేస్తున్న ఎంఐఎం తెలంగాణ రాష్ట్రంలో మాత్రం బిజెపి గెలవకుండా ఎన్నికల్లో పోటీ చేయకుండా దూరంగా ఉంటుందన్నారు.

**భూముల అమ్మకాలతో పరిపాలన చేయాలని చూస్తున్న రేవంత్ రెడ్డి..**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వద్ద నిధులు లేవని, అందుకే ప్రభుత్వ భూములను విక్రయిస్తున్నారని కిషన్ రెడ్డి ఆరోపించారు. మద్యం, భూములు అమ్మడం ద్వారా నిధులు రాబట్టి పరిపాలన చేయాలని రేవంత్ ప్రభుత్వం చూస్తోందన్నారు. బిజెపి ప్రభుత్వం ఏ రాష్ట్రంలోనూ భూములు అమ్మలేదని, ఇంట్లో ఉన్న చెట్టు కొట్టాలన్న జిహెచ్‌ఎంసిలో పర్మిషన్ తీసుకోవాలని, అలాంటి హెచ్‌సియులో చెట్లను ఎలా కొట్టారని ప్రశ్నించారు. రేవంత్ ప్రభుత్వం కన్జర్వేషన్ యాక్ట్‌ను ఉల్లంగించిందన్నారు. గుజరాత్ వ్యాపారులకు ఏం పనిలేదా, వారు ఎందుకు రేవంత్ ప్రభుత్వాన్ని కులుస్తారని, అయినా కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతే తమకు ఇప్పటికిప్పుడు ఏం ప్రయోజనం అని కిషన్ రెడ్డి అన్నారు.

**ఎస్‌సి,ఎస్‌టిల రిజర్వేషన్లు పెంచే అధికారం రాష్ట్రాలకే :** ఎస్‌సి, ఎస్‌టిలకు రిజర్వేషన్లు పెంచే అధికారం రాష్ట్రాలకే ఉంటుందని, ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ఎన్‌డిఎ ప్రభుత్వం కేటగిరీలు చేస్తుందని కిషన్ రెడ్డి వివరించారు. రేషన్ కార్డులైన సరఫరా అవుతున్న బియ్యంలో కేంద్రం వాటా ఉన్నదన్నారు. కేంద్రం సరఫరా చేస్తున్న 5 కిలోలు బియ్యం కాకుండా అదనంగా సన్న బియ్యంను పంపిణీ చేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు.

## హైలెవల్ కమిటీ (మొదటి పేజీ తరువాయి)

ప్రజల దృష్టిని మరల్చడానికే అని ప్రతిపక్షపార్టీ ఆరోపించింది. కేంద్రంలో బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎపై దాడి చేసేందుకు ముఖ్యమంత్రి స్టాలిన్ ఒక అడుగు ముందుకు వేశారు. కేంద్ర, రాష్ట్రాల మధ్య సంబంధాన్ని సమగ్రంగా పరిశీలించడానికి మాజీ సుప్రీంకోర్టు జడ్జి కురియన్ జోసెఫ్ అధ్యక్షతన ఒక ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు స్టాలిన్ ఈ సందర్భంగా చెప్పారు.ఆ కమిటీ తన మధ్యంతర రిపోర్ట్‌ను 2026 జనవరిలో సమర్పించనున్నట్లు తెలియజేశారు. రెండు సంవత్సరాలలో ఆ కమిటీ తన తుదినివేదికను సమర్పిస్తుందని స్టాలిన్ చెప్పారు. ఈ ప్యానెల్‌లో మాజీ బ్యూరోక్రాట్ అశోక్‌వర్ధన్ శెట్టి, రాష్ట్ర ప్రణాళికా సంఘం మాజీ వైస్‌చైర్మన్ ఎం.నాగనాథన్ సభ్యులుగా ఉంటారు.'ఈ అత్యున్నత స్థాయి కమిటీ చట్ట ప్రకారం రాష్ట్ర జాబితా నుంచి వెళ్లిన అంశాలను రాష్ట్రం నుంచి ఉమ్మడి జాబితాకు బదిలీ చేయడంపై అధ్యయనం చేస్తుంది' అని ముఖ్యమంత్రి స్టాలిన్ చెప్పారు. నేషనల్ ఎలిజిబిలిటీకమ్‌ఎంట్రెన్స్ టెస్ట్ (నీట్) రాష్ట్రాల పరిధికి వెలుపల ఉందన్న విషయాన్ని స్టాలిన్ ఈ సందర్భంగా ప్రత్యేకంగా ప్రస్తావించారు. 'తమిళనాడు సంక్షేమాన్ని పరిగణనలోనికి తీసుకుని మేం అధికార వికేంద్రీకరణ, నిధుల కోసం పట్టుబట్టటం లేదు కానీ గుజరాత్ నుంచి ఈశాన్య ప్రాంతాల వరకు, కాశ్మీర్ నుంచి కేరళ వరకు విస్తరించి ఉన్న దేశ ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుంటున్నాం' అని స్టాలిన్ తమిళనాడు అసెంబ్లీలో ఒక ప్రకటన చేసిన సందర్భంగా చెప్పారు. రాష్ట్ర స్వయం ప్రతిపత్తిపై చర్చలకు తమిళనాడు మొదటి వేదిక అవబోతుందన్న విషయాన్ని ఆయన అంగీకరించారు. భిన్నత్వంలో ఏకత్వం అనే ప్రాతిపదికన పనిచేసే ఇండియాలోని అన్ని రాష్ట్రాల హక్కులను పరిరక్షించేందుకే ఈ అత్యున్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేయడంలోని ముఖ్యోద్దేశం అని స్టాలిన్ తెలిపారు. రాష్ట్ర స్వయంప్రతిపత్తిని ప్రోత్సహించే ఏదైనా ఆతరహా చర్యలను అసెంబ్లీలోని బిజెపి ఎమ్మెల్యేలు నిరసిస్తూ శాసనసభ నుండి వాకౌట్ చేశారు. కాంగ్రెస్ నేతృత్వంలోని యుపిఎతోఅధికారాన్నిపంచుకున్నప్పుడు డిఎంకెకు ఎందుకు ఈ విషయం గుర్తురాలేదో మేం తెలుసుకోవాలనుకుంటున్నామని అసెంబ్లీ నుంచి వాకౌట్ చేసిన ప్రతిపక్ష ఎఐడిఎంకె డిప్యూటీ లీడర్ ఆర్‌బి.ఉదయకుమార్ అసెంబ్లీ బయట విలేకరులతో మాట్లాడిన సందర్భంగా అన్నారు. దీనిపై స్పందించిన న్యాయ శాఖ మంత్రి ఎస్.రెగుపథి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రసంగించకుండాఉద్దేశపూర్వకంగాఅడ్డుకునేందుకే శాసనసభ నుంచి ఎఐడిఎంకె సభ్యులు వాకౌట్ చేశారని విమర్శించారు. 2026 అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే ఈ ప్రకటన చేశారన్న బిజెపి విమర్శలకు మంత్రి రెగుపథి స్పందిస్తూ రాబోయే ఎన్నికలలో స్టాలిన్ నాయకత్వ సారథ్యంలో డిఎంకె మళ్లీ అధికారంలోకి రాబోతున్నదని తిరుగు సమాధానమిచ్చారు.

## నిశ్శబ్ద విప్లవాలు

(మొదటి పేజీ తరువాయి)

ఆయన పేర్కొన్నారు. సంక్షేమ పథకాలు, బిసి కుల సర్వే, ఎస్‌సి వర్గీకరణ నిశ్శబ్ద విప్లవాలని, వీటి ఫలితాలను కాంగ్రెస్ పార్టీ ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ''రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమం ఒక ఎత్తయితే ఎస్‌సి వర్గీకరణ, బిసి కుల గణన పకడ్బందీగా పూర్తి చేశాం. ఈ రెండు అంశాలు గత కొన్ని దశాబ్దాలుగా గొప్ప గొప్ప నాయకులే చేయలేకపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం ధీరోదాత్తంగా అందరికీ చెప్పి చేసింది. ఈ రెండు అంశాలు చేయాలని ఇప్పుడు దేశవ్యాప్తంగా డిమాండ్ మొదలవుతుంది'' అని భట్టివిక్రమార్క అన్నారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని భావించి కంచ గచ్చిబౌలిలో ఏనుగులు, పులులు తిరుగుతున్నట్టు బిజెపి, బిఆర్‌ఎస్ కలిసి ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ని ఉపయోగించి కుట్రలు చేస్తున్నాయని భట్టివికక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. బిసి కుల సర్వే బిసిల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందని, బిసిలంతా ఏకమై కాంగ్రెస్ ప్రభుత్వం కలిసి రావాలని బహుజనవర్గాలను చైతన్యం చేయాలన్నారు. కులగణన ద్వారా పొందాల్సిన ఫలితాలను అందుకున్నామన్నారు.

## మోదీ ఉక్కిరిబిక్కిరి

(మొదటి పేజీ తరువాయి)



రాయబోతోందని, అందుకే తెలంగాణలో కాంగ్రెస్‌ను ఇబ్బంది పెట్టాలనే బిజెపి, బిఆర్‌ఎస్ పార్టీలు ఒక్కటయ్యాయన్నారు. హెచ్‌సియు భూములపై ప్రతిపక్షం ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌తో ఒక అబద్ధపు ప్రచారం చేసిందని, ఈ ప్రచారాన్ని ప్రధాని మోదీ కూడా నమ్మి కాంగ్రెస్ ప్రభుత్వం హెచ్‌సియు భూములలోకి బుల్డోజర్లు పంపిస్తున్నదని మాట్లాడడం విచారకరమన్నారు. కాంగ్రెస్ ను ఇబ్బంది పెట్టాలనే బిజెపి, బిఆర్‌ఎస్ ఒక్కటయ్యాయని సిఎం అన్నారు. కాంగ్రెస్ శాసనసభా పక్షం (సిఎల్‌పి) సమావేశం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లోని నోవాటెల్ హోటల్‌లో జరిగింది. సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రులు, ఎంఎల్‌సిలు, ఎంఎల్‌ఎలు ఎంపిలు పాల్గొన్నారు. రాష్ట్రంలో తాజా రాజకీయ పరిస్థితితులు, ప్రభుత్వం అమలు చేస్తున్న భూభారతి, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, ఎస్‌సి వర్గీకరణ తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సిఎం రేవంత్‌రెడ్డి పార్టీ నేతలకు దిశా నిర్దేశం చేశారు. కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వ ప్రతిష్ట పెరిగితేనే భవిష్యత్ ఉంటుందని, పార్టీ మళ్లీ గెలవాలంటే ఇప్పటి నుంచే ప్రజల్లోకి వెళ్లాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ప్రభుత్వం ఎంత మంచి చేసినా ప్రజల్లోకి తీసుకెళ్లకపోతే ప్రయోజనం ఉండదన్నారు. ఎంఎల్‌ఎలు ప్రతి గ్రామంలో పర్యటించేలా కార్యాచరణ చేపట్టాలని, రేపటి నుంచి జూన్ 2 వరకు ఎంఎల్‌ఎలు గ్రామాల్లో పర్యటించాలని, తాను కూడా మే 1 నుంచి జూన్ 2 వరకు ప్రజలతో మమేకమవుతానని సిఎం అన్నారు. ఎంఎల్‌ఎలు నియోజకవర్గంలో ఏం కావాలో ఒక నివేదిక తయారు చేసుకోవాలని, ఆ పనులను పూర్తి చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. సన్న బియ్యం కాంగ్రెస్ పథకం అని, అది కాంగ్రెస్ పేటెంట్, బ్రాండ్ అన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో సన్నబియ్యం ఎందుకు ఇవ్వడంలేదో చెప్పాలన్నారు. ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని కొన్ని సమస్యలకు మన ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపిందని, సన్నబియ్యం పథకం ఒక అద్భుతమని, ఆనాడు రూ.2 కిలో బియ్యంలా ఇప్పుడు సన్నబియ్యం పథకం శాశ్వతంగా గుర్తుండే పథకమన్నారు. భూ భారతిని రైతులకు చేరవేయాలన్నారు. దేశంలోనే ఇందిరమ్మ ఇండ్లు పథకం ఆదర్శంగా నిలిచిందని, క్షేత్ర స్థాయిలో నిజమైన లబ్ది దారులకు ఇందిరమ్మ ఇండ్లు అందాలన్నారు. కులగణన ద్వారా వందేళ్ల సమస్యను శాశ్వతంగా పకడ్బందీగా పరిష్కరించామని, విద్యా, ఉద్యోగ, రాజకీయాల్లో బలహీన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని బిల్లులు తీసుకొచ్చామని, ఇది కాంగ్రెస్ ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శనమన్నారు. జటిలమైన ఎస్‌సి ఉప కులాల వర్గీకరణ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపామని, అందుకే వర్గీకరణ జరిగే వరకు ఒక్క ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వలేదన్నారు. ప్రభుత్వం తీసుకున్న గొప్ప నిర్ణయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

**పార్టీ నియమనిబంధనలను ఉల్లంఘిస్తే ఊరుకునేదిలేదు**

పార్టీ నియమనిబంధనలను ఉల్లంఘిస్తే ఊరుకునేది లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. 'పార్టీకి ఇబ్బంది కలిగిస్తే నేతలే ఇబ్బందులు ఎదుర్కొంటారు. పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడితే లాభం కంటే నష్టమే ఎక్కువ. మంత్రివర్గ విస్తరణపై అధిష్టానం నిర్ణయమే ఫైనల్. దీనిపై ఎవరేం మాట్లాడినా ఉపయోగం లేదు' అని సిఎం స్పష్టం చేశారు.

## నోవాటెల్ లో సిఎం రేవంత్ రెడ్డికి తప్పిన ప్రమాదం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లోని నోవాటెల్ హోటల్‌లో మంగళవారం జరిగిన కాంగ్రెస్ శాసనసభా పక్షం (సిఎల్‌పి) సమావేశానికి హాజరైన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రమాదం తప్పింది. నోవాటెల్‌లో సిఎం ఎక్కిన లిఫ్ట్‌లో స్వల్ప అంతరాయం ఏర్పడింది. ఎనిమిది మంది ఎక్కాల్సిన లిఫ్ట్‌లో 13 మంది ఎక్కడంతో మొరాయించింది. ఓవర్ వెయిట్ కారణంగా ఉండాల్సిన ఎత్తుకంటే లిఫ్ట్ కిందికి దిగింది. దీంతో అధికారులు ఆందోళనకు గురయ్యారు. అటు హోటల్ సిబ్బంది, అధికారులు అప్రమత్తమయ్యారు. వెంటనే లిఫ్ట్ ఓపెన్ చేసి సిఎం రేవంత్‌రెడ్డిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. అనంతరం సిఎంను అధికారులు వేరే లిఫ్ట్‌లో పంపారు. త్రుటిలో ముఖ్యమంత్రికి ప్రమాదం తప్పడంతో అక్కడ ఉన్న నేతలు, అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## ఆదినారాయణకు భారతీయ భాషా సమ్మాన్ యువ పురస్కారం

ప్రజాపక్షం/హైదరాబాద్ : ఉస్మానియా యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ (పి.టి) కవి, రచయిత, డా.గిన్నారపు ఆదినారాయణకు 'భారతీయ భాషాపరిషత్ యువపురస్కారం 2025' దక్కించుకున్నారు. తెలుగు భాషా పరిశోధన, సృజనాత్మక సాహిత్య రంగంలో కృషి చేసినందుకు గాను ఈ పురస్కారాన్ని ప్రకటించారని, 51,000 నగదుతో పాటు, ప్రశంసాపత్రం, శాలువాతో సత్కరిస్తారని ఒక ప్రకటనలో ఆదినారాయణ చెప్పారు. ఈ పురస్కారాన్ని మే 01, 2025 కోల్‌కత్తాలో ప్రదానం చేస్తారని ఆయన వెల్లడించారు. ఈమేరకు భారతీయ భాషాపరిషత్ అధ్యక్షురాలు డాక్టర్ కూసుమ్ ఖేవాణి తనకు లేఖ పంపించారని చెప్పారు. భూపాలపల్లి జిల్లా చిట్యాల గ్రామవాసి. అత్యంత నిరుపేద కుటుంబం నుంచి ఎన్నో కష్టాలు ఎదుర్కొని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో ఎం.ఎ, ఎంఫిల్, పిహెచ్.డి తెలుగు పూర్తిచేశారు. డా.గిన్నారపు ఆదినారాయణ హైదరాబాద్ దళిత ఆత్మ కథలపై డాక్టరేట్ చేశారు. కొలకలూరి ఇనాక్ గారి ఆది ఆంధ్రుడు కావ్యంపై ఎం.ఫిల్ చేశారు.

## 'గ్లోబల్ బిజినెస్ హబ్'గా మారిన హైదరాబాద్

2030 నాటికి 200 మిలియన్ చదరపు అడుగుల కమర్షియల్ స్పేస్ అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యం

'సిటిజెన్స్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్' ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు




ప్రజాపక్షం/హైదరాబాద్ : 'గ్లోబల్ బిజినెస్ హబ్'గా హైదరాబాద్ మారిందని ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. హైదరాబాద్ నానక్‌రాంగూడలో యూఎస్‌కు చెందిన సిటిజెన్స్ ఫైనాన్షియల్ గ్రూప్, కాగ్నిజెంట్ టెక్నాలజీస్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన 'సిటిజెన్స్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్'ను ఆయన మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ... హైదరాబాద్‌లో 2030 నాటికి 200 మిలియన్ చదరపు అడుగుల గ్రేడ్ 'ఎ' కమర్షియల్ స్పేస్‌ను అందుబాటులోకి తేవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు.. అందుకు అనుగుణంగానే కమర్షియల్ స్పేస్‌కు డిమాండ్ పెరిగిందని శ్రీధర్‌బాబు అన్నారు. ఢిల్లీ, చెన్నై లాంటి మెట్రోనగరాల్లో కమర్షియల్ స్పేస్‌కు డిమాండ్ తగ్గుతుంటే మనదగ్గర గతేడాది దేశంలోనే అత్యధికంగా 56 శాతం వార్షిక వృద్ధి రేటు నమోదయ్యిందన్నారు. గతేడాది రిటైల్ రంగంలో 1.8 మిలియన్ చదరపు అడుగుల స్పేస్‌ను వివిధ సంస్థలు లీజుకు తీసుకున్నాయన్నారు. హైదరాబాద్‌లో ఆమ్జెన్, గ్లోబల్ లాజిక్, ఎలీ లిల్లీ, మారియంట్, సిగ్నా లాంటి అంతర్జాతీయ సంస్థలకు చెందిన 355 జిసిసిలుండగా... 3 లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తున్నాయన్నారు. ఏడాది వ్యవధిలో 70కి పైగా కొత్త జిసిసిలు హైదరాబాద్‌లో ప్రారంభమయ్యాయన్నారు.

హైదరాబాద్‌ను జిసిసిలకు హబ్‌గా మార్చడమే కాకుండా... వాటిని ఇన్నోవేషన్, ఆర్అండ్‌డి, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ తదితర అంశాల్లో సేవలు అందించే గ్లోబల్ వాల్యూ యాడెడ్ సెంటర్లుగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

2030 నాటికి దేశ జిడిపిలో తెలంగాణ వాటా ట్రిలియన్ డాలర్లకు చేరుతుందన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొచ్చి.. యువతకు ఉద్యోగాలు కల్పించడమే తమ లక్ష్యమని వివరించారు. కొందరు కావాలనే పనిగట్టుకొని పెట్టుబడులు రాకుండా దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అయినా... సిఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజాప్రభుత్వంపై నమ్మకంతో ఎంతో మంది పారిశ్రామికవేత్తలు పరిశ్రమలు స్థాపించేందుకు ముందుకు వస్తున్నారని... వారికి అన్నిరకాలుగా అండగా ఉంటామన్నారు.

తమ జిసిసిని హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చిన సిటిజెన్స్ ఫైనాన్షియల్ గ్రూప్, కాగ్నిజెంట్ టెక్నాలజీస్ నిర్వాహకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం వేయి మంది ఐటి, డేటా నిపుణులకు ఇక్కడ ఉపాధి అవకాశాలు లభిస్తాయని... రెండు, మూడేళ్లలో ఈ సంఖ్య రెట్టింపు అవుతుందన్నారు. కార్యక్రమంలో స్పెషల్ సిఎస్ జయేష్ రంజన్, సిటిజన్స్ ఫైనాన్షియల్ గ్రూప్ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్, హెడ్ ఆఫ్ ఎంటర్‌ప్రైజ్ టెక్నాలజీ, సెక్యూరిటీ మైకెల్, కాగ్నిజెంట్ ప్రెసిడెంట్ అమెరికా సూర్య గుమ్మాడి తదితరులు పాల్గొన్నారు.

## కర్ణాటక మంత్రితో రైతుకమిషన్ భేటీ



ప్రజాపక్షం/హైదరాబాద్ : కర్ణాటక రాష్ట్ర మైనర్ ఇరిగేషన్ శాఖ మంత్రి బోసురాజుతో బేగంపేట టూరిజం ప్లాజాలో రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి, సభ్యులు భవానీ రెడ్డిలు మంగళవారం సమావేశమయ్యారు. ఇరు రాష్ట్రాలకు చెందిన మైనర్, మేజర్ ఇరిగేషన్‌లపై మంత్రి బోసురాజుతో చర్చించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత ప్రభుత్వం మైనర్ ఇరిగేషన్‌ను మేజర్ ఇరిగేషన్‌తో కలపడం వల్ల.. చెరువులు మరమ్మతులు జరగక, కబ్జాలకు గురై భూగర్భ జలాలు అడుగంటుకుపోయాయని, కమిషన్ ఇప్పటికే మైనర్ ఇరిగేషన్‌ను విడదీసి స్థానిక రైతులను నీటి సంఘాలుగా ఏర్పాటు చేసి, భూగర్భ జలాలు పెంపొందింపజేయడానికి తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఒక నివేదిక ఇచ్చినట్లు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి మంత్రి బోసురాజుకు వివరించారు. కర్ణాటక రాష్ట్రంలో అమలవుతున్న మైనర్ ఇరిగేషన్ పాలసీపై ఆయనతో చర్చించారు. తమ రాష్ట్రానికి వచ్చి మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులను ఒకసారి సందర్శించి పరిశీలించాలని మంత్రి బోసురాజు రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డిని ఈ సందర్భంగా ఆహ్వానించారు.

## నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా..
# మే 20న దేశవ్యాప్త కార్మిక సమ్మె

ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ పిలుపు




ప్రజాపక్షం/హైదరాబాద్ : కార్మిక హక్కులను హరించే నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా మే 20వ తేదీన తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె విజయవంతం చేసేందుకు విస్తృత స్థాయిలో ప్రచారం నిర్వహించాలని కార్మికులకు ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం. నరసింహ పిలుపునిచ్చారు. హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో హైదరాబాద్ జిల్లా కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నరసింహ మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం గత 10 సంవత్సరాలుగా ప్రజలను మరొక మారు బానిసత్వంలోకి తీసుకువెళ్లే పద్ధతుల్లో రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్రలు చేస్తుందని విమర్శించారు.

గతంలో రైతు చట్టాలను మార్చేందుకు ప్రయత్నించిన కేంద్ర బిజెపి సర్కార్ విఫలమైందన్నారు. ప్రస్తుతం కార్మిక చట్టాలను మార్చేందుకు ప్రయత్నిస్తున్న బిజెపి ప్రభుత్వాన్ని మెడలు వంచి, లేబర్ కోడ్‌లను వెనక్కి పంపేందుకు కార్మిక వర్గం పోరాటాలు నిర్వహించాల్సి ఉన్నదన్నారు. రాష్ట్రంలో ఉన్న ప్రతి కార్మికవాడలో ప్రజా సమూహంలో కార్మిక సంఘాలు తిరిగి ప్రచారం నిర్వహించి, ప్రజలను కార్మికులను సమ్మెకు సన్నద్ధం చేయాలన్నారు.

కార్మికులను, ప్రజలను చైతన్యపరిచేందుకు ఈనెల 19వ తేదీన కోఠి ప్రాంతంలో, మే 6వ తేదీన సికింద్రాబాద్ ప్రాంతంలో, మే 10వ తేదీన అమీర్‌పేట్ ప్రాంతంలో విస్తృతంగా కరపత్రాలు పంచి చైతన్యపరచాలని, కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ మే 13వ తేదీన సెంట్రల్ లేబర్ కార్యాలయాన్ని ముట్టడించి, నిరసన కార్యక్రమాన్ని నిర్వహించాలని, మే 18వ తేదీన హైదరాబాద్ నగర వ్యాప్తంగా బైక్ ర్యాలీలను నిర్వహించాలని, మే 20వ తేదీన ఇందిరా పార్క్‌లో భారీ బహిరంగ సభను కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తామని నరసింహ వివరించారు. సమావేశానికి ఎఐటియుసి నగర ప్రధాన కార్యదర్శి కమతం యాదగిరి అధ్యక్షత వహించగా సిఐటియు నగర అధ్యక్షుడు జె.కుమారస్వామి, టియుసిఐ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్.ఎల్.పద్మ, ఐఎఫ్‌టియు నగర నాయకులు అరుణ, శివ బాబు, ఎఐయుటియుసి నాయకులు భరత్, టిఎన్‌టియుసి నాయకులు రత్నం, ఎఐటియుసి నగర వర్కింగ్ ప్రెసిడెంట్ పి.వెంకటయ్య, ఉపప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి కిషన్, అజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో నా స్థానం ఏంటి?

నాలుగు దశబ్దాలుగా పార్టీ కోసం పనిచేస్తున్నా

మాజీ మంత్రి జీవన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి : నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీతో అనుబంధం ఉన్నదని, పార్టీ కోసం పనిచేస్తున్నానని, బిఆర్ఎస్ హయాంలో 10ఏళ్ళు ఒంటరి పోరాటం చేసిన, ఇప్పుడు పార్టీలో నా స్థానం, నా సీనియారిటి ఏంటి? అని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. జగిత్యాలలో మంగళవారం జీవన్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ పార్టీలో నా సీనియారిటీకీ స్థానం ఏమిటనే భావన నాలో ఉందన్నారు. ఒక దశలో జీవన్‌రెడ్డి బావోద్వేగానికి లోనయ్యారు. కాంగ్రెస్ అంటే జీవన్ రెడ్డి, జీవన్ రెడ్డి అంటే కాంగ్రెస్ అనీ అంటారని ఆయన పేర్కొన్నారు. పార్టీ బలోపేతం కోసం పనిచేస్తున్నా,దశాబ్దకాలం పోరాటం చేశానని చెప్పుకొచ్చారు. ఏమాత్రం తోనకకుండా, కాంప్రమైజ్ కాకుండా 10 ఏళ్ళు ఒంటరి పోరాటం చేశానని జీవన్ రెడ్డి చెప్పారు.పీసీసీ అధ్యక్షుడు హోదాలో రేవంత్ రెడ్డి, సిఎల్పీ నేతగా భట్టి విక్రమార్క ఎంత పోరాడరో శాసన మండలిలో ఏకైక సభ్యుడిగా నేను అంతే పోరాటం చేశానని నేనేమి తక్కువ కాదని తెల్చి చెప్పారు. 2014లో బిఆర్ఎస్ ప్రభంజనంలో తట్టుకుని జగిత్యాల నుంచి ఎమ్మెల్యేగా గెలువడమే కాకుండా ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ ఉమ్మడి 3 జిల్లాలో ఏకైక కాంగ్రెస్ ఎమ్మెల్యేగా పని చేసి పార్టీ పటిష్టతకు పాటుపడ్డనని జీవన్ రెడ్డి అన్నారు.2019 లో మార్చి వరకు 6 ఏళ్ళు శాసన మండలిలో ఏకైక కాంగ్రెస్ పార్టీ సభ్యుడిగా బీఆర్ఎస్ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం చేశాననీ జీవన్ రెడ్డి గుర్తు చేశారు.తెలంగాణ రాష్ట్రకాంగ్రెస్ పార్టీలో నాకన్న సీనియర్ ఎవరూ లేరని, ఇప్పుడు ఉన్న వారిలో వి.హన్మంత రావు ఒక్కరే నాకన్న సీనియర్ అనీ పేర్కొన్నారు.జానారెడ్డి కూడా నా తర్వాత 4 సంవత్సరాలకు కాంగ్రెస్ పార్టీలో చేరారనీ చెప్పారు. పార్టీకి ఎప్పుడు నేను వ్యతిరేకంగా మాట్లాడలేదనీ, పార్టీ బలోపేతం కోసమే పనిచేస్తున్నానని జీవన్ రెడ్డి స్పష్టం చేశారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు బండ శంకర్,కొత్త మోహన్, గాజుల రాజేందర్,మసర్తి రమేష్, ధర రమేష్, బీరం రాజేష్, రజినీకాంత్, మహిపాల్, పిప్పరి అనిత, వల్లెపు మొగిలి, గంగాధర్ పాల్గొన్నారు.

## సరస్వతి నదీ పుష్కరాల యాప్, వెబ్ పోర్టల్

ప్రారంభించిన మంత్రి కొండా సురేఖ, మంత్రి శ్రీధర్ బాబు




ప్రజాపక్షం/హైదరాబాద్ : సరస్వతి నదీ పుష్కరాలకు వెళ్లే భక్తులకు ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. మే 1526 వరకు జరిగే 'సరస్వతి నదీ పుష్కరాలు' సంబంధించిన ఏర్పాట్ల వివరాలు భక్తులకి సమగ్రంగా తెలిపేందుకు వెబ్ పోర్టల్, మొబైల్ యాప్‌ను రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు మంగళవారం హైదరాబాదులోని సెక్రటేరియట్‌లో మంగళవారం ప్రారంభించారు. పుష్కరాలకు వచ్చే భక్తులు, యాత్రికులకు సమాచార వివరాలు తెలిపేందుకు వీటిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ శ్రీధర్, ధార్మిక పరిషత్ సలహదారు గోవింద హరి, భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఆలయ ఇఒ మహేష్ తదితర అధికారులు పాల్గొన్నారు. 'సరస్వతి నదీ పుష్కరాలు' పండుగకు స్నాన ఘాట్టాల విస్తరణతో సహా వివిధ అభివృద్ధి పనులను విస్తృతంగా చేపట్టినట్టు మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు. తమ కాంగ్రెస్ ప్రభుత్వంలో గతంలో సరస్వతి నదీపుష్కరాలు నిర్వహించామని, ఇప్పుడు కూడా అవకాశం మాకు రావడం ఆ భగవంతుడి ఆశీస్సులున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా మంత్రి కొండాసురేఖ మాట్లాడుతూ... తమ ప్రభుత్వం దేవాలయాల విషయంలో చాలా క్రియాశీలకంగా పనిచేస్తుందన్నారు. గత ప్రభుత్వం దేవాదాయ శాఖ సంబంధిత వ్యవహారాలను పూర్తిగా నిర్లక్ష్యంవహించిందన్నారు. తాను దేవాదాయ శాఖ మంత్రి అయ్యాక పలు అంశాలను, ప్రతి కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నట్టు చెప్పారు. సమ్మక్క సారక్క జాతర, కొమురవెల్లి కల్యాణం, భద్రాచలం కల్యాణం తదితర అన్నీ ప్రతిష్టాత్మకంగా చేపట్టినట్టు వివరించారు. భక్తులకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా చేసినట్టు వివరించారు. యాదగిరిగుట్ట దేవాలయంకు పాలకమండలి చట్ట సవరణ చేపట్టినట్టు చెప్పారు. అయితే, ఈ సరస్వతీ పుష్కరాలకు రోజుకు 50వేల నుంచి లక్ష దాకా వస్తారని అంచనా వేస్తున్నట్టు వివరించారు. అక్కడ 17 అడుగుల రాతి సరస్వతి విగ్రహం ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. చలువ పందిళ్లు, శాశ్వత మరుగుదొడ్లు ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు. వెబ్ సైట్ యాప్ ద్వారా అన్ని వివరాలు తెలుపుతామని చెప్పారు. 'SARASWATI PUSHKARALU 2025' పేరుతో ఉన్న మొబైల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం వచ్చాక అమలుపరిచిన ఫ్రీ బస్ పథకం ద్వారా దేవాదాయ శాఖకు లాభం సమకూరినట్టు తెలిపారు. మహిళలు పెద్ద ఎత్తున దేవాలయాలకు వస్తున్నట్టు కొండా సురేఖ చెప్పారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని మంత్రి అధికారులకు ఆదేశించారు.

## 'అసైన్‌మెంట్, పోడుభూముల' వివరాలను భూభారతిలో చేర్చండి

పంట నష్టపరిహారాన్ని చెల్లించండి : మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్




ప్రజాపక్షం/హైదరాబాద్ : కాంగ్రెస్ విడుదల చేసిన రైతు డిక్లరేషన్‌లో ఆరో అంశంగా పొందుపర్చిన అసైన్‌మెంట్, పోడు భూముల క్రయవిక్రయాలను భూ భారతిలో చేర్చాలని బిఆర్ఎస్ మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంట నష్టాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని, ఎకరాకు రూ.30వేల నష్ట పరిహారాన్ని చెల్లించాలన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌తో కలిసి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ఎండిన పంటలతో పాటు వడగళ్ల వానలతో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాల్సిందేనని, లేదంటే రైతులతో కలిసి ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. తమ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ప్రజల అభిప్రాయాన్ని మాత్రమే చెప్పిఉండవచ్చని, తాము కాంగ్రెస్ పాలన ఐదేళ్లపాటు కొనసాగాలని కోరుకుంటున్నామన్నారు. తాగునీటి సమస్యపైన ప్రభుత్వానికి ముందస్తు కార్యాచరణ లేదని, హైదరాబాద్‌కు తాగునీటి సమస్య కూడా వచ్చే ప్రమాదం ఉన్నదన్నారు. కాంగ్రెస్ పాలనకు పదహారు నెలలు గడిచినప్పటికీ అక్రమ కేసులు, కక్ష రాజకీయాలతోనే కాలం గడుపుతున్నారని ఆరోపించారు. జైపాల్ యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నిండా ముంచుతోందని, ప్రాజెక్టుల నిర్మాణంపై ఎవరికీ శ్రద్ధ లేదని ఆరోపించారు.

## పెట్టుబడులే లక్ష్యంగా జపాన్‌కు ముఖ్యమంత్రి

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రానికి పెట్టుబడులను తీసుకురావడమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి బృందం బుధవారం నుంచి ఎనిమిది రోజుల పాటుజపాన్ పర్యటనకు వెళ్లనున్నారు. జపాన్‌లో జరిగే 'ఒసాకా కన్సాయ్ ఎక్స్‌పో 2025'కు సిఎంతో పాటు రాష్ట్ర ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హాజరుకానున్నారు. తెలంగాణకు పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో ఈ పర్యటన కొనసాగనుంది. హైదరాబాద్‌లో బుధవారం సిఎల్‌పి సమావేశం ముగిసిన వెంటనే సిఎం బెంగుళూరు వెళ్లారు. అక్కడి నుంచే అర్ధరాత్రి తరువాత జపాన్‌కు బయలుదేరి వెళ్తారు. సిఎం వెంట పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సిఎం కార్యాలయ అధికారి అజిత్‌రెడ్డి వెళ్ళనున్నారు. ఈనెల 13వ తేదీ నుంచి అక్టోబర్ 13వ తేదీ వరకు జరిగే ఈ ఎక్స్‌పోలో వివిధ దేశాల రాజకీయ ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు పాల్గొంటారు. భారత్ నుంచి కూడా పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు, పారిశ్రామిక వేత్తలు పాల్గొననున్నారు. రాష్ట్రంలో పెట్టుబడి అవకాశాలను వివరించేందుకు ఒసాకా షోను వేదికగా చేసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. తెలంగాణలో ప్రభుత్వం ఏయే రంగాలకు ఎలాంటి ప్రోత్సాహకాలను అందిస్తుంది? ఇక్కడ ఉన్న పెట్టుబడి వాతావరణం, స్కిల్డ్, అన్‌స్కిల్ లేబర్‌తోపాటు, విద్యుత్, నీటి సరఫరా, భూముల కేటాయింపు, అనుమతులు, రాయితీలు తదితర అంశాలపై తెలంగాణ రాష్ట్ర బృందం ప్రధానంగా దృష్టి పెట్టనుంది.


**సిఎం జపాన్ పర్యటన వివరాలు :** 15న అర్ధరాత్రి బెంగుళూరు విమానాశ్రయం నుంచి ముఖ్యమంత్రితో పాటు అధికారులు జపాన్‌కు బయల్దేరుతారు. 16న టోక్యోలోని నారిటా ఎయిర్‌పోర్ట్(జపాన్)కు చేరుకుంటారు. అదేరోజు భారత రాయబారితో ఆతిథ్య భేటీ. 17న టోక్యోలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సోనీ గ్రూప్, జపాన్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్ ఏజెన్సీ, జెఇటిఆర్ఒ, జపాన్ బయో ఇండస్ట్రీ అసోసియేషన్, వివిధ సంస్థలతో సమావేశాలు. సాయంత్రం తోషిబా ఫ్యాక్టరీ సందర్శన. 18న టోక్యోలోని గాంధీ విగ్రహానికి పుష్పాంజలి..టోక్యో గవర్నర్‌తో మర్యాదపూర్వక సమావేశం. ఇండియన్ ఎంబసి అధ్వర్యంలో ఇండస్ట్రీ ప్రతినిధులతో భేటీ. టయోటా, తోసిబా, ఐసిన్, ఎన్టీటీ తదితర కంపెనీల సిఇఒలతో వేర్వేరుగా సమావేశాలు. జపాన్ ఓవర్సీస్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ ఫర్ ట్రాన్స్‌పోర్ట్ అండ్ అర్బన్ డెవెలప్‌మెంట్ ప్రతినిధులతో సమావేశం. సుమిదా రివర్ ఫ్రంట్ సందర్శన. 19న టోక్యో నుంచి ఒసాకాకు ప్రాణాయం. మౌంట్ ఫుజి, అరకురయామా పార్క్ సందర్శన. 20న కిటాక్యూషు సిటీ నుంచి ఒసాకా బల్దేరుతారు. కిటాక్యూషు మేయర్‌తో సమావేశం, ఎకో టౌన్ ప్రాజెక్టుకు సంబంధించిన సమావేశం. మురసాకి రివర్ మ్యూజియం సందర్శన.ఎన్విరాన్మెంట్ మ్యూజియం, ఎకో టౌన్ సెంటర్ సందర్శన. 21న ఒసాకాలో 'యుమెషిమాలో వరల్డ్ ఎక్స్‌పోలో.. తెలంగాణ పెవిలియన్ ప్రారంభం. ఆ తరువాత బిజినెస్ రౌండ్‌టేబుల్ సమావేశం, ఒసాకా రివర్ ఫ్రంట్ సందర్శన. 22న ఒసాకా నుంచి హిరోషిమా వెళ్తారు. హిరోషిమా పీస్ మెమోరియల్ సందర్శన, గాంధీ విగ్రహానికి పుష్పాంజలి. హిరోషిమా వైస్ గవర్నర్, అసెంబ్లీ చైర్మన్‌తో సమావేశాలు. హిరోషిమా జపాన్‌ఇండియా చాప్టర్‌తో బిజినెస్ లంచ్. హిరోషిమా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సందర్శన. మజ్దా మోటార్స్ ఫ్యాక్టరీ సందర్శన. అనంతరం ఒసాకాలోని కాన్సాయ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ నుంచి బయల్దేరుతారు. 23న ఉదయం హైదరాబాద్‌కు చేరుకుంటారు.

# 'భూభారతి' పరిష్కారం చూపేనా?

చిందరవందరగా భూ రికార్డులు

అక్రమార్కులకు అడ్డుకట్ట పడేనా

భూ సర్వేనే పరిష్కారమా



ప్రజాపక్షం/ఖమ్మం : భూ సమస్య ప్రధాన ఎజెండాగా మారింది. సాగుకు, నివాసానికి మాత్రమే పరిమితం అనుకున్న భూమి ఇప్పుడు వ్యాపార వస్తువు అయింది. పెరిగిన క్రయ, విక్రయాలతో పాటే భూమి స్టేటస్ సింబల్‌గా మారింది. డిమాండ్ ఉన్న దానిని తమ వద్ద ఉంచుకోవాలన్న వ్యాపార లక్షణం కారణంగానే భూమికి సంబంధించి విస్తృత చర్చ మొదలైంది. ప్రధాన రాజకీయం భూమి చుట్టూ తిరుగుతుండటంతో రాజకీయ ప్రచారస్త్రంగా మారింది. ఈ క్రమంలోనే గత ప్రభుత్వం తెచ్చిన ధరణి అతి కొద్ది మందిని మినహాయిస్తే మిగిలిన వారికి కష్టాలను, నష్టాలను తెచ్చిపెట్టింది. ఇప్పటి ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి సమస్యకు పరిష్కారం చూపేనా అన్నదే అందరి మదినీ తొలుస్తున్న ప్రశ్న. భూ సమస్యకు పరిష్కారం చూపేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'భూ భారతి' చట్టాన్ని తీసుకు వచ్చింది. ఏప్రిల్ 14 నుంచి నాలుగు మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తామని జూన్ రెండు నుంచి పూర్తి స్థాయిలో అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అసలు భూ సమస్యతో పాటు ధరణి చట్టం కొత్త సమస్యలు తెచ్చి పెట్టింది. ప్రస్తుత భూ రికార్డుల ప్రకారం భూ వివరాలు అస్తవ్యస్థంగా ఉన్నాయి. సర్వే నెంబర్ల వారీగా ఉన్న భూ విస్తీర్ణానికి వాస్తవ విస్తీర్ణానికి చాలా తేడా ఉంది. తక్కువ ఉన్న చోట భూమి కోసం ఘర్షణలు జరుగుతుండగా, ఎక్కువ ఉన్నచోట అక్రమార్కులు, బలం ఉన్నవాళ్లు, అధికారులు రాజకీయ అండతో అప్పనంగా అనుభవిస్తున్నారు. సర్వే నెంబర్లు తప్పుల తడక. రెండు దశాబ్దాలుగా రెవెన్యూ అధికారులు బై నెంబర్లతో సర్వే నెంబర్ వ్యవస్థను సైతం నిర్వీర్యం చేశారు. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం గుబ్బగుర్తి గ్రామ రెవెన్యూ మొత్తం సర్వే నెంబర్లకు రైతులు సాగు చేసుకుంటున్న భూమికి సంబంధం లేదు. ఎవరు ఏ సర్వే నెంబరులో ఉన్నారో, ఎక్కడి భూమి సాగుచేసుకుంటున్నారో సర్వే, రెవెన్యూ అధికారులకు అంతు చిక్కడంలేదు, ఇది ఒక ఉదాహరణ మాత్రమే. పట్టాదారు పాసుపుస్తకం ఉన్నా భూమి లేని రైతులు, భూమి తమ స్వాధీనంలో ఉన్నా పాసుపుస్తకం లేని రైతులు లక్షల సంఖ్యలో ఉన్నారంటే అతిశయోక్తి కాదు. వీటన్నింటికీ భూభారతి పరిష్కారం చూపాలి. ధరణి చట్టం వచ్చిన తర్వాత కల్లూరు మండలం పెద్దకోరుకొండి గ్రామంలో ఉన్న రెవెన్యూ భూమి కంటే పాసు పుస్తకాల ప్రకారం హక్కు పొందిన భూమి 400 ఎకరాల పైచిలుకు ఎక్కువగా ఉంది. దీనికి గడిచిన పదేళ్లలో పరిష్కారం దొరకలేదు. అదనపు భూమిని పొందిన వారు బ్యాంకు రుణాలతో పాటు రైతు భరోసా అనుభవిస్తున్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది ఎకరాల భూములు భూ రికార్డుల్లోకి ఎక్కలేదు. అసైన్డ్ భూములు, బంచరాయి, ఇనామ్, మన్యాలను దశాబ్దాలుగా సాగుచేసుకుంటున్న రైతులకు భూమిపై హక్కు కల్పించబడలేదు. ధరణికి ముందు పహాణీలలో అనుభవదారు కాలంలో కొనసాగిన లక్షలాది మంది రైతులు ధరణి తర్వాత భూ హక్కును కోల్పోయారు. కేవలం హక్కు లేని సాగు రైతులుగా మిగిలిపోయారు. ఖమ్మం జిల్లా, బోనకల్ మండలం రాపల్లి రెవెన్యూలో 140, 414 సర్వే నెంబర్లలో 100 ఎకరాలు పైబడి బంచరాయి భూమి ఉంది. 1970 దశకంలో అప్పటి ప్రభుత్వం భూమిని పేదలకు పంచి సామూహిక పట్టాలు ఇచ్చింది. అప్పటి నుంచి సాగు చేసుకుంటున్న రైతులకు ఎటువంటి భూ హక్కులు లేవు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఇటువంటి భూములపై వాస్తవ అనుభవదారులకు హక్కు కల్పించాల్సి ఉంది. ఈ సమస్యను భూ భారతి లో చేర్చాల్సి ఉంది. గతంలో రోడ్లు, పంట కాలువలు , ఇతర ప్రజా ఉపయోగ పనుల కోసం ప్రభుత్వం భూమిని సేకరించి సంబంధిత రైతులకు పరిహారం అందించింది. ప్రభుత్వం సేకరించిన భూమి పోను మిగిలిన భూమి రైతుల స్వాధీనంలో ఉండగా అట్టి భూమి ధరణి తర్వాత రికార్డుల్లోకి ఎక్కించలేదు. ఒక్క ఖమ్మంజిల్లా చింతకాని మండలంలోనే ఇటువంటి భూ సమస్య వేల ఎకరాల్లో ఉంది. కలెక్టరేట్ పరిధిలోనే భూ సమస్యకు పరిష్కారం ఉండడంతో ప్రతి కలెక్టరేట్‌లోనూ వేల సంఖ్యలోనూ దరఖాస్తులు నెలల తరబడి అపరిష్కృతంగా ఉన్నాయి. భూ చట్టాలలోని లోపాలు కొందరికి వరంగా మారాయి. రెవెన్యూ అధికారులను రాజకీయ అండతో తమ చెప్పుచేతల్లో ఉంచుకుని ఇష్టానుసారంగా భూ యజమానులను జాబితాల నుంచి తొలగించి తమ పేర్లను నమోదు చేయించుకున్నారు. రెవెన్యూ కార్యాలయాలు పైరవికారులతో అవినీతి కేంద్రాలుగా మారాయి. రిజిస్ట్రేషన్ కార్యాలయాలు, తహసీల్దార్ కార్యాలయాలపై తీవ్ర విమర్శలు వచ్చేందుకు పైరవీలే కారణమయ్యాయి. వీటన్నింటికి భూ భారతి పరిష్కారం చూపాల్సి ఉంది. ఇప్పుడు ఉన్న రికార్డుల ప్రకారమే భూ భారతి అమలైతే బహూశా సమస్యకు పరిష్కారం దొరకక పోవచ్చు. అసలు వాస్తవంగా గ్రామాల వారీగా భూ విస్తీర్ణమెంత, సాగు భూమి ఎంత సాగుకు యోగ్యం కాని భూమి ఎంత, అది ఏఏ రైతుల అనుభవంలో ఉందో తేల్చాల్సి ఉంది. కానీ ఇది భూ సర్వేతోనే సాధ్యమని రైతులు అభిప్రాయపడుతున్నారు. ధరణి మాదిరిగా కొత్త సమస్యను తేకుండా భూ సమస్యకు భూ భారతి పరిష్కారం చూపుతుందని ఆశిద్దాం.

**శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానం, కాళేశ్వరం**
మహాదేవపూర్ మండలం, జయశంకర్ భూపాలపల్లి జిల్లా.

Rc.No.21/2025 | షార్ట్ టెండర్ ప్రకటన | తేది: 15.04.2025

ఇందు మూలంగా తెలియజేయునది ఏమనగా! తేదీ 22.04.2025 రోజున ఉదయం 10-00 గంటల నుండి ఈ దేవస్థాన కార్యాలయం వద్ద దిగువ ప్రకారముగా సీల్డ్ టెండర్స్ నిర్వహించబడును. 1. కందువాలు, కనుములు శేషవస్త్రములు, దేవతా వస్త్రాలు, సిబ్బంది యూనిఫారం బట్టలు మొ. వి. సప్లై చేయుట. 2. షాప్ నెం.4 నడుపుకొను హక్కునకు టెండర్ షెడ్యూల్ ధర రూ. 300/- చొప్పున మరియు EMD 10,000/- రూ.ల చొప్పున చెల్లించవలెను. **టెండర్ ధరఖాస్తు తీసుకొను చివరి తేదీ:** 21.04.2025 సా. 4.00 గంటల వరకు, **సీల్డ్ టెండర్ తేదీ:** 22.04.2025 ఉ.11.30 గం.ల వరకు స్వీకరించి 12.00 గం.కు సీల్డ్ బాక్సు తెరవబడును. ఈ టెండర్లలో హిందువులు మాత్రమే పాల్గొనవలెను. పూర్తి వివరములకు కార్యాలయంలో ఉదయం 10.00 నుండి సా.4.00 గంటల వరకు లేదా నెం. 9502825595 ద్వారా సంప్రదించగలరు. మిగతా షరతులు షెడ్యూల్ తో జతపరచబడును.

DIPR R.O. No. : 399-PP/CL/ADVT/1/2025-26, Date: 15-04-2025 సం//- కార్యనిర్వహణాధికారి

ప్రజాపక్షం
బుధవారం, ఏప్రిల్ 16

# బెంగాల్‌లో మత హింస కోణాలు

వక్ఫ్ చట్టం(సవరణ) బిల్లు, 2025కు పార్లమెంటు ఆమోదం, రాష్ట్రపతి ఆమోదముద్ర లభించిన తదుపరి దేశంలోని ముస్లిం మైనారిటీల్లో కొంత అసంతృప్తి. ఆవేదన, ఆక్రోశం కలిగిన మాట యదార్థం. ఆ సవరణ చట్టం రాజ్యాంగ చెల్లుబాటును సవాలు చేస్తూ అఖిల భారత ముస్లిం పర్సనల్ లా బోర్డ్, కొన్ని రాజకీయ పార్టీలు, పలువురు వ్యక్తులు సుప్రీంకోర్టులో పిటిషన్‌లు దాఖలు చేశారు. ప్రజాస్వామ్యంలో అది సరైన మార్గం. అయితే ముస్లిం జనాభా సాంద్రత ఎక్కువగా ఉన్న ప్రదేశాలు దేశంలో అనేకం ఉన్నప్పటికీ పశ్చిమ బెంగాల్‌లోని బంగ్లాదేశ్ సరిహద్దు జిల్లా ముర్షిదాబాద్‌లోనే నిరసనలు ఎందుకు మతకలహాల రూపం దాల్చాయన్నది ప్రశ్న. ఏప్రిల్ 12న (శనివారం) చెలరేగిన హింసలో ముగ్గురు వ్యక్తులు మరణించారు. అదే జిల్లా జఫ్రాబాద్‌లో సోమవారం మధ్యాహ్నం – సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ సలీం నాయకత్వాన ఆ పార్టీ ప్రతినిధివర్గం సందర్శించిన తదుపరి తాజాగా హింస చెలరేగింది. ఈ అనూహ్య హింసపట్ల దిగ్భ్రాంతి చెందిన ముఖ్యమంత్రి మమతాబెనర్జీ హింసను ఖండించారు – శాంతికి విజ్ఞప్తి చేశారు. ఏదైనా నిరసన ప్రదర్శనలు జరపదలచుకున్నా ముందుగా పోలీసులనుండి అనుమతి తీసుకోవాలన్నారు. ఎవరూ మతం పేరుతో దుర్మార్గపు క్రీడకు పాల్పడకూడదన్నారు. పుట్టినప్పుడు–పోయేటప్పుడు ఒంటరివాళ్లం, ఎందుకీ హింస అని నిర్వేదం వ్యక్తం చేశారు. అదే సమయంలో 'వక్ఫ్ సవరణ చట్టాన్ని రాష్ట్రంలో అమలు జరపబోము – నిరసనకారులు కేంద్రానికి వ్యతిరేకంగా ప్రదర్శనలు జరపాలన్నారు. ముర్షిదాబాద్ జిల్లాలో పరిస్థితులు నెమ్మదిగా సద్దుమణుగుతుండగా, 14వ తేదీ 24 పరగణాల జిల్లాలోని భాంగార్‌లో వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ప్రదర్శన సందర్భంగా హింస చోటుచేసుకుంది. జనాగ్రహం పోలీసుల మీదకు మళ్లింది. ఐదు మోటారు సైకిళ్లు, ఒక జైలు వ్యాన్ దగ్ధం చేశారు.

ఈ హింసాయుత ఘటనల్లో బంగ్లాదేశ్, ఆర్ఎస్ఎస్–బిజెపి, బజరంగ్‌దళ్, ఇండియన్ సెక్యులర్ ఫ్రంట్ (ఐఎస్ఎఫ్) పాత్ర కనిపిస్తున్నది. వక్ఫ్ సవరణ చట్టం పట్ల ముస్లింల్లోని అసంతృప్తిని అవకాశంగా తీసుకుని ఎవరి నాటకం వారు ఆడినట్లుంది. అయితే ఇంటెలిజెన్స్ వైఫల్యం, పోలీసు అసమర్థత ఆ హింసను నివారించలేకపోవటం కూడా వాస్తవం.

బజరంగ్‌దళ్, ఇతర హిందూ సేనలవలె ముస్లింల్లో కూడా ఛాందసవాదులున్నారు. ముర్షిదాబాద్‌లో దొంగచాటుగా ప్రవేశించి నిశ్శబ్దంగా నిష్క్రమించిన కవ్వింపుదారులు ఈ హింసకు మూలమని ముఖ్యమంత్రి అన్నారు. అయితే ఆరు రోజుల తదుపరి కూడా పోలీసులు ఆ సంచారులను గుర్తించలేదు. బంగ్లాదేశ్‌కు చెందిన ముస్లిం ఛాందసులు కొంతకాలంగా ఈ సరిహద్దు జిల్లాల్లో సంచరిస్తున్నా పోలీసులు పట్టించుకోలేదు. అక్రమ చొరబాట్లను అరికట్టటంలో బిఎస్ఎఫ్ విఫలమైందని రాష్ట్రప్రభుత్వం ఆరోపించింది. షేక్‌హసీనా పదవీచ్యుతి తర్వాత బంగ్లాదేశ్‌లో హిందువులపైన వేధింపులను భారత్ అంతర్జాతీయ వేదికల్లో లేవనెత్తి తమ ప్రతిష్ఠ, అలాగే పాకిస్తాన్ ప్రతిష్ఠ చేటు చేసిందన్న బంగ్లాదేశ్‌లోని ముస్లిం ఛాందసులు గుర్రుగా ఉన్నారు. వారు వక్ఫ్ సవరణ చట్టాన్ని అవకాశంగా ఉపయోగించుకున్నారు.

ముర్షిదాబాద్ జిల్లాలోని సుతి, షంషేర్‌గంజ్‌లో హింస వెనుక వెలుపలి శక్తులున్నాయని తృణమూల్, బిజెపి రెండూ ఆరోపించాయి. ఇది కొన్ని దేశ వ్యతిరేక శక్తులు, విదేశీ శక్తుల కుట్ర అని రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు సుకాంత మజుందార్ ఆరోపించారు, ఇతర దేశాలనుంచి జనులు ప్రవేశిస్తుంటే కేంద్రప్రభుత్వం ఏమి చేస్తున్నదో మజుందార్ వివరణ ఇవ్వాలని తృణమూల్ డిమాండ్ చేసింది. అసెంబ్లీలో బిజెపి ప్రతిపక్ష నాయకుడు సువేందు అధికారి ''ఈ హింస వెనుక పిఎఫ్ఐ, సిమి, అన్సారుల్ బంగ్లా, టెర్రరిస్టు గ్రూపులు, కొన్ని విదేశీ హస్తాలున్నాయని''అన్నారు. ఇదిలావుండగా, బెంగాలీ హిందువులను చేరుకోవటానికి ముర్షిదాబాద్ ఘటనను బిజెపి ఉపయోగించుకుంటోంది. మమతా బెనర్జీ పాలనను విమర్శించే బెంగాలీ హిందువులు సైతం బిజెపికి చోటివ్వకపోవటం బెంగాల్ రాజకీయాల్లో విశేషం. ఆర్ఎస్ఎస్, బిజెపిలకు సన్నిహితంగా ఉండే సంస్థ ఒకటి ముర్షిదాబాద్‌లోని సాగర్‌దిగిలో రామాలయ నిర్మాణానికి గతవారం పూజ నిర్వహించటం గమనార్హం. భారత్ సేవాశ్రమ సంఘ్‌కు చెందిన స్వామి ప్రదీప్తానంద మహారాజ్‌ను యుపి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తరహాలో 'బెంగాల్ యోగి'గా బిజెపి చిత్రిస్తున్నది. జార్ఖండ్ నుంచి ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు తరచూ వచ్చిపోతుంటారట! కాబట్టి బెంగాల్‌లో మత కలహాల వెనుక కేవలం మత అసంతృప్తులేగాక రాజకీయాలు కూడా ఉన్నట్లు విదితమవుతున్నది. ఇది అత్యంత విచారకరం!

# మహా మానవతావాది...సర్ చార్లీ చాప్లిన్!



డాక్టర్ దేవరాజు మహారాజు
సుప్రసిద్ధ సాహితీ వేత్త, జీవ శాస్త్రవేత్త

'ద గ్రేట్ డిక్టేటర్' సినిమాలో చాప్లిన్ ద్విపాత్రాభినయం చేశాడు. ఒకటి – హిట్లర్ పాత్ర (డిక్టేటర్), రెండు – హిట్లర్ పోలికలతో ఉన్న మంగలివాడి పాత్ర.

వేల సంఖ్యలో సైనికులు బారులుతీరి ఉన్న సన్నివేశమది. వందల సంఖ్యలో మిలట్రీ అధికారులు హిట్లర్ రాకకోసం ఎదురు చూస్తూ ఉంటారు. ఆ మహాసభలో హిట్లర్ సైనికుల్ని ఉద్దేశించి మాట్లాడవల్సి ఉంది. కానీ, ఆ సమయానికి అక్కడికి హిట్లర్ బదులు, అతని పోలికలతో ఉన్న మంగలివాడు చేరుకుంటాడు. అతనే హిట్లరనుకుని అధికారులు గౌరవ వందనం సమర్పించి అతణ్ణి వేదికమీదికి తీసుకు వెళతారు. అతి సామాన్యుడైన మంగలివాడు ఏం మాట్లాడగలడూ? ఒక నిమిషం తడబడి ఆ తర్వాత ఒక సామాన్యుడిగా తను కోరుకుంటున్నదేమిటో అదే మాట్లాడతాడు. మానవత్వాన్ని తట్టిలేపుతూ కవితాత్మకంగా సాగిందే ఆ ఉపన్యాసం. హిట్లర్‌ను ఎద్దేవా చేసే చార్లీ చాప్లిన్ తన అంతరంగాన్ని అతి సామాన్యుడైన మంగలి వాడి పాత్ర ద్వారా ఈ విధంగా వ్యక్తం చేశాడు. ఒక రకంగా ఇది చార్లీ చాప్లిన్ అంతరాత్మ మానవాళికి చేసి న ఉద్బోధ! మహా విదూషకుడి మహోపన్యాసం!! ఇది వెలువడి ఎనబది ఐదు ఏళ్లయినా (1940)ఇంకా నిత్యనూతనంగా ఉంది. ఈ కాలానికి సరిపోయే విధంగా కూడా ఉంది. చాప్లిన్ మహానటుడు, మహా దర్శకుడు అనడానికి ఇదొక మంచి ఉదాహరణ!'ద గ్రేట్ డిక్టేటర్' సినిమాలోని చాప్లిన్ ఉపన్యాసం పూర్తి పాఠం తెలుగులో ఇక్కడ మీకందిస్తున్నాను. మనుషులైన వారందరూ ఈ విషయాల్ని గుండెల్లో భద్రపరుచుకోవాల్సిన అవసరం ఉంది.

''క్షమించాలి! నాకు చక్రవర్తిని కావాలని లేదు. అలాంటి ఉద్దేశమే లేదు. ఎవరినో జయించాలని కానీ, ఎవరి మీదనో పెత్తనం చలాయించాలని కానీ నాకు లేదు. తెలుపు, నలుపు అన్న తేడా లేదు. ప్రతి వారికీ చేయగలిగినంత సహాయం చేయాలనే ఉంది. మనం ఒకరికొకరం సహాయపడుకుంటూ ఉండాలి. ఎదుటివారి సంతోషమే మనకు స్ఫూర్తిని, సంతృప్తిని ఇస్తుంది. వారి దుఃఖం కాదు – ఒకరిని అసహ్యించుకోవడం, అవహేళన చేయడం మనం కోరుకోం.మన జీవితం స్వేచ్ఛకూ, ఆనందానికీ ప్రతి రూపమవ్వాలి!

కానీ, మనం దారితప్పుతున్నాం. స్వార్థం మనుషుల అంతరాత్మల్ని విషపూరితం చేస్తోంది. కుత్సితాలతో ప్రపంచాన్ని కుంచింప జేస్తోంది. కుటిలత్వానికి, రక్తపాతానికి.. మానవుల్ని చేరుస్తోంది. వేగాన్ని అభివృద్ధి పరిచాం. నిజమే! కానీ, మనలో మనమే ముడుచుకుంటున్నాం. కావల్సినవన్నీ యంత్రాలు తయారు చేస్తున్నాయి. కానీ, మన కోర్కెల దాహం తీరడం లేదు. మన విజ్ఞానం మనల్ని మానవ ద్వేషులుగా చేస్తూ ఉంది. మన తెలివితేటలు మనల్ని నిర్భయులుగా, కఠినాత్ములుగా తీర్చిదిద్దుతున్నాయి. మనం చాలా ఎక్కువగా ఆలోచిస్తాం. అవసరమైనప్పుడు చాలా తక్కువగా స్పందిస్తాం. యంత్రాల యంత్రాంగం కన్నా, మనకు మానవత్వపు మనుగడ ముఖ్యం కావాలి. మితిమీరిన తెలివితేటల కన్నా మర్యాద, మన్నన, దయార్ద్ర హృదయం కావాలి. ఈ లక్షణాలు లేని జీవితం భయానకమై నశిస్తుంది.

రేడియో, విమానాలు మానవుల్ని దగ్గరి పరిధిలోకి చేరుస్తున్నాయి. మానవునిలోని మంచితనమే వీటిని కనుక్కోగలిగింది. విశ్వ మానవ సౌభ్రాతృత్వాన్ని ఎలుగెత్తి చాటింది. ఈ నా మాట ప్రపంచంలోని కోటానుకోట్ల ప్రజలకు అందుతోందని నాకు తెలుసు. పురుషులు, స్త్రీలు, పసిపిల్లలు, నిరాశా సదృశ్యులు... పీడించే ఈ వ్యవస్థకు బలైన అమాయకులూ...ఎవరూ నిరాశ పడవద్దు. మానవ పురోగతికి అది గొడ్డలి పెట్టు. ఈర్ష్యాద్వేషాలు నశిస్తాయి. నియంతలు నశిస్తారు. ప్రజలనుండి లాక్కొన్న అధికారం మళ్ళీ తిరిగి ప్రజలకే దక్కుతుంది. స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు నశించవు. తాత్కాలికంగా అణచబడ్డా, అవి సంకెళ్ళు తెంపుకుని ధైర్యంగా బతుకుతాయి.

సైనికులారా ఆలోచించండి!

దుష్టుల పక్షాన, దుర్మార్గుల పక్షాన నిలబడొద్దు. మీకు తిండి పెట్టి, కసరత్తులు చేయించి, మిమ్మల్ని పూర్తిగా వాడుకునేవాడు ఎలాంటివాడో ఒకటికి రెండుసార్లు బాగా ఆలోచించండి.

మీ ఆలోచనల్ని, మీ అనుభూతుల్ని శాసించే హక్కు ఎవరికీ లేదు. మీరు పశువులు కాదు. గడ్డిపోచలు కాదు. మానవ యంత్రాలకు దాసోహమనేది లేనేలేదు. యాంత్రిక మేధస్సులు, యాంత్రిక హృదయులూ గల కృత్రిమమైన యంత్రాలు వాళ్ళు. మీరు యంత్రాలు కాదు – మనుషులు! మనుషులు !!

మీరు యంత్రాలు కాదు–మానవత్వం పట్ల మీకు అచంచల విశ్వాసం ఉంది. ఎదుటివారిని ప్రేమించగల గొప్ప హృదయం ఉంది. ఎవరిచేతా ప్రేమించబడని కొద్దిమంది యంత్ర – మానవులు మాత్రమే అసహజంగా, అసహ్యంగా, కృత్రిమంగా ప్రవర్తిస్తారు.

వీర సైనికులారా! స్వేచ్ఛకోసం పోరాడండి. బానిసత్వం కోసం కా దు.

మీలో ఒక మహత్తర శక్తి ఉంది. జీవితాన్ని అందంగా, ఆనందంగా, సుఖప్రదంగా, ప్రశాంతంగా తీర్చిదిద్దుకోగల శక్తి మీలోనే ఉంది.





యంత్రాల్ని సృష్టించుకోగల నేర్పరులు మీరే. మనుషులుగా నిలదొక్కుకునే ఆత్మశక్తి మీలోనే ఉంది. ఇంకా ఆలస్యమెందుకూ? రండి! ప్రజాస్వామ్యం పేరిట ఏకమై, ఒక కొత్త ప్రపంచాన్ని సృష్టించుకుందాం!

ప్రతివాడికీ పని, యువతకు మంచి భవిష్యత్తు, వృద్ధాప్యానికి భద్రత గల ఒక మంచి సమాజాన్ని సృష్టిద్దాం!

అబద్ధాలూ, మాయమాటలూ చెప్పి అవినీతిపరులంతా, అహంకారులంతా గద్దెలెక్కుతున్నారు. వాగ్దానాలను నిలబెట్టుకున్న వారు ఇంతవరకు లేరు.ఇప్పుడు మనకై మనమే వాటిని సాధిద్దాం. జాతీయ అంతరాష్ట్ర స్థాయిలో సైతం స్వేచ్ఛకు అడ్డుగోడల్ని తొలగిద్దాం. దురాశ, దుఃఖం, అసూయ, క్రూరత్వాలకు నిలువనీడ లేకుండా చేద్దాం! శాస్త్ర సాంకేతి కాభివృద్ధి సాధించే ప్రగతివైపు పయనిద్దాం.. రండి!! అందరం ఏకమవుదాం!''–ఇది చాప్లిన్ ఉపన్యాసం. ఇక్కడ మరొక విశేషముంది. హిట్లర్‌ను చార్లీ చాప్లిన్ ఆట పట్టించాడు. కానీ, హిట్లర్..చాప్లిన్ అభిమానుల్లో ఒకరు!

ఎటువంటి వివాదాలకు తావులేకుండా 'వరల్డ్ గ్రేటెస్ట్ ఎంటర్‌ట్రైనర్'గా, ప్రపంచాన్ని నవ్వుతో శాసించిన 'గ్రేట్ డిక్టేటర్' గా భావించబడ్డ సర్ ఛార్లీ చాప్లిన్ (16 ఏప్రిల్ 1889, 25 డిసెంబర్ 1977)



తన విజయ రహస్యాన్ని తానే అనేకసార్లు బేరీజు వేసుకున్నాడు. మానవ మనస్తత్వాన్ని అనేక కోణాల్లోంచి విశ్లేషించుకున్నాడు. దాన్ని బట్టే తెరమీద తన వ్యక్తిత్వానికి రూపుదిద్దుకున్నాడు. అమోఘంగా రక్తి కట్టించాడు కూడా! 'ఈ ప్రజలు దేన్నిచూసి నవ్వుతారు?' అనే శీర్షికలో చాప్లిన్ 1918లో ఒక అమెరికా పత్రికకు వ్యాసం రాశాడు. అందులో ఆయన వెలిబుచ్చిన అభిప్రాయాలు ఇలా ఉన్నాయి. అయితే అవి ఎంత సామాన్యమైనవో అంత విలువైనవి కూడా!

– – –

హాస్యం టోపీ ఎగిరిపోవడంలో లేదు. దాన్ని పట్టుకోవడానికి ఒక పెద్ద మనిషి పడే అవస్థలో ఉంది. ప్యాంటు పిగిలిపోవడంలో లేదు. దాన్ని కప్పిపుచ్చుకోవడానికి పడే తికమకలో ఉంది. అలాగే జారిపోయే ప్యాంట్ వదిలేస్తే ఎవరికీ నవ్వురాదు. కాని, జారిపోకుండా పైకి అనుకుంటూ హడావుడి పడిపోవడంలో హాస్యం ఉంది. అమ్మాయి నగ్నత్వాన్ని ప్రదర్శిస్తున్న పోస్టర్‌ను, ఒక పెద్ద మనిషి నిలబడి తనివితీరా చూస్తుంటే ఎవరికీ నవ్వు రాదు. సమాజంలో తానొక పెద్ద మనిషినని గుర్తుంచుకుని అలా చూస్తూ ఉంటే తన వ్యక్తిత్వానికి దెబ్బతగులుతుందని బాధపడుతూ, ఉండలేకపోతూ, చూడనట్టు నటిస్తూ.. చూస్తూ ఉండడంలో హాస్యం ఉంది... బలహీనుడై ఉండి, పహిల్వాన్‌తో ఛాలెంజ్ చేయడం, తెలివిగా తన్నులు తప్పించుకుంటూ ఉండడంలో హాస్యం ఉంది. హాస్యం కత్తిమీద సాములాంటిది. ఎక్కడ ఏ కొద్దిగా బెడిసికొట్టినా హాస్యానికి బదులు జుగుప్స, ఏవగింపు, అసహ్యం కలుగుతాయి.

ప్రపంచాన్ని తరతరాలుగా కదిలిస్తూ వస్తున్న చార్లీ చాప్లిన్ సునిశిత హాస్యం ఎక్కడి నుంచో రాలేదు. మాయలు, మంత్రాలు అందులో ఏవీలేవు.. జీవితాన్ని పరిపూర్ణంగా అర్థం చేసుకున్న చాప్లిన్ మేధస్సులోంచి వచ్చింది. నిజానికి జీవితాన్ని జీవితాంతం చదివినా సరిపోదు. అలాంటి జీవితంలో నవ్వించగల అంశాల గూర్చి నిరంతరం ఆలోచిస్తూ గడిపిన చాప్లిన్, మరొక ముఖ్యమైన విషయం కూడా గ్రహించాడు. ప్రేక్షకులు ఊహించిందే తెరమీద కనిపిస్తే నవ్వరని, ప్రేక్షకులు ఊహించని విధంగా విభిన్నమైన ధోరణిలో ప్రవర్తిస్తూ ఉండడం వల్ల, వారిలో ఉత్కంఠ, ఉత్సాహం పెరుగుతుందని ఆయన గ్రహించాడు. ప్రేక్షకుల బలహీనతల్ని ఆయన ఎప్పుడూ దెబ్బతీయలేదు. ఇది ఒక గొప్ప సుగుణం! తనకు తాను కల్పించుకున్న బలహీనతలతోనే ప్రేక్షకులకు నవ్వు బలాన్నిచ్చాడు. ప్రపంచాన్ని నవ్వులతో శాసించిన మొనగాడు చాప్లిన్ తప్ప మరొకరు లేరు.

''నూటికి పదిమంది బాగా ఉన్న వాళ్ళూ, తొంబయిమంది లేని వాళ్ళు ఉన్న ఈ సమాజంలో... తొంభయి శాతం ప్రజల్ని నవ్వించడానికి, పదిశాతం మందిని గేలిచేయడంలో తప్పేమిటీ?'' అన్నది ఆయన ప్రశ్న. వర్గ దృక్పథాన్ని ఇంత సులభంగా, సరళంగా చెప్పిన వాళ్ళు బహుశా ఏవరూ లేరేమో! హాస్యంతో మానవవాదానికి ఊపు నిచ్చిన మహనీయుడు కూడా మరొకరు లేరేమో!!

# కనుమరుగవుతున్న గ్రామీణ విద్య

**యంగ్ ఇండియా స్కూల్స్‌ను స్వాగతిస్తాం; గురుకులాల పరిస్థితి ఏమిటి?**

సమీకృత గురుకులాల ఏర్పాటుతో ప్రభుత్వ పాఠశాలల మూసివేతకు ప్రభుత్వం పన్నాగం పన్నుతుంది. రాష్ట్రవ్యాప్తంగా యంగ్ ఇండియా గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆలోచన చేస్తుంది. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 55 యంగ్ ఇండియా గురుకుల పాఠశాలలకు సుమారు రూ.11వేల కోట్లను కేటాయించింది. కానీ మిగిలిన నియోజక వర్గాల ఆయా ప్రాంతాల పాఠశాలలను మూసివేసే పరిస్థితులు కూడా రావు. గ్రామాల నుండి విద్యార్థులు ఈ గురుకులాల్లో చేరడం వల్ల ఆయా గ్రామాల్లో పాఠశాలలు మూతపడే




పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న సమీకృత గురుకులాలను ఆహ్వానిస్తున్నాం కానీ అదే సమయంలో ప్రభుత్వం నడుపుతున్న మిగిలిన గురుకులాల పరిస్థితి ఏమిటని, ఎస్సి, ఎస్టి, బిసి, మైనార్టీ గురుకులాలకు సొంత భవనాలు కూడా నిర్మించకుండా సమీకృత గురుకులాలు ఎలా నిర్వహిస్తారో అర్థం కాకుండా ఉంది. ప్రతి గ్రామంలో, ప్రతి తండాలో ఒక ప్రభుత్వ పాఠశాల ఖచ్చితంగా ఉండాలని ప్రభుత్వం ఒక వైపు చెబుతూనే మరో వైపు సమీకృత గురుకులాల వ్యవస్థను తీసుకు రావడానికి చర్యలు చేపట్టింది. ప్రతి పాఠశాల పరిపూర్ణ విద్యను అందించగలిగితే ఆయా ప్రాంతాల విద్యార్థులు వేరే ప్రాంతానికి వెళ్లి చదువుకోవాల్సిన అవసరం లేదు, ప్రమాదం ఉంది. గత ప్రభుత్వం కులానికి ఒక గురుకులాన్ని తీసుకువచ్చి కుల వ్యవస్థను పెంచి పోషించడంతో పాటు విద్యార్థుల మధ్య అంతరాలను పెంచింది. ఎస్సి, ఎస్టి గురుకులాలకు కొంతమేరకు సొంత భవనాలు ఉన్నా సరైన మౌలిక వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బిసి, మైనార్టీ గురుకులాలకు సొంత భవనాలు లేక విద్యార్థులు అద్దె భవనాల్లోనే కాలం వెళ్లదీస్తున్నారు. ప్రభుత్వం ఈ అంశంపై దృష్టిసారించి తక్షణమే తగు చర్యలు చేపట్టాలి. ప్రస్తుతం ఉన్న గురుకులాల గురించి మాట్లాడకుండా ప్రభుత్వం సరికొత్త ప్రతిపాదనలు చేయడం ఎంతవరకు సమంజసం. ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న యంగ్ ఇండియా గురుకులాల లక్ష్యం నెరవేరుతుందా లేదా చూడాల్సి ఉంది. సుమారు ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల పాఠశాలలు రాష్ట్రవ్యాప్తంగా సుమారుగా ఇలా ఉన్నాయి. 1. ప్రభుత్వ పాఠశాలలు 26,856, కస్తూర్బా గాంధీ 495, సోషల్ వేల్ఫేర్ 320, డిగ్రీ కళాశాలలు 30 మొత్తం 350. ట్రైబల్ వెల్ఫేర్ 28 మినీ గురుకులాలు, 114 రెసిడెన్షియల్స్, 22 డిగ్రీ కళాశాలలు మొత్తం 165.

బిసి వెల్ఫేర్ మహాత్మాగాంధీ పూలే 33, ఇంటర్మీడియట్ ఇంక్లూడింగ్ స్కూల్స్ 261, డిగ్రీ 33 మొత్తం 327.

మైనార్టీ 204, జనరల్ స్కూల్స్ 35, మోడల్ స్కూల్స్ 194 ఇవిగాక ఆశ్రమ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలు, ఏకలవ్య సెంట్రల్ స్కూల్స్, కేంద్రీయ విద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థుల పరిస్థితి ఏమిటి? రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ విద్యాసంస్థలకు సరైన నిధులు ఇవ్వకుండా ప్రభుత్వ విద్యను బలహీనపరుస్తుంది. రాష్ట్రవ్యాప్తంగా55 యంగ్ ఇండియా గురుకుల పాఠశాలలకు సుమారు రూ. 11వేల కోట్లకు పైగా ప్రభుత్వం కేటాయించింది.

యంగ్ ఇండియా గురుకుల పాఠశాలల మార్గ దర్శకాలను వెల్లడించకుండా అంత పెద్దమొత్తంలో నగదు కేటాయించడంపై విమర్శ ఉంది. ఇప్పటికైనా యంగ్ ఇండియా స్కూల్స్‌కు సంబంధించి ఏమైనా మార్గదర్శకాలు విడుదల చేస్తారా లేదా తెలియక విద్యార్థుల తల్లిదండ్రులు సతమతమవుతున్నారు. ఈ విద్యా సంవత్సరానికైనా యంగ్ ఇండియా గురుకుల పాఠశాలలను అందుబాటులోకి తీసుకు వస్తారా లేదా వేచిచూడాలి.



ఇటికాల రామకృష్ణ
ఎఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు
8106146993

లేఖ

# 'ఆయుష్మాన్ వయో వందన' అమలు ఎప్పుడు?

70 సంవత్సరాలు దాటిన వయోధికుల కు ఆయుష్మాన్ భారత్ వయో వందన పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం రూ.5 లక్షల వరకు ఆరోగ్య బీమా సౌకర్యం ప్రవేశపెట్టింది. ఈ పథకంలో ఎటువంటి ఆదా య పరిమితి లేకుండా వర్తింపజేస్తామని తెలియజేసింది. ఈ బీమా పథకం కొన్ని రాష్ట్రాల్లో అమలు అవుతుంది. ఈ పథకం లో చేరిన వారికి అన్ని రకాల వైద్యం ఉచితంగా లభిస్తుంది. ప్రైవేట్ హెల్త్ కార్డులు ఉన్నవారు, కేంద్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులకు అందించే సిజిఎచ్ఎస్ కార్డులు ఉన్న వారు కూడా అర్హులే అని సామాజిక మాధ్యమాలు, దిన పత్రికలలో కూడా వార్త లుగా ప్రచురించారు.

భారతదేశంలో దాదాపు ఆరుకోట్ల మంది 70 సంవత్సరా లు దాటిన వారు ఉన్నారని, తెలంగాణలో వయోధికులు 35 నుంచి 40 లక్షల వరకు ఉంటారని ఒక అంచనా. ఏప్రిల్ నెల నుంచి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ స్కీం అమలు పరుస్తూ రాజీవ్ ఆరోగ్య శ్రీ ట్రస్ట్ వారే ఈ పథకం అమలు పరుస్తారని సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతు న్న విషయం తెలుసుకుని వయోధికులు ఇంటర్నెట్ సెంటర్స్, మీ సేవ కేంద్రాలను సంప్రదిస్తున్నారు. ఈ వయో వందన కార్డు పొందాలంటే నేషనల్ హెల్త్ ఏజెన్సీ వెబ్ సైట్ లేదా ఆయుష్మాన్ మొబైల్ ద్వారా ఈ కేవైసి ప్రక్రియ పూర్తి చేయవలసివస్తుంది.

ఆధార్ కార్డ్ వివరాల ప్రకారం అప్లికేషన్ పూరించాలి. గత వారంరోజుల నుంచి వెబ్ సైట్ సందర్శిస్తే ఆయుష్మాన్ వయో వందన కార్డు డౌన్‌లోడ్ కావటం లేదని కేవలం అప్రూవల్ మాత్రమే చూపిం చి కార్డు డౌన్‌లోడ్ కాకపోవడం వలన వయోధికులు నిరుత్సాహంగా ఉన్నారు. చాలా మంది పేదలు, మధ్య తరగతి వృద్ధు లు ప్రైవేట్ హాస్పిటల్ బిల్స్ భరించలేక బాధపడుతున్నారు.

అవసాన దశలో ఉన్న వయోధికులకు ఆత్మ గౌరవంతో కూడిన ఆరోగ్య రక్షణ కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే 'ఆయుష్మాన్ వయో వందన' స్కీంను అమలు పరచడానికి ఉత్తర్వులు జారీ చేయాలని అధికారులను వేడుకుంటున్నారు.

ఆళవందార్ వేణు మాధవ్

# ఆకాశానికి, బిజెపి అవకాశవాదానికి హద్దే లేదు



ఎం. కోటేశ్వరరావు

తమిళనాడులో చరిత్ర పునరావృతమైంది. అధికారం కోసం మరోసారి అన్నాడిఎంకెతో బిజెపి ఎన్నికల ఒప్పందం చేసుకుంది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమక్షంలో 2025 ఏప్రిల్ 11న మైత్రీ బంధాన్ని ప్రకటించారు. ఈ కూటమికి అధికారం వస్తుందో రాదో తెలియదుగానీ ఈ పరిణామంతో ఆ రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు అన్నామలై పదవి మాత్రం పోయింది. అంటే అన్నారని అంటారు గానీ వీరశూర ప్రతిజ్ఞలు చేయాలని అతగాడిని ఎవరైనా కోరారా? డిఎంకె ప్రభుత్వాన్ని గద్దె దించేంతవరకు తాను చెప్పులు ధరించేది లేదంటూ 2024 డిసెంబరు 28న తన ఇంటి ముందు ఆరుసార్లు కొరడా దెబ్బలు కొట్టుకొని పెద్ద ప్రదర్శన చేశారు. అదేమీ లేకుండానే 2025 ఏప్రిల్ 12న చెప్పులు వేసుకున్నారు. ఎందుకంటే అన్నాడిఎంకెతో కలిసి బిజెపి ప్రయాణానికి ఇప్పటికే అమిత్ షా బాట వేసినందున నిరసన విరమించాలంటూ కొత్త అధ్యక్షుడు నాగేంద్రన్, కేంద్రమంత్రి ఎల్ మురుగన్, ఇతర నేతలు కలసి ఒక కార్యక్రమంలో చెప్పులు అందచేశారు. స్వయంగా పరువు తీసుకోవటం, విధి వైపరీత్యం అంటే ఇదే కదా! అతగాడితో కలసి పనిచేయటం తమకు అంగీకారం కాదని, రాష్ట్ర బిజెపి సారధిగా మరొకరిని పెట్టాలని అన్నా డిఎంకె విధించిన షరతుకు బిజెపి తలొగ్గింది. గతంలో అన్నాడిఎంకె నేతగా ఉన్న నైనార్ నాగేంద్రను ఎంపిక చేసింది. 2019లోక్‌సభ ఎన్నికలు, 2021 అసెంబ్లీ ఎన్నికల్లో రెండు పార్టీలు కలసి పోటీ చేశాయి. తరువాత అన్నామలై బిజెపి అధ్యక్ష పదవి స్వీకరించిన తరువాత మాజీ సిఎం అన్నాదురై, జయలలిత, పళనిస్వామిని పదేపదే రెచ్చగొట్టే విధంగా విమర్శించారు. అతని వ్యాఖ్యలతో మైనారిటీల ఓట్లు పోతాయని కూడా అన్నాడిఎంకె భయపడింది. ఆంధ్రప్రదేశ్ ఫార్ములాతో తమిళనాడులో కూడా గెలవాలని రెండు పార్టీల నేతలు కొంతకాలంగా ఆలోచనలు చేస్తున్నారు.

అధికారం వస్తుందంటే బిజెపి దేనికైనా సిద్ధపడుతుంది. తెలంగాణాలో అసెంబ్లీ ఎన్నికలు ముగిసేవరకు అధ్యక్షుడిగా బండి సంజయ్‌ను కొనసాగిస్తామని స్వయంగా ప్రకటించిన పార్టీ సరిగ్గా ఎన్నికలకు ముందు పదవి నుంచి తప్పించి కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డిని కూర్చోపెట్టింది. ఏడాదిన్నర కావస్తున్నా కొత్త అధ్యక్షుడిని ఎన్నుకోలేకపోయింది. వ్రతం చెడ్డా ఫలం దక్కలేదనట్లు బిజెపి పరిస్థితి తయారైంది. బండి సంజయ్‌ను తొలగించినా మిన్నువిరిగి మీద పడలేదు, ఇప్పుడు అన్నామలైని తొలగించినా అంతే కావచ్చు. నోటి దురుసులో ఇద్దరూ ఇద్దరే. తమిళనాడులో ఒక ప్రాంతీయ పార్టీకి అది తోకగా తయారైంది. ఆంధ్రప్రదేశ్‌లో మాదిరి మధ్యవర్తి పవన్ కళ్యాణ్ లాంటి వారెవరూ లేనందున నేరుగా కేంద్ర బిజెపి నాయకత్వం బేరం కుదుర్చుకుంది. ఇటీవల ఆమోదించిన వక్ఫ్ చట్ట సవరణను వ్యతిరేకించిన వారిని ముస్లిం సంతుష్టీకరణ పార్టీలుగా వర్ణించింది. వాటిలో అన్నాడిఎంకె ఒకటి. శుభకార్యానికి వెళుతూ పిల్లిని చంకన పెట్టుకుపోయినట్లు ఇప్పుడు బిజెపి నేతలను చంకనెక్కించుకొని ముస్లింల ఓట్లను అర్థించటం ఆ పార్టీకి పెద్ద పరీక్ష. సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎస్‌డిపిఐ)ని ఉగ్రవాద పార్టీ అని బిజెపి వర్ణించింది. గత లోక్‌సభ ఎన్నికల్లో అన్నాడిఎంకె మద్దతుతో అది ఒక స్థానానికి పోటీ చేసింది. ఇప్పుడు ఎస్‌డిపిఐ కూటమిలో భాగస్వామిగా కొనసాగితే బిజెపి దాని అభ్యర్థులను ఎలా బలపరుస్తుంది, సమర్థిస్తుందన్నది ప్రశ్న. పళనిస్వామి కూడా తమిళనాడుకు బిజెపి చేసిన అన్యాయాల గురించి నిన్నటి వరకు ధ్వజమెత్తారు. ఆకస్మికంగా అదే పార్టీతో చేతులు కలిపితే తమిళ తంబీలు ప్రశ్నించకుండా ఉంటారా? అంతకు ముందు బిజెపితో కలసి ఉన్నపుడు సంకీర్ణ ధర్మంగా సిఎఎను సమర్థించామని విడిపోయిన తరువాత విమర్శించామని చెప్పుకున్న ఆ పెద్దమనిషిని మైనారిటీలు నమ్ముతారా? అదే తర్కం ప్రకారం కొద్ది రోజుల క్రితం వ్యతిరేకించిన వక్ఫ్ చట్టానికి ఇప్పుడు జైకొట్టరనే హామీ ఏమిటి? సినిమా నటుడు విజయ్ నాయకత్వంలోని టివికె పార్టీతో చేతులు కలపాలని తొలుత అన్నాడిఎంకె పావులు కదిపింది. విజయ్ అంగీకరించకపోవటంతో స్వంతంగా డిఎంకెను ఓడించలేమని గ్రహించి బిజెపిని కలుపుకుంది. బిజెపితో తెగతెంపులు చేసుకున్నా 2024లో మైనారిటీల ఓట్లు రాలేదని అందువలన తిరిగి ఆ పార్టీతో చేతులు కలిపినా నష్టం లేదన్నది అన్నాడిఎంకె అంతర్గత ఆలోచన అని కూడా చెబుతున్నారు.

ఐపిఎస్ అధికారి అన్నామలై(40) 2019లో ఉద్యోగానికి రాజీనామా చేసి 2020 బిజెపిలో చేరారు, 2021లో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడయ్యారు. కేవలం ఆరు సంవత్సరాలు మాత్రమే పోలీసు అధికారిగా పనిచేశారు. బిజెపిలో చేరగానే ఇతర పార్టీల తోలువలిచి, తాటతీసే మొనగాడిగా సింహం అంటూ ప్రచారం సాగించారు. 2024లోక్‌సభ ఎన్నికల్లో కోయంబత్తూరులో డిఎంకె చేతిలో ఓడిపోయారు. కొంగు ప్రాంతంలో బలమైన గౌండర్ సామాజిక తరగతిలో వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. అన్నాడిఎంకె నేత ఎడప్పాడి కె పళనిస్వామిది కూడా అదే ప్రాంతం, అదే సామాజిక తరగతికి చెందిన వ్యక్తి. అన్నామలై బిజెపి అధ్యక్షుడిగా ఉంటే పొత్తు ఉండదని కరాఖండితంగా చెప్పటంతో బిజెపి అగ్రనాయకత్వం దిగిరాక తప్పలేదు. కేంద్ర పార్టీలో ఒక ప్రధాన కార్యదర్శి ఇస్తారనే ప్రచారం సాగుతోంది. ఇస్తామని అమిత్ షా గట్టిగా చెప్పలేదు, మా గురించి మీకెందుకు ఆందోళన అంటూ విలేకర్లను ఎదురు ప్రశ్నించారు. ఒకవేళ హోదాతో తమిళనాడులో చక్రం తిప్పాలనుకుంటే పళనిస్వామి అంగీకరిస్తారా అన్నది అనుమానమే. పార్టీ పదవి నుంచి తొలగించటాన్ని అన్నామలై అభిమానులు వ్యతిరేకిస్తున్నట్లు వార్తలు.

2024లోక్‌సభ ఎన్నికల్లో అన్నాడిఎంకె, బిజెపి విడివిడిగా పోటీ చేశాయి. ఈ రెండు కూటముల ఓట్లు కలిస్తే 13లోక్‌సభ నియోజకవర్గాలలో మెజారిటీ వచ్చిందని, వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో ముందుగానే ఒప్పందం చేసుకొని కలసి పోటీచేస్తే అధికారం ఖాయమనే అభిప్రాయంతో అవి కలిశాయి.లోక్‌సభ ఓటింగ్ వివరాలను చూసినపుడు త్రిముఖ పోటీ జరిగింది. డిఎంకె నాయకత్వంలోని కూటమి మొత్తం 39 స్థానాలను గెలుచుకుంది. ఇండియా కూటమికి 46.97, అన్నాడిఎంకె కూటమి 23.05, బిజెపి కూటమి 18.28,ఎన్‌టికె అనే ప్రాంతీయ పార్టీ 8.2శాతం చొప్పున ఓట్లు పొందాయి. అసెంబ్లీ సెగ్మెంట్ల వారీ చూస్తే మొత్తం 234కు గాను ఇండియా కూటమి 221, అన్నాడిఎంకె 10, బిజెపి కూటమి మూడు సీట్లలో మెజారిటీ తెచ్చుకున్నాయి. అయితే బిజెపికి ఒక్క సీటులోనూ మెజారిటీ రాలేదు, దానితో కలసి పోటీ చేసిన పిఎంకె మూడు చోట్ల ఆధిక్యత కనపరిచింది. లోక్‌సభ ఎన్నికలకు ముందు నరేంద్రమోడీ తమిళనాడును ఏడుసార్లు సందర్శించినా ఫలితం దక్కలేదు.

అన్నింటికీ మించి ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ బిజెపి తమిళనాడుకు చేసిన అన్యాయం, డీలిమిటేషన్, హిందీని బలవంతంగా రుద్దే యత్నాలను ఎలాంటి తొట్రుపాటు లేకుండా వ్యతిరేకించి ఎండగడుతున్నారు. అందువలన ఆంధ్రప్రదేశ్ మాదిరి ఫలితాలను ఆశిస్తే అది అత్యాశే అవుతుంది. ప్రముఖ హీరో విజయ్ స్వంత దుకాణం పెట్టుకొని బిజెపి, ఇండియా కూటమి రెండింటినీ వ్యతిరేకిస్తానని ప్రకటించాడు. అన్నాడిఎంకె నుంచి ఉద్వాసనకు గురైన పన్నీర్ సెల్వం, టిటివి దినకరన్ వంటి వారు ఏ వైఖరి తీసుకుంటారో వెల్లడి కాలేదు. డీలిమిటేషన్, భాషా సమస్య మీద రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో అన్నాడిఎంకె, బిజెపి మిత్రపక్షమైన పిఎంకె కూడా మద్దతు ఇచ్చాయి. ఇప్పుడు బిజెపితో కలసి ఈ పార్టీలు ఈ అంశాలపై జనానికి ఏం చెబుతాయన్నది ప్రశ్న. ఇలాంటి తలనొప్పులు ఇండియా కూటమి పార్టీలకు లేవు. ఒకే మాట, బాటలో నడుస్తున్నాయి. వీటిని వ్యతిరేకించే పార్టీలకు డిఎంకెను గద్దె దించాలన్న ఆశ తప్ప ఎలాంటి భావసారూప్యత లేదు.

ఇతర పార్టీల వారు ఇఫ్తార్ పార్టీలకు వెళితే ముస్లింలను సంతుష్టీకరించేందుకు అని బిజెపి దాడి చేస్తుంది. మరి అదే పార్టీ ఈ ఏడాది ఏకంగా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసింది, ఎందుకు అంటే తమకు అందరూ ఒకటే అని చెప్పింది. అన్నాడిఎంకెతో చేతులు కలపటం గురించి చర్చలు జరుగుతున్న సమయంలోనే అన్నామలై ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు బిజెపి మిత్రపక్ష నేతలైన మాజీ సిఎం పన్నీర్ సెల్వం, టిటివి దినకరన్ తదితర నేతలు హాజరయ్యారు. ఇఫ్తార్ విందు కేవలం ప్రారంభం మాత్రమే, మేమంతా కలసి కూర్చుని ఐక్యమై తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని అదే విందుకు వచ్చిన మాజీ తెలంగాణా గవర్నర్ తమిళ సై సౌందర్‌రాజన్ అన్నారు. తనకు అధికారమిస్తే ఇఫ్తార్‌తో పాటు దీపావళి, క్రిస్మస్ విందులను అధికారికంగా ఇస్తానని అన్నామలై చెప్పుకున్నాడు. ఇతర బిజెపి అధ్యక్షుడు ఎవరైనా ఇఫ్తార్ ఇచ్చారా అని విలేకర్లతో గొప్పగా చెప్పుకున్నాడు.

ఆర్ఎస్ఎస్ ఏర్పాటు చేసిన ముస్లిం నేషనల్ ఫోరమ్ దేశవ్యాపితంగా ఇఫ్తార్ విందులు ఇస్తామని గతంలో ప్రకటించింది. రెండు కత్తులు ఒకే వరలో ఇమడవు అన్నట్లు, ఒకే సామాజిక తరగతి, ఒకే ప్రాంతానికి చెందిన నేతలు కూడా అంతే. దీనికి తోడు అన్నామలై 2023లో మాజీ సిఎం అన్నాదురై, జయలలిత, పళనిస్వామి గురించి చేసిన వ్యాఖ్యలు అప్పుడు అన్నాడిఎంకె వేరుపడటానికి కారణమైతే ఇప్పుడు అతగాడిపదవికి ఎసరు తెచ్చినట్లు చెబుతున్నారు. అప్పుడు అన్నామలై బిజెపి నేతలకు కొత్తదేవుడిగా కనిపించటంతో అన్నాడిఎంకెను వదులుకొనేందుకు నిర్ణయించుకున్నారు. ఇప్పుడు మోజు తీరింది గనుక అదే పార్టీతో చేతులు కలిపేందుకు పక్కన పెట్టారు. ఈ ప్రయోగం ఎలాంటి ఫలితాలను ఇస్తుందన్నది పెద్ద ప్రశ్న !

# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## త్వరలో కొత్త టోల్ పాలసీ:గడ్కరీ



**న్యూఢిల్లీ :** కొత్త టోల్ పాలసీ విధానంపై కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ కీలక వ్యాఖ్యలు చేశారు. మోదీ ప్రభుత్వం తీసుకురాబోతున్న కొత్త టోల్‌తో ఇబ్బందులన్నీ తొలగిపోతాయన్నారు. కొత్తగా ప్రవేశపెట్ట బోతున్న టోల్ విధానంలో శాటిలైట్ ట్రాకింగ్, వెహికిల్ నంబర్ ప్లేట్ గుర్తింపు తదితర సాంకేతికను సైతం ఉపయోగించనున్నట్లు ప్రకటించారు. దాంతో నేరుగా బ్యాంకు ఖాతా నుంచి టోల్ మొత్తం డెబిట్ అవుతుందని.. ఇక మాన్యువల్‌గా టోల్ వసూలు చేయాల్సిన అవసరం ఉండదన్నారు. ముంబయి దాదర్ ప్రాంతంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. త్వరలోనే దేశవ్యాప్తంగా టోల్ బూత్‌లను తొలగిస్తామని పునరుద్ఘాటించారు. కేంద్ర ప్రభుత్వం కొత్త టోల్ విధానంపై పనిచేస్తోందని, ఇది త్వరలో అమలు చేయబడుతుందని ఆయన అన్నారు. ప్రస్తుతం వివరాలన్నీ ఇప్పుడే చెప్పలేనని.. మరో 15 రోజుల్లో కొత్త టోల్ పాలసీని ప్రకటించనున్నట్లు తెలిపారు.

## అణగారినవర్గాల అభ్యున్నతిపై ప్రత్యేకదృష్టి పెట్టండి

### 2023 బ్యాచ్ ఐఎఎస్ అధికారులకు రాష్ట్రపతి పిలుపు





**న్యూఢిల్లీ :** అణగారిన వర్గాల అభ్యున్నతికి నూతనంగా చేరిన ఐఎఎస్ అధికారులు ప్రత్యేకంగా దృష్టిసారించాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్మ పిలుపునిచ్చారు.ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (ఐఎఎస్)లో ఉండటం వల్ల లెక్కలేనంత మంది వ్యక్తులలో పరివర్తనాత్మక మార్పులను తీసుకువచ్చే అవకాశం దక్కిందని ముర్మ నొక్కిచెప్పారు.అధికారులు సివిల్ సర్వెంట్ల విధులను, హక్కులను మనసులో ఎప్పటికీ గుర్తుంచుకోవాలన్నారు. మంగళవారం 2023 బ్యాచ్‌కు చెందిన ఐఎఎస్ అధికారులను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్మ ప్రసంగించారు. వీరు వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖలు, విభాగాలలో అసిస్టెంట్ సెక్రటరీలుగా ప్రస్తుతం సేవలు అందిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా బాధ్యతతో కూడిన విధులను నిర్వర్తించాలని, వారి హక్కులు అంటే వారి విధులను పూర్తిగా సమర్థవంతంగా నిర్వర్తించడం అనేది దాని అర్థం అన్నారు. అంకితభావం, గట్టి సంకల్పంతో మీరు మరింత అధికంగా సేవలు అందించడం ద్వారా లెక్కకు మించిన అనేకమంది వ్యక్తిగత జీవితాలలో పరివర్తనాత్మక మార్పులను తీసుకురాగలుగుతారని చెప్పారు. అయితే అణగారినవర్గాల జీవితాల సముద్ధరణకు పాటుపడాలని సూచించారు. ఉద్యోగ ప్రస్థానంలో విధినిర్వహణ ఫలితంగా కొంతకాలం తర్వాత చూస్తే అద్భుతమైన ఫలితాలను అందించగలిగే అవకాశం మీకున్నదని రాష్ట్రపతి గుర్తుచేశారు. సోషల్ మీడియాలో అధిక సంఖ్యలో అనుచరులను పెంచుకోవడంపైన దృష్టిసారించకుండా పనిలో మీ రియల్ కెరీర్ స్టోరీని సృష్టించుకోవాలని ఆమె అధికారులకు ఉద్బోధించారు.ఈ డిజిటల్ యుగంలో ప్రజల తీరని ఆశలు, ఆకాంక్షలు బాగా పెరిగిపోతూనే ఉన్నాయని ముర్మ చెప్పారు. సహచర పౌరులతో మరింత సన్నిహితంగా మెలగాలని అధికారులకు ఆమె సలహా ఇచ్చారు. స్థానిక, రాష్ట్రస్థాయి ప్రజా సంక్షేమం, అభివృద్ధికి పాటుపడితే జాతీయ లక్ష్యాలను సాధించగలిగిన వారువుతారని రాష్ట్రపతి ముర్మ అన్నారు.

## ద్రవ్యోల్బణంపై పార్లమెంటు ప్రత్యేక సమావేశం



### నిత్యావసర ధరల నియంత్రణకు కఠిన విధానం
### పెట్రోలు,డీజిల్,గ్యాస్ ధరలు తగ్గింపునకు కాంగ్రెస్ డిమాండ్

**న్యూఢిల్లీ :** దేశంలో పెరగుతున్న ధరలు, ద్రవ్యోల్బణం, జీవన వ్యవ్యయాల సమస్యపై పార్లమెంటు ప్రత్యేక సమావేశం నిర్వహించకతప్పదనీ, ద్రవ్యోల్బణం సమస్యపై ఒక శ్వేతపత్రాన్ని కూడా ప్రకటించాలని కాంగ్రెస్‌పార్టీ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. పెట్రోటు, డీజిలుపై ఎక్సైజు సుంకం పెంపు, వంటగ్యాస్ సిలిండర్ ధర పెంపు చర్యలు చేపట్టిన కేంద్ర ప్రభుత్వాన్ని పార్లమెంటు ప్రత్యేక సమావేశం నిర్వహించాలని కోరింది. తక్షణం వంటగ్యాస్ సిలిండరు ధరను, పెట్రోలు, డీజిలు ధరలను తగ్గించాలని కాంగ్రెస్ మహిళావిభాగాధిపతి అల్కా లాంబా కేంద్రాన్ని కోరారు. పెట్రోలు, డీజిలు ధరలకు సంబంధించి ఒక కఠిన విధానాన్ని తీసుకురావాలని ఆమె కోరారు. నిత్యావసర ధరలు అదుపు చేసేందుకు ఒక విధానం ఉండాలన్నారు. మహిళలు, పేదలకు ఈ విషయంలో ఒక ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించాలని లాంబా కోరారు. ''ద్రవ్యోల్బణంపై కేంద్ర ప్రభుత్వం మొఖం చాటేసింది, ప్రభుత్వ ఆదాయాలు పెంచుకోవడం, ప్రైవేటు కంపెనీల ఆదాయాలు పెంచడం మాత్రమే ప్రభుత్వలక్ష్యంగా మారింది.దేశంలో ఉన్న సామాన్య ప్రజలు ఈ ధరల పెరుగుదల భారాన్ని మోస్తున్నారు'' అని పత్రికాగోష్ఠిలో లాంబా అన్నారు. కాంగ్రెస్ నాయకత్వాన కేంద్రంలో పాలించిన యుపిఎ ప్రభుత్వ హయాంలో, నరేంద్రమోదీ ప్రభుత్వ హయాంలో పెట్రోలు, డీజిలు, వంటగ్యాస్ సిలిండరు ధరలను ఆమె పోల్చిచూపించారు. ''2014లో పెట్రోలు ధర లీటరుకు రూ.72లు ఉంటే ఈనాడు ఈ ధర రూ.98ల నుండి రూ.100ల వరకూ ఉంది, కాంగ్రెస్ ప్రభుత్వహయాంలో డీజిలు ధర లీటరు రూ.55లు ఉండేది. కానీ ఇప్పుడు మోదీ ప్రభుత్వంలో ఈ ధర లీటరుకు రూ. 88లకు చేరుకుంది'' అని విమర్శించారు. ''కాంగ్రెస్ ప్రభుత్వంలో పెట్రోలుపై ఎక్సైజు సుంకం లీటరుకు రూ.9.20లు ఉంటే ఈనాడు ఈ సుంకం రూ.19 90 లకు పెరిగింది, 2014 లో లీటరు డీజిలుపై ఎక్సైజు సుంకం రూ.3.46లు ఉంటే, ఈనాడు ఈ సుంకం రూ.15.80లకు పెరిగింది, కాంగ్రెస్ ప్రభుత్వహయాంలో ముడిచమురు బ్యారెల్ ధర 108 డాలర్లు ఉంటే, ఈనాడు ఒ బ్యారెల్ ముడి చమురు ధర 65.31 డాలర్లు మాత్రమే ఉంది, ఐనాగానీ సుంకాలు ఎక్కువగా ఉన్నాయి'' అని అల్కా లాంబా విమర్శించారు. దేశవ్యాప్తంగా ద్రవ్యోల్బణంపై కాంగ్రెస్‌పార్టీ ఆందోళన చేపట్టిందని, మహిళలు ఈ ఉద్యమంలో భాగస్వాములయ్యారన్నారు. ప్రజలను దోచుకోవడం ద్వారా కొన్ని కంపెనీలు లాభాలు దండుకుంటున్నాయని ఆమె విమర్శించారు. ''ఈ విషయంలో కాగ్ అకౌంట్లను ఆడిటింగ్ చేయాలి, ఒకవేళ ఈ ఆడిటింగ్ చేయకపోతే, ఈ మొత్తం వ్యవహారంలో బిజెపి జోక్యం ఉన్నట్టుగా స్పష్టంగా తెలిసిపోతుంది'' అని హెచ్చరించారు. ''వెంటనే వంటగ్యాస్, డీజిలు, పెట్రోలు ధరలు తగ్గించాలి, నిత్యావసర వస్తువుల ధరలు నియంత్రించడానికి ఒక కఠిన విధానం తీసుకురావాలి, ధరల పెరుగుదల నుండి మహిళలు, పేద కుటుంబాలకు ఉపశమనం కలిగించడానికి ఒక ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలి, ద్రవ్యోల్బణం సమస్యపై పార్లమెంటు ప్రత్యేక సమావేశం క్షుణ్ణంగా చర్చించాలి'' అని లాంబా డిమాండ్ చేశారు.

## మరోసారి ఘర్షణలు జరగకుండా పటిష్ట భద్రత



**కోల్‌కతా :** పశ్చిమ బెంగాల్‌లోని ముర్షిదాబాద్ జిల్లాలో వక్ఫ్ (సవరణ) చట్టంపై మరోసారి హింసాత్మక ఘటనలు జరగకుండా భద్రతా దళాలు గట్టి నిఘా ఉంచాయని అధికారులు తెలిపారు. జంగీపూర్, ధులియాన్, సుతి, షంషేర్‌గంజ్‌లలో బిఎస్‌ఎఫ్, సిఆర్‌పిఎఫ్, రాష్ట్ర సాయుధ పోలీసులు, ఆర్‌ఎఎఫ్ సిబ్బందిని పెద్ద సంఖ్యలో మోహరించారు. గత 48 గంటల్లో ఎలాంటి హింసాత్మక ఘటనలు జరగలేదు. ముర్షిదాబాద్‌లోని అల్లర్లకు గురైన ప్రాంతాల్లో పరిస్థితి క్రమంగా సాధారణ స్థితికి చేరుకుంటుందని, దుకాణాలు తిరిగి తెరుచుకుంటున్నాయని, నిర్వాసిత కుటుంబాలు జిల్లాకు తిరిగి వస్తున్నాయని రాష్ట్ర పోలీసులు అధికారిలు పేర్కొన్నారు. సవరించిన వక్ఫ్ చట్టంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ శుక్రవారం, శనివారం సుతి, ధులియాన్, జంగీపూర్‌తో సహా జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో హింసాత్మక నిరసనలు చెలరేగాయి. ఘటనలో ముగ్గురు మృతి చెందగా, అనేక మంది గాయపడ్డారు. అయితే ఘర్షణల అనంతరం వెళ్లిపోయిన వారిలో చాలా మంది తిరిగి వస్తున్నారు. హింసకు గురైన అన్ని ప్రాంతాలలో జీవితం సాధారణ స్థితికి చేరుకుంటోందని టిఎంసి ఎంపి ఖలీలూర్ రెహమాన్ చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం బాధిత ప్రజలకు సహాయం చేస్తోందన్నారు. ప్రజల ఆస్తులకు జరిగిన నష్టానికి పరిహారం అందించేందుకు బాధిత ప్రజల జాబితాను జిల్లా యంత్రాంగం రూపొందిస్తోందని ఆయన అన్నారు. సోమవారం, అదనపు డైరెక్టర్ జనరల్ (తూర్పు) రవి గాంధీ నేతృత్వంలోని బిఎస్‌ఎఫ్ ప్రతినిధి బృందం ముస్లింలు అధికంగా ఉన్న జిల్లాలోని అత్యంత ప్రభావిత ప్రాంతాలైన సుతి, సంసెర్‌గంజ్, ధులియన్‌లను సందర్శించింది. ఈ వారాంతంలో విస్తృతమైన అశాంతి నెలకొనగా, ఈ ప్రాంతంలో పెట్రోలింగ్ పెంచడానికి సీనియర్ పోలీసు అధికారులతో ఉమ్మడి వ్యూహాన్ని రూపొందించారు. సాధారణ స్థితి తిరిగి వచ్చేలా తాము రాష్ట్ర పోలీసులతో సన్నిహిత సమన్వయంతో పనిచేస్తున్నామన్నారు. హింసకు సంబంధించి ఇప్పటివరకు మొత్తం 210 మందిని అరెస్టు చేసినట్లు అధికారులు తెలిపారు. కాగా, దక్షిణ 24 పరగణాల జిల్లా భంగర్ ప్రాంతంలోని బసంతి సోమవారం వక్ఫ్ చట్టం సంబంధిత హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయని వారు తెలిపారు. అయితే మంగళవారం హైవే వెంట వాహనాల రాకపోకలు సాధారణంగానే ఉన్నాయన్నారు. ఇండియన్ సెక్యులర్ ఫ్రంట్ (ఐఎస్‌ఎఫ్) మద్దతుదారులు సోమవారం భంగర్ వద్ద పోలీసులతో ఘర్షణ పడ్డారు. ఫలితంగా అనేక మంది గాయపడ్డారు. ప్రజా ఆస్తులను ధ్వంసం చేశారు. పోలీసు వాహనాలను తగలబెట్టారు. పార్టీ నాయకుడు, భంగర్ ఎమ్మెల్యే నౌషాద్ సిద్ధిక్ ప్రసంగించిన వక్ఫ్ చట్ట వ్యతిరేక ర్యాలీలో పాల్గొనడానికి సెంట్రల్ కోల్‌కతాలోని రాంలీలా మైదాన్ వైపు వెళ్తున్న ఐఎస్‌ఎఫ్ మద్దతుదారులను పోలీసులు అడ్డుకోగా, ఘర్షణ వాతావరణం నెలకొంది.

## నితీష్‌ను బిజెపి హైజాక్ చేసింది

### మహాఘుడ్బంధన్ సిఎం అభ్యర్థిపై ఆందోళన వద్దు ఆర్‌జెడి నాయకుడు .తేజస్వి యాదవ్



**న్యూఢిల్లీ :** బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆయా పార్టీ లు ఇప్పటికే నుంచే సంసిద్ధమవుతున్నాయి. అందులో భాగంగా రాష్ట్రంలో మహాఘట్బంధన్ సన్నద్ధత గురించి చర్చించడానికి ఆర్‌జెడి నాయకుడు తేజస్వి యాదవ్ మంగళవారం ఢిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ సహా సీనియర్ కాంగ్రెస్ నాయకులతో సమావేశమయ్యారు. బిహార్‌లో ఇండియా కూటమి ప్రభుత్వం ఏర్పడుతుందనే విశ్వాసాన్ని తేజస్వి వ్యక్తం చేశారు. ఆర్‌జెడి ఎంపిలు మనోజ్ ఝా, సంజయ్ యాదవ్‌లతో కలిసి తేజస్వి యాదవ్ ఖర్గే నివాసంలో కాంగ్రెస్ నాయకత్వాన్ని కలిశారు. మహాఘట్బంధన్ (మహాకూటమి) ముఖ్యమంత్రి అభ్యర్థిపై ఊహాగానాలు చేయవద్దని ఆయన మీడియాను కోరారు. నియోజకవర్గ ప్రజలు తమలో తాము మాట్లాడుకుని నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. కాంగ్రెస్ నాయకులతో సమావేశం తర్వాత యాదవ్ విలేకరులతో మాట్లాడుతూ బిహార్ ముఖ్యమంత్రి, జెడి(యు) అధ్యక్షుడు నితీష్ కుమార్‌ను బిజెపి 'హైజాక్ చేసిందన్నారు. ముఖ్యమం త్రి అభ్యర్థిపై కొందరు ఎందుకు ఆందోళన చెందుతున్నారో తన కు తెలియదన్నారు. తాము అంతర్గతంగా మాట్లాడుకుని నిర్ణయం తీసుకుంటామని, అన్ని విషయాలు స్పష్టమవుతాయని, మీరందరూ ఆ విషయమై ఆందోళన చెందవద్దని సూచించారు. నితీష్ జీని బిజెపి హైజాక్ చేసిందన్నారు. నితిష్ నాయకత్వంలోనే ఎన్నికల్లో పోటీ చేస్తామని అమిత్ షా చెబుతున్నప్పటికీ జెడియు అధ్యక్షుడే సిఎం అవుతారని మాత్రం చెప్పడం లేదన్నారు. బీహార్‌లో 20 సంవత్సరాలుగా ఉన్న ప్రభుత్వం, ప్రధాని మోదీ 11 సంవత్సరాల నుంచి అధికారంలో ఉన్నా బిహార్‌పై సవతితల్లి ప్రేమ చూపుతున్నారని మండిపడ్డారు. బిహార్ ఆర్థికంగా అత్యంత వెనుకబడిందని, అత్యల్ప తలసరి, రైతుల ఆదాయం ఉండగా, అత్యధిక వలసలు నమోదవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాస్తవ సమస్యలపై తాము ఎన్నికలలో పోరాడాలనుకుంటున్నామని తేజస్వీ పేర్కొన్నారు. తాము ప్రతిపక్షంలో ఉన్నామని, ప్రభుత్వ పరిమితులను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. బిహార్‌లో ఇకపై ఎన్‌డిఎ ఉండబోదని, ఇండియా కూటమి ప్రభుత్వం ఏర్పడుతుందని ఆర్‌జెడి నాయకుడు ఉద్ఘాటించారు. కాగా, సమావేశం తర్వాత ఖర్గే ఎక్స్‌లో పోస్టు చేస్తూ ఈసారి బీహార్‌లో మార్పు కచ్చితంగా ఉంటుందన్నారు. తాము మంగళవారం బీహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్‌తో భేటీ అయ్యామని, మహాఘట్బంధన్ బలోపేతంపై చర్చించామన్నారు. రానున్న ఎన్నికల్లో బీహార్ ప్రజలకు బలమైన, సానుకూలమైన, న్యాయమైన, సంక్షేమాన్ని అందిస్తామన్నారు. బిజెపి, అవకాశవాద దుండగుల కూటమి నుండి బిహార్‌కు విముక్తి కల్పిస్తామన్నారు. యువత, రైతులు, కార్మికులు, మహిళలు, వెనుకబడినవారు సమాజంలోని ఇతర అన్ని వర్గాలు మహాఘట్బంధన్ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నాయని ఖర్గే పేర్కొన్నారు.


## అలహాబాద్ హైకోర్టు తీర్పులపై 'సుప్రీం' అభ్యంతరం



**న్యూఢిల్లీ :** అలహాబాద్ హైకోర్టు ఇస్తున్న తీర్పులపై .. అత్యున్నత న్యాయస్థానం అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆ హైకోర్టు నుంచి ఇటీవల వెలుబడిన కొన్ని తీర్పులను సుప్రీంకోర్టు తప్పుపట్టింది. తన సమస్యను తానే కొని తెచ్చుకున్నట్లు ఇటీవల ఓ కేసు తీర్పు సమయంలో రేప్ బాధితురాలని అలహాబాద్ హైకోర్టు తప్పుపట్టిన విషయం తెలిసిందే. ఈ కేసులో హైకోర్టు చేసిన వ్యాఖ్యలను మంగళవారం సుప్రీంకోర్టు ప్రశ్నించింది. మహిళలపై లైంగిక దాడి జరుగుతున్న కేసుల్లో.. తీర్పులు ఇస్తున్న జడ్జీలు అనుచిత వ్యాఖ్యలు చేయరాదు అని సుప్రీంకోర్టు తెలిపింది. జస్టిస్ బిఆర్ గవాయి, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాషితో కూడిన ధర్మాసనం.. ఇటీవల అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును తీవ్రంగా తప్పుపట్టింది. కేసు విషయంలో బెయిల్ ఇచ్చే అధికారం పూర్తిగా జడ్జి ఆధీనంలోనే ఉంటుందని, ఆ కేసుకు చెందిన సాక్ష్యాల ఆధారంగా బెయి ల్ ఇవ్వవచ్చు అని, కానీ బాధితులపై అనవసరమైన వ్యాఖ్యలు చేయరాదు అని సుప్రీంకోర్టు చెప్పింది. వ్యాఖ్యలు చేస్తున్నప్పుడు జడ్జీలు చాలా జాగ్రత్తగా ఉండాలని జస్టిస్ గవాయి తెలిపారు. వీ ద వుమెన్ ఆఫ్ ఇండియా సంస్థ దా ఖలు చేసిన సుమోటో కేసుపై విచారణ చేపడుతూ సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. చేతులతో మైనర్‌ను వేధించడం, పైజామా విప్పడం లాంటి చర్యలు అత్యాచారం యత్నం కిందకు రావు అని ఓ కేసులో హైకోర్టు ధర్మాసనం చెప్పడాన్ని కూడా సుప్రీంకోర్టు తప్పుపట్టింది.

## 'ముడా' కేసులో విచారణ కొనసాగింపు

### లోకాయుక్త పోలీసులకు బెంగళూరు ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు అనుమతి



**బెంగళూరు:** మైసూరు అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ (ముడా) కేసు కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను వెంటాడుతోంది. ఈ కేసులో ఆయనకు మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. 'ముడా' కేసులో విచారణను కొనసాగించేందుకు లోకాయుక్త పోలీసులకు బెంగళూరు ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు మంగళవారంనాడు అనుమతించింది. కర్ణాటక లోకాయుక్త పోలీసులు దాఖలు చేసిన 'బి రిపోర్ట్'తో విభేదిస్తూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాఖలు చేసిన పిటిషన్‌పై తీర్పును ప్రత్యేక కోర్టు వాయిదా వేసింది. ముడా భూముల కేటాయింపులో సిద్ధరామయ్య ఎలాంటి తప్పు చేయలేదని కర్ణాటక లోకాయుక్త పోలీసులు ఇటీవల క్లీన్‌చిట్ ఇచ్చారు. అయితే దీనిని ఇడి, హక్కుల కార్యకర్త స్నేహమయి కృష్ణ సవాలు చేశారు. మరింత లోతుగా దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. దీనిపై న్యాయమూర్తి సంతోష్ గజానన్ భట్ విచారణ చేపట్టారు. లోకాయుక్త పోలీసులు పూర్తి దర్యాప్తు నివేదిక సమర్పించిన తర్వాతే 'బి రిపోర్ట్'పై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేస్తూ, తదుపరి విచారణను మే 7న తేదీకి వాయిదా వేశారు. దీనికి ముందు, సిద్ధరామయ్య, మరో ముగ్గురిపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి మైసూరు డివిజన్ లోకాయుక్త పోలీసులు ప్రాథమిక నివేదకను సమర్పించారు. అయితే విచారణ కేవలం నలుగురు వ్యక్తులకే పరిమితం కాదని, ఇందులో ప్రమేయమున్న అందరికీ దర్యాప్తు జరపాలని, సమగ్ర నివేదిక సమర్పించాలని కోర్టు అభిప్రాయం వ్యక్తం చేసింది.

**సిద్ధరామయ్య ఫ్యామిలీకి 'క్లీన్‌చిట్'**

ముడా కేసులో సిద్ధరామయ్య, ఆయన భార్య పార్వతి, ఇతరుల ప్రమేయం ఉందనడానికి ఎలాంటి సాక్ష్యాలు లేవని గత ఫిబ్రవరిలో లోకాయుక్త పోలీసులు తెలిపారు. ఈ కేసులో నిద్ధరామయ్య, ఆయన భార్య పార్వతి, బావమరిది మల్లికార్జున స్వామి, భూమి యజమాని దేవరాజు నిందితులుగా ఉన్నారు. అయితే, ఈ కేసులో కొన్ని కీలక కోణాల్లో విచారణ జరగలేదని ఈడీ, స్నేహమయి కృష్ణ వాదించారు.

## రక్షణ సంబంధాల బలోపేతానికి... భారత్ -టాంజానియ మంత్రుల సమావేశం

### కేంద్ర రక్షణశాఖ సహాయ మంత్రి సంజయ్‌సేథ్, టాంజానియ రక్షణ, నేషనల్ సర్వీస్ మంత్రి లారెన్స్‌టాక్స్



**న్యూఢిల్లీ :** టాంజానియా రక్షణ, నేషనల్ సర్వీస్ మంత్రి స్టెర్‌గోమెనా లారెన్స్ టాక్స్‌తో కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్‌సేథ్ సమావేశమయ్యారు. సోమవారం దార్ ఎస్ సలామ్‌లో వీరు సమావేశమయ్యారు. తిరుగుబాటు నిరోధక, ఉగ్రవాద నిరోధక కార్యకలాపాలలో ద్వైపాక్షిక సంబంధాలు, సహకారాన్ని బలోపేతం చేసే విషయంలో సరికొత్త మార్గాల అన్వేషణపై వీరివురూ చర్చ జరిపారు. ఏప్రిల్ 14న (సోమవారం) ఈ సమావేశం జరిగింది. సంజయ్ సేథ్ టాంజానియ వైస్ ప్రసిడెంట్ ఫిలిఫ్ ఇస్‌డోర్ ఎంపంగోను కూడా సమావేశానికి పిలిచారని భారత రక్షణ మంంత్రిత్వ శాఖ మంగళవారం తెలియజేసింది. ప్రస్తుతం కొనసాగుతున్న రక్షణ సహకారం గురించి సంజయ్‌సేథ్, స్టెర్‌గోమెనా లారెన్స్ టాక్స్ చర్చించి సమీక్ష జరిపారు. మున్ముందు ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు కొత్త మార్గాలను అన్వేషిస్తున్నట్లు రక్షణ మంత్రిత్వ శాఖ ఇక్కడ విడుదల చేసిన ఒక ప్రకటన తెలియజేసింది. భారతదేశ మిలిటరీ శిక్షణా సంస్థలలో టాంజానియా అధికారులకు శిక్షణ ఇచ్చే విషయం, రక్షణ పరిశ్రమ సహకారం, తిరుగుబాటు నిరోధక, ఉగ్రవాద నిరోధక కార్యకలాపాలలో సహకారం, సైబర్ భద్రత లాంటి కీలక అంశాలపై సహకారం ఇచ్చిపుచ్చుకునే విషయమై ఈ సమావేశం చర్చించింది అని రక్షణ మంత్రిత్వ శాఖ తన ప్రకటనలో వెల్లడించింది. చెన్నైలో, దారు ఎస్‌సలామ్‌లో ఒక బహుపాక్షిక నావికా విన్యాసం, ఆఫ్రికా ఇండియా కీలక సముద్ర ఒడంబడికను, భారత నావికాదళం తొలి చౌరవ హార్బర్‌ను ప్రారంభించడమే కాకుండా డిఫెన్స్ ఎక్స్‌పోను కూడా సంజయ్ సేథ్, స్టెర్‌గోమెనా లారెన్స్ టాక్స్ ఇరువురూ కలిసి ప్రారంభించారు.అనేక సముద్ర సవాళ్లను అధిగమిస్తూ, ప్రశాంతతో కూడిన శ్రేయోదాయక భవిష్యత్‌ను సాధించేందుకు ఇరుదేశాల మధ్య ఐక్యతతో ఒకేతాటిమీద నిలబడాల్సిన అవసరాన్ని సేథ్ నొక్కిచెప్పారు. టాంజానియన్ వైస్ ప్రసిడెంట్ ఎంపంగోతో జరిగిన సమావేశంలో సంజయ్ సేథ్ మాట్లాడుతూ ఆఫ్రికా ఇండియా కీలక సముద్ర ఒడంబడిక సహకారానికి సంబంధించిన తాజా సమాచారం అందించారు. టాంజానియా ప్రజా రక్షణ బలగాలకు అవసరమయ్యే రక్షణ అవసరాలను, ఇండియాటాంజానియా అభివృద్ధి భాగస్వామ్యం, సాంస్కృతిక సంబంధాల, విద్య, వైద్య రంగాలలో సహకారం అందించాలని లారెన్స్ టాక్స్ సంజయ్‌సేథ్‌ను అభ్యర్థించినట్లు రక్షణశాఖ తన ప్రకటనలో వెల్లడించింది.

## జమ్ముకశ్మీర్‌కు అతి త్వరలో.. రాష్ట్ర హోదా పునరుద్ధరణ

### సిఎం ఒమర్ అబ్దుల్లా ఆశాభావం
### అందుకు సమయం ఆసన్నమైందని వ్యాఖ్య



**శ్రీనగర్ :** జమ్ముకశ్మీర్‌కు రాష్ట్ర ప్రతిపత్తి పునరుద్ధరణ అతి త్వరలో జరుగుతుందని తాను ఆశిస్తున్నట్లు ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా మంగళవారం తెలియజేశారు. పుల్వామా జిల్లాలో ఒక వంతెనను ప్రారంభించిన అనంతరం ఒమర్ అబ్దుల్లా విలేకరులతో మాట్లాడారు. 'తగిన సమయం ఆసన్నమైందని భావిస్తున్నాం, అసెంబ్లీ ఎన్నికల దరిమిలా ఆరు మాసాలు గడిచాయి. (కేంద్ర హోమ్ శాఖ మంత్రి) అమిత్ షా ఇక్కడికి వచ్చారు, ఆయనతో నేను విడిగా భేటీ అయ్యాను, సంతృప్తికరంగా సాగింది. జెకెకు త్వరలో రాష్ట్ర హోదా లభిస్తుందని ఇప్పటికీ ఆశిస్తున్నాను' అని ఒమర్ చెప్పారు. వక్ఫ్ సవరణ చట్టంపై చర్చను అధికార పార్టీ అడ్డుకుందన్న ప్రతిపక్షాల ఆరోపణపై సిఎం స్పందిస్తూ, బిల్లును పార్లమెంట్ ఆమోదించినందున వాయిదా తీర్మానాన్ని అనుమతించజాలమని స్పష్టం చేశారు. 'చివరి రోజు స్పీకర్ సర్వ స్పష్టం చేశారు. సభ్యులు వాయిదా తీర్మానాన్ని తీసుకురావడం బహుశా పొరపాటు అయి ఉంటుంది. జెకె ప్రభుత్వ పనులపై చర్చకు మాత్రమే వాయిదా తీర్మానాన్ని తీసుకురావాలి, ప్రభుత్వం స్పందించవలసి ఉంటుంది. వక్ఫ్ బిల్లును మేము తీసుకురానందున ఆ వాయిదా తీర్మానాన్ని ఆమోదించి ఉంటే మేము ఎలా స్పందించి ఉండేవారం చెప్పండి. దానిని కేంద్రం పార్లమెంట్‌లో ఆమోదించింది' అని ఒమర్ పేర్కొన్నారు. అసెంబ్లీలో వేరే నిబంధనల కింద ఒక తీ ర్మానాన్ని అనుమతించి ఉండవచ్చు. అయితే, అది ఇప్పటికే ఆమోద ముద్ర పొందింది. నేషనల్ కాన్ఫరెన్స్ సహా అనేక పార్టీలు సుప్రీం కోర్టును ఆశ్రయించి, కోర్టుకు తమ అభిప్రాయాలు నివేదించాయి. ఇప్పుడు ఎస్‌సి ఏమి చెబుతుందో చూ స్తాం' అని ఆయన తెలిపారు. వంతెన ప్రారంభం పై ఒమర్ వ్యాఖ్యానిస్తూ, 2014 వరదలకు కొట్టుకుపోయిన 11 ఏళ్ల తరువాత దక్షిణ కాశ్మీర్‌లో చరార్ ఎ షరీఫ్‌ను అనుసంధానించే వంతెనను తి రిగి నిర్మించవలసి రావడం దురదృష్టకరమని అన్నారు.

## ఇడి ఎదుట హాజరైన రాబర్ట్ వాద్రా

### నాకు సమన్లు జారీ చేయడం రాజకీయ ప్రతీకారమే : వాద్రా



**న్యూఢిల్లీ :** హర్యానాలో భూ ఒప్పందానికి సంబంధించి మనీ లాండరింగ్ కేసులో వ్యాపారవేత్త, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ బావమరిది రాబర్ట్ వాద్రా వాంగ్మూలాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మంగళవారం నమోదు చేసిందని అధికారిక వర్గాలు తెలిపాయి. దర్యాప్తు సంస్థకు తనకు సమన్లు జారీ చేయడాన్ని రాజకీయ ప్రతీకారంగా వాద్రా అభివర్ణించారు. తనను ఇడి గతంలో ప్రశ్నించిన సమయంలో గంటల తరబడి గడిపానని, వేల పేజీలను వారితో కలిసి పంచుకున్నానని, అయినప్పటికీ ఏజెన్సీ తనపై కేసులు నమోదు చేస్తోందని వాద్రా చెప్పారు. 56 ఏళ్ల వాద్రా సెంట్రల్ ఢిల్లీలోని సుజన్ సింగ్ పార్క్‌లోని తన నివాసం నుండి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎపిజె అబ్దుల్ కలాం రోడ్‌లోని ఇడి ప్రధాన కార్యాలయానికి నడుచుకుంటూ వెళ్లారు. ఆయన భద్రతా బృందం బయట ఉండగా ఉదయం 11 గంటలకు తన న్యాయవాదితో కలిసి ఇడి కార్యాలయంలోకి ప్రవేశించారు. ఇడి కార్యాలయానికి వెళ్లే మార్గంలో విలేకరులతో మాట్లాడుతూ, ఇది రాజకీయ ప్రతీకారం తప్ప మరొకటి కాదన్నారు. తాను మైనారిటీల కోసం మాట్లాడినప్పుడల్లా వారు తనను ఆపడానికి, మమ్మల్ని అణిచివేయడానికి ప్రయత్నిస్తారని, పార్లమెంటులో కూడా రాహుల్ (గాంధీ)ని ఆపడానికి ప్రయత్నించారని, ఇది ఏజెన్సీల దుర్వినియోగం, రాజకీయ ప్రతీకార చర్య అని అన్నారు. గతంలో మాదిరిగానే వారితో సహకరిస్తానని చెప్పారు. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్‌ఎ) కింద ఇడి దాదాపు రెండు గంటల పాటు వాద్రా వాంగ్మూలాన్ని నమోదు చేసినట్లు వర్గాలు తెలిపాయి. ఈ కేసులో ఆయనకు మొదట ఏప్రిల్ 8న సమన్లు జారీ అయ్యాయి. కానీ ఆయన విచారణకు హాజరు కాలేదు. కొత్త తేదీని కోరారని ఆ వర్గాలు తెలిపాయి. కేరళలోని వయనాడ్‌కు చెందిన కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ వాద్రా భర్త రాబర్ట్ వాద్రాకు హర్యానాలోని మనేసర్–షికోహ్‌పూర్ (ఇప్పుడు సెక్టార్ 83)లో జరిగిన భూ ఒప్పందంతో సంబంధాలున్నాయి. ఫిబ్రవరి 2008 నాటి భూ ఒప్పందాన్ని స్కైలైట్ హాస్పిటాలిటీ ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీ నిర్వహించింది. వాద్రా గతంలో డైరెక్టర్‌గా ఉన్నారు, ఆ కంపెనీ షికోహ్‌పూర్‌లో 3.5 ఎకరాల భూమిని ఓంకారేశ్వర్ ప్రాపర్టీస్ అనే సంస్థ నుండి రూ.7.5 కోట్లకు కొనుగోలు చేసింది. ఆ సమయంలో ముఖ్యమంత్రి భూపిందర్ సింగ్ హుడా నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంది. నాలుగు సంవత్సరాల తరువాత, సెప్టెంబర్, 2012లో, కంపెనీ ఈ 3.53 ఎకరాల భూమిని రియల్టీ మేజర్ డిఎల్‌ఎఫ్‌కు రూ.58 కోట్లకు విక్రయించింది. భారీ లాభంతో విక్రయించడంతో మనీలాండరింగ్ ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఇడి విచారణ జరుపుతోంది.



# జనరల్
STATE & REGIONAL NEWS

## దేశంలోనే నెంబర్ వన్ తెలంగాణ పోలీసు

బాధితులకు న్యాయం అందించడంలో - ఐజెఆర్ రిపోర్టు వెల్లడి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బాధితులకు న్యాయం అందించడంలో తెలంగాణ పోలీసులు దేశంలోనే నెంబర్ వన్ స్థానం దక్కించుకుంది. ఈ మేరకు భారతదేశంలో రాష్ట్రాలకు ర్యాంకింగ్ అందించే ఏకైక నివేదిక సంస్థ అయిన ఇండియా జస్టిస్ రిపోర్ట్2025 (ఐజెఆర్) మంగళవారం నివేధిక విడుదల చేసింది.వెల్లడించిన నివేధిక ప్రకారం తెలంగాణ పోలీసు రంగంలో ఒకటవ స్థానంలో, న్యాయవ్యవస్థలో రెండవ స్థానంలో ఉందని వెల్లడైంది. పోలీసుల్లో రెండవ స్థానంలో ఆంధ్రప్రదేశ్, మూడో స్థానంలో కర్నాటక రాష్ట్రం ఉందని నివేధిక పేర్కొంది. ఇతర రాష్ట్రాలతో పోల్చితే నాలుగు రాష్ట్రాలలో మెరుగైన పనితీరు కారణంగా ఐదు దక్షిణాది రాష్ట్రాలు ర్యాంకింగ్స్‌లో ఆధిపత్యం చెలాయించాయి. పోలీసు, జిల్లా న్యాయవ్యవస్థలో కుల కోటాలను (ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి) పూర్తి చేసిన ఏకైక రాష్ట్రం కర్ణాటక. హైకోర్టు న్యాయమూర్తులలో కేరళలో అత్యల్ప ఖాళీలు ఉన్నాయి. జైళ్లలో తమిళనాడు అత్యుత్తమ స్థానం దక్కించుకుంది.

## 'ఇందిరమ్మ' లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలలో
# రూ.20.19కోట్లు జమ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** 'ఇందిరమ్మ' పథకంలో బేస్‌మెంట్ పూర్తి చేసుకున్న 2019 మంది ఇందిరమ్మ లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలలో రూ. 20.19 కోట్లను జమచేశామని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. అర్హులైన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు అధికారులకు, ప్రజాప్రతినిధులకు సమన్వయం ఉండేలా ప్రతి నియోజకవర్గానికి ఒక ప్రత్యేక అధికారిని నియమిస్తున్నట్టు వెల్లడించారు. మొదటి విడతలో ప్రయోగాత్మక ప్రాజెక్ట్ కింద మంజూరు చేసిన 70,122 ఇండ్లలో 2019మంది బేస్‌మెంట్ పూర్తి చేసుకున్నారని, ఇందుకు ఒక్కొక్కరికి లక్ష రూపాయిల చొప్పున రూ.20.19 కోట్లను విడుదల చేసినట్టు మంత్రి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఆటంకం ఏర్పడకుండా నిధులు విడుదల చేస్తామన్నారు. ఇండ్ల గ్రౌండింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని , గ్రౌండింగ్ అయిన ఇండ్ల నిర్మాణ పనులను మరింత వేగవంతం చేస్తున్నామని, ఇప్పటికే 13,500 ఇండ్లు గ్రౌండింగ్ అయ్యాయని వివరించారు. సిఎం రేవంత్ రెడ్డి 12 మంది లబ్ధిదారులకు ఒక లక్ష రూపాయిల చొప్పున చెక్కులను అందజేశారని వివరించారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నాలుగు విడతల్లో లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలోనే నిధులను జమచేస్తామని పునరుద్ఘాటించారు. బేస్‌మెంట్ పూర్తయిన తర్వాత లక్ష రూపాయిలు,గోడలు పూర్తయిన తర్వాత రూ 1.25 లక్షలు, స్లాబ్ పూర్తిచేసుకున్న తర్వాత రూ 1.75 లక్షలు, ఇల్లు పూర్తయిన తర్వాత మిగిలిన లక్ష రూపాయిలను విడుదల చేస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు. బేస్‌మెంట్, గోడలు,స్లాబ్ నిర్మాణం పూర్తి చేసుకున్న లబ్ధిదారులు, అధికారుల కోసం ఎదురుచూడకుండా వారే స్వయంగా ఫోటో తీసి మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేసినా ప్రభుత్వం నిధులను లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తామని, కనీసం 400ఎస్‌ఎఫ్ టికి తగ్గకుండా 600 ఎస్‌ఎఫ్‌టికి మించకుండా లబ్ధిదారులు ఇంటిని నిర్మించుకోవాలని మంత్రి పొంగులేటి సూచించారు.

## మహిళల విశిష్ట అధికారాలకు..
# అంబేద్కర్, రాజీవ్ పునాదులు

గ్రీన్ పవర్ ఉత్పత్తిలో మహిళలకు భాగస్వామ్యం

మహిళా సాధికారతే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యం

స్త్రీ సమ్మిట్‌లో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశంలో మహిళలకు విశిష్ట అధికారాలు, హక్కులు, రాజకీయాల్లో వాటాకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ పునాదులు వేశారని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన స్త్రీ సమ్మిట్‌లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మనదేశంలో బాల్యవివాహాలు, వరకట్నం నిషేధం, మహిళలకు ఓటు హక్కు, విడాకులు, మహిళలకు ఆస్తిలో వాటా వంటి చట్టాలు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ హిందూ కోడ్ బిల్ ద్వారానే ఆచరణలోకి వచ్చాయని వివరించారు. స్థానిక సంస్థల్లో 33శాతం మహిళలకు రిజర్వేషన్‌ను మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ అందుబాటులోకి తీసుకువచ్చారని తెలిపారు. ఈ చర్యల మూలంగా మహిళలు ఎన్నికలు, పరిపాలన రంగంలోకి ప్రవేశించారని తెలిపారు. రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం మహిళా సాధికారతే లక్ష్యంగా ముందుకు సాగుతుందని తెలిపారు. రాష్ట్రంలో ఐదేళ్లలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మొదటి సంవత్సరం లక్ష్యానికి మించి 21 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు స్వయం సహాయక సంఘాల మహిళలకు అందజేశామని తెలిపారు. రాబోయే నాలుగు సంవత్సరాలు ప్రతి ఏటా 20 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు మహిళలకు అందజేస్తామని తెలిపారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన గ్రీన్ పవర్ పాలసీలో మహిళలకు భాగస్వామ్యం కల్పించినట్టు తెలిపారు. సోలార్ ఉత్పత్తి రంగాల్లోకి వారిని తీసుకు వస్తున్నట్టు డిప్యూటీ సీఎం తెలిపారు. విద్యుత్ శాఖ, ప్రభుత్వంలోని ఇతర శాఖలు కలిసి స్వయం సహాయక సంఘాల మహిళలతో వెయ్యి మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు. ఈ ప్రయోగం విజయవంతం అయితే పెద్ద ఎత్తున వారితో సోలార్ ఉత్పత్తి చేయించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్టు తెలిపారు. బ్యాంకు లింకేజీ ద్వారా సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయించి, ఖాళీ స్థలాలు ప్రభుత్వమే లీజుకు ఇచ్చి, మహిళా సంఘాలు ఉత్పత్తి చేసిన విద్యుత్తును ప్రభుత్వమే కొనుగోలు చేసేలా ఒప్పందం కుర్చున్నామని వివరించారు. మహిళలు ఆర్థికంగా ప్రయోజనం పొందేందుకు ఆర్టీసీ బస్సులో రాష్ట్రంలో ఎక్కడైనా ఉచితంగా ప్రయాణించే సౌకర్యం కల్పించినట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు కమిషనర్ సివి ఆనంద్‌తో పాటు పలువురు ఐపిఎస్ అధికారులు, హెచ్‌సిఎస్‌సి నాయకులు పాల్గొన్నారు.



## కార్పొరేట్ సామాజిక బాధ్యతను నిర్వర్తించడంలో ఎస్‌బిఐదే అగ్రస్థానం

ఎస్‌బిఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులుశెట్టి స్పష్టీకరణ

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి రెండు ఎలక్ట్రికల్ వాహనాలు బహూకరణ

**ప్రజాపక్షం/ హైదరాబాద్ :** బ్యాంకుల కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్)ని అంకితభావంతో నిర్వర్తించడంలో సేట్ట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) ముందువరుసలో ఉన్నదని ఎస్‌బిఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులుశెట్టి అన్నారు. ఆయన మంగళవారం తెలంగాణ రాష్ట్రంలో ప్రసిద్ధ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రంగా జగద్విఖ్యాతిగాంచిన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ ఆలయాన్ని సందర్శించారు. ఆలయప్రాంగణంలో సీనియర్ సిటిజన్లు, మహిళలు, దివ్యాంగుల ప్రయాణ సౌకర్యార్థం రెండు ఎలక్ట్రిక్ వాహనాలను ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఇఒ) ఎ.భాస్కర్‌రావుకు బహూకరించారు. సమాజ సంక్షేమానికి పాటుబడే విషయంలో ఎస్‌బిఐ ఏమాత్రం రాజీపడబోదన్నారు. అర్థవంతమైన కార్పొరేట్ సామాజిక బాధ్యతను నిర్వర్తించడం ద్వారా నిరంతరం సమాజ శ్రేయస్సుకు కృషిచేస్తున్న ఎస్‌బిఐ పాత్ర ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. ఎస్‌బిఐ హైదరాబాద్ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేష్‌కుమార్, ఎలక్ట్రికల్ వాహనాలను బహూకరించడంలో ఎకోఫ్రెండ్లీ స్వభావాన్ని ఎస్‌బిఐ పాటించిందన్నారు. భక్తులు వీటిని ఉపయోగించుకోవడం ద్వారా ప్రయాణంలో అద్భుత సౌకర్యవంతంతో కూడిన గొప్ప అనుభూతిని తప్పక పొందుతారన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. వాహనాలను బహూకరించినందుకు శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయ ఇఒ ఎ.భాస్కర్‌రావు ఎస్‌బిఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులుశెట్టికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

## రేవంత్ పిటిషన్‌పై విచారణ నుంచి తప్పుకున్న న్యాయమూర్తి

**హైదరాబాద్ :** హైదరాబాద్ గచ్చిబౌలిలో 2016లో నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసును కొట్టివేయాలంటూ సిఎం రేవంత్‌రెడ్డి వేసిన వ్యాజ్యంపై విచారణ చేపట్టేందుకు జస్టిస్ కె.లక్ష్మణ్ నిరాకరించారు. ఎంపీగా ఉండగా దాఖలు చేసిన పిటిషన్‌లో ప్రతివాది తరఫున గతంలో తాను వాదించినట్లు జడ్జి ప్రకటించారు. కేసు విచారణ నుంచి తప్పుకుంటున్నట్లు మంగళవారం చెప్పారు. మరో జడ్జి విచారణ చేపట్టేలా రిజిస్ట్రీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గోపన్నపల్లిలో సర్వే నెం.127లోని 31 ఎకరాలకు సంబంధించి హక్కుల వివాదంలో ఎస్సీ మ్యూచ్యువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీకి, రేవంత్‌రెడ్డి సోదరుడు ఎ.కొండల్‌రెడ్డి, ఎ.లక్ష్మయ్యల మధ్య నెలకొన్న వివాదం నేపథ్యంలో ఎన్.పెద్దిరాజు అనే వ్యక్తి గచ్చిబౌలి పోలీసులకు ఎస్సీ, ఎస్టీ సెక్షన్ల కింద ఫిర్యాదు చేశారు. ఈ కేసును కొట్టేయాలని సీఎం రేవంత్‌రెడ్డి పిటిషన్ విచారణకు రాగానే న్యాయమూర్తి పైవిధంగా నిర్ణయం తీసుకున్నారు.

## ఉత్తర్వులను ఎందుకు అమలు చేయలేదో కౌంటర్ దాఖలు చేయాలి

**హైదరాబాద్ :** రాష్ట్రంలో కనీస వేతనాలకు సంబంధించి గెజిట్ పబ్లిష్ చేయాలనే తమ ఉత్తర్వులను ఎందుకు అమలు చేయలేదో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్రానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అధికారులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఐదేళ్లకోసారి కనీస వేతనాలను సవరిస్తూ గెజిట్ విడుదల చేయాల్సి ఉండగా, 2007 తర్వాత ఇప్పటివరకు మళ్లీ ఇవ్వలేదని పేర్కొంటూ తెలంగాణ రీజినల్ ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ 2023లో పిల్ దాఖలు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనాల పెంపుపై వివిధ ప్రభుత్వ శాఖలు జీవోలు చేసి చేతులు దులుపుకున్నాయని పిటిషన్ తరఫు న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపించారు. కోటి మందికిపైగా కార్మికులు ప్రభుత్వ చర్యలతో నష్టపోతున్నారని చెప్పారు. వాదనలు విన్న సీజే ధర్మాసనం.. వెంటనే గెజిట్ ప్రింట్ చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, కార్మిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, కార్మిక శాఖ కమిషనర్, ప్రింటింగ్ అండ్ స్టేషనరీ కమిషనర్‌ను ఆదేశిస్తూ 2023లోనే ఉత్తర్వులు జారీ చేసింది. 6 వారాలు సమయం ఇచ్చినా అమలు చేయలేదంటూ పిటిషనర్ మరోసారి కోర్టును ఆశ్రయించి.. ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై యాక్టింగ్ చీఫ్ జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక యారా ధర్మాసనం విచారణ చేపట్టింది. తమ ఆదేశాలను ఎందుకు అమలు చేయలేదో వివరిస్తూ కౌంటర్ వేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. విచారణ వాయిదా వేసింది.

## వక్ఫ్‌బోర్డు సవరణ చట్టాన్ని
# రద్దు చేసేంతవరకు పోరాటం ఆగదు

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాల్‌నర్సింహ్మా



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** కేంద్రంలోని ఎన్‌డిఎ మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ బోరు సవరణ చట్టంను వెనక్కి తీసుకొని రద్దు చేసేంతవరకు దేశం, రాష్ట్రంలో ఉన్న ప్రజాస్వామ్యవాదులు, మేధావులు, ఉద్యమకారులను అన్నివర్గాల ప్రజల మద్దతుతో కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి వ్యతిరేకంగా ప్రజాస్వామ్యపద్ధతి లో న్యాయమైన పోరాటాలని కొనసాగిస్తామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాల్ నర్సింహ్మా తెలియజేశారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద సిపిఐ జాతీయ సమితి పిలుపులో భాగంగా సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో పరిష్కరించాల్సినటువంటి సమస్యలు నిరుద్యోగం, రూపాయి విలువ పడిపోవడం, పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు పెరిగిపోవడం, ఆకలి, అవినీతి పెరిగిపోవడం, మరోపక్క మతోన్మాదం దేశంలో విష కోరలు విప్పి విలయతాండవం చేస్తుందన్నారు. ఆగమేఘాలపైన వక్ఫ్‌బోర్డు బిల్లును ప్రవేశపెట్టి అర్ధరాత్రి మూడు గంటలవరకు పార్లమెంటును నడిపి దేశచరిత్రలోనే మొదటిసారి అత్యంత వివాదాస్పదమైన బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించడం జరిగిందన్నారు.

నిజానికి ఈబిల్లు ఆమోదంద్వారా దేశానికి జరిగే మేలు ఏమిలేదు, కేవలం ప్రభుత్వం ముస్లింలను వేధిస్తూ ఒక మతానికి మాత్రమే నాయకత్వం వహిస్తున్నామని సంకేతాలు ఇప్పించి దేశంలో ప్రజల మధ్య మత విభజనను సృష్టించాడన్నారు. ఈబిల్లుకు సహకరించిన ప్రాంతీయ పార్టీలన్నీ పునరాలోచన చేయాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్రసమితి సభ్యులు హెచ్.ఆనంద్‌జీ, కేశవులుగౌడ్, డిహెచ్‌పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండిలక్ష్మిపతి, ఎఐటియూసి జిల్లాప్రధాన కార్యదర్శి శివశంకర్, సిపిఐజిల్లా సమితిసభ్యులు కృష్ణాజి, రవీందర్, బి.శ్రీనివాసులు, మురళి, రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు బిజ్జ శ్రీనివాసులు, సిపిఐ పట్టణ జాతీయ కార్యదర్శి కొత్తరామస్వామి, నాగర్‌కర్నూల్ పట్టణకేంద్రానికి చెందిన వివిధ రాజకీయపార్టీల కార్యకర్తలు మస్జీద్‌కమిటీ సభ్యులు, వక్ఫ్‌బోర్డుసభ్యులు, ప్రజాసంఘాల నాయకులు నిజాంఖాజాబాబా, రఫిక్, ఇబ్రహీం, మోసిన్, రిటైర్డుటీచర్ ఖాజ, ఎండి మహబూబ్‌ఆలీఫరీద్, సహెబ్‌యాకుబ్, చావుష్ అహ్మద్, ముస్తాక్ ఆలీమ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యాబోధనలో నాణ్యత ముఖ్యం

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ ఇండియా ప్రెసిడెంట్ వి.బి. సింగ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గత యాభై ఏళ్ల కిందటనే ఇంజనీరింగ్ విద్యలో వస్తున్న నూతన మార్పులకు అనుగుణంగా భవిష్యత్ ఇంజనీర్లను తీర్చి దిద్దాలనే ఆలోచనలతో రూపు దిద్దుకున్న హైదరాబాద్‌లోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ అఫ్ ఇండియా నేడు ఆసియాలోనే ఒక ప్రతిష్టాత్మకమైన సంస్థగా పేరు ప్రతిష్టలు సంపాదించుకుందని ఇనిస్టిట్యూట్ అఫ్ ఇంజనీర్స్ ఇండియా ప్రెసిడెంట్ వి.బి. సింగ్ అన్నారు. ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా బోర్డ్ ఆఫ్ మేనేజిమెంట్ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన వి.బి.సింగ్ అప్పట్లో పలు రాష్ట్రాలు పోటీ పడినప్పటికీ, నాటి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం హైదరాబాద్‌లోనే ఈ సంస్థను స్థాపించాలని గట్టి నిర్ణయం తీసుకుని, ఇందుకు అవసరమైన స్థలాన్ని కూడా 1981 లోనే కేటాయించడంతో, అప్పటి ఇండియా ప్రెసిడెంట్ డాక్టర్ ఆర్.వెంకట్ రామన్ భూమి పూజ చేసారని, ఈ 45 ఏళ్ళల్లో దేశంలోని కాశ్మీర్ నుండి కన్యాకుమారి దాక పనిచేసున్న వేలాది మంది ఇంజనీర్లకు ఇంజనీరింగ్ విద్యలో ఎప్పటికపుడు వస్తున్న నూతన సాంకేతికత విధానంపై ఓరియెంటేషన్ తరగతులు నిర్వహిస్తూ వారిలో నూతన ఉత్సాహానికి, దేశ అభివృద్ధికి ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ అఫ్ ఇండియా బాటలు వేస్తున్నట్లు తెలిపారు. శిక్షణ సంస్థలకు డబ్బులు ప్రాధాన్యం కాదని, క్వాలిటీ ఎడ్యుకేషన్ ఇచ్చినపుడు మాత్రమే వాటి పేరు చిరస్థాయిగా ఉంటుందన్నారు.



## యాచక రహిత సమాజాన్ని నిర్మిద్దాం

కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మానవత్వ విలువలను సనాతన ధర్మాన్ని తెలియజేస్తూ యాచక రహిత సమాజ నిర్మాణానికి కృషి చేద్దామని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. హైదరాబాద్ బిజెపి రాష్ట్ర కార్యాలయంలో స్ఫూర్తి, విజేత విద్య సంస్థలకు సంభందించిన విద్యవేత్తలు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కలిసి యాచక రహిత సమాజం, మానవత్వ విలువలు, ధర్మ యుగం అనే అంశాలపై వారు చేస్తున్నా కృషిని వివరించారు. ఈ సందర్భంగా ఆయా అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రముఖ సంగీత దర్శకుడు వందేమాతరం శ్రీనివాస్ పాడిన పాటలను కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా వారిని కిషన్‌రెడ్డి అభినందించారు. యాచక రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ అనేక చోట్ల తల్లిదండ్రులు వదిలేసిన పిల్లలు, పిల్లలకు దూరమైన తల్లిదండ్రులు తిండిలేక రోడ్లపైన అడుక్కుంటున్నారని చెప్పారు. ఈ సమావేశంలో స్ఫూర్తి, విజేత విద్యా సంస్థల అధినేత రామకృష్ణం రాజు, ముదిగొండ విశ్వేశ్వర శాస్త్రీ, సుధీర్ వర్మ, నంద, కిషోర్ పాల్గొన్నారు.

# రాష్ట్రంలో మరో మూడురోజులు వర్షాలు

హైదరాబాద్ సహా పలు జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో రాబోయే మూడురోజులు వర్షాలు కొనసాగుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు చెప్పారు. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేశామని తెలిపారు. దక్షిణ మధ్యప్రదేశ్ మధ్య నుంచి ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒడిశాల మీదుగా దక్షిణ గ్యాంజెటెక్ పశ్చిమ బెంగాల్ వరకు ఉపరితల ఆవర్తనం కొనసాగుతుందన్నారు. సగటున సముద్రమట్టానికి 1.5 కిలోమీటర్ ఎత్తు వరకు విస్తరించి ఉందన్నారు. దక్షిణ మధ్యప్రదేశ్‌లో ఉన్న ఉపరితల ఆవర్తం విదర్భ, మరాఠ్వాడ, ఉత్తర ఇంటీరియర్ కర్ణాటక, దక్షిణ ఇంటీరియర్ కర్నాటక వరకు సముద్ర మట్టానికి 1.5 కిలోమీటర్ల వరకు విస్తరించి ఉందని తెలిపారు. దిగువ ట్రోపో ఆవరణంలో ఆంధ్రప్రదేశ్, యానంలో ఈశాన్య, ఆగ్నేయ గాలులు వీస్తున్నాయన్నారు. నైరుతి బంగాళాఖాతాన్ని ఆనుకొని తమిళనాడు మీదుగా ఉపరితల ఆవర్తనం సముద్రమట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తులో ఏర్పడిందన్నారు. ఈ క్రమంలో రాష్ట్రంలో మూడునాలుగు రోజులు వానలు కొనసాగే అవకాశం ఉందన్నారు. మంగళవారం భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. బుధవారం కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయన్నారు.17న భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్ జిల్లాలు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని హెచ్చరించారు. ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేశామన్నారు.

**హైదరాబాద్‌లో పలు ప్రాంతాల్లో వర్షం**

హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. అమీర్‌పేట, ఖైరతాబాద్, లక్డీకాపూల్, హిమాయత్ నగర్, రాంనగర్, ముషీరాబాద్, ఎస్ఆర్‌నగర్, మధురానగర్, పంజాగుట్ట, బషీర్‌బాగ్, అబిడ్స్, నారాయణగూడ, కోఠి పరిసరాల్లో ప్రాంతాల్లో వర్షం కురిసింది. అప్పటివరకు వేసవి ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న హైదరాబాద్ ప్రజలను వాన చినుకులు పలకరించాయి. దీంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. తీవ్ర ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలు ఉపశమనం లభించింది.

నగర శివారు ప్రాంతం మణికొండలో కొద్ది పాటి వర్షానికే రోడ్డు అంత బురదమయంగా మారింది. తిరుమలగిరి, అల్వాల్, బేగంపేట, ప్యారడైజ్‌లో చిరుజల్లులు కురిశాయి. మలక్‌పేట, చంపాపేట్, సరూర్‌నగర్ పరిసర ప్రాంతాల్లోనూ వర్షం కురిసింది. పలు ప్రాంతాల్లో రహదారులు జలమయమయ్యాయి. వివిధ పనులపై వెళ్తున్న వాహనదారులను వర్షం ఇబ్బంది పెట్టింది. నగరంలోని బేగంబజార్, కోఠి, సుల్తాన్ బజార్, నాంపల్లి, లిబర్టీ, ట్యాంక్‌బండ్ తదితర రోడ్లపై వరద నీటితో వాహనదారులు, పాదాచారులు ఇబ్బందులకు గురయ్యారు.

## వక్ఫ్ సవరణచట్టంపై నేడు సుప్రీం విచారణ

**న్యూఢిల్లీ :** వివాదాస్పద వక్ఫ్ సవరణ చట్టంపై దాఖలైన పలు పిటిషన్లపై సుప్రీంకోర్టు బుధవారంనాడు విచారణ చేపట్టే అవకాశం ఉంది. ఈ సవరణ చట్టం రాజ్యాంగ చెల్లుబాటును సవాలు చేస్తూ ఇప్పటికే అనేక పిటిషన్లు దాఖలయ్యాయి. ఐతే తొలివిడతగా సుప్రీంకోర్టు విచారణ జాబితాలో పది పిటిషన్లను చేర్చారు. వీటిల్లో ఎఐఎంఐఎం నాయకుడు అసదుద్దీన్ ఒవైసీ దాఖలు చేసిన పిటిషన్ కూడా బుధవారంనాడు ప్రముఖంగా విచారణకు వస్తుంది. మరికొన్ని పిటిషన్లను సుప్రీంకోర్టు విచారణ జాబితాలో ఇంకా చేర్చవలసి ఉంది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ కె.వి.విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్లపై విచారణ జరుపుతుంది. అసదుద్దీన్ ఒవైసీ పిటిషన్‌తోపాటు ఆమ్ ఆద్మీపార్టీ నాయకుడు అమానుతుల్లాఖాన్, పౌరహక్కుల రక్షణ సంఘం, అర్షద్ మదానీ, సమస్త కేరళ జమైతుల్ ఉలేమా, అంజుమన్ కదరి, తయ్యబ్ ఖాన్ సల్మానీ, మహ్మద్ షఫి, మహ్మద్ ఫజ్లుర్రెహ్మాన్, ఆర్‌జెడి నాయకుడు మనోజ్ కుమార్ ఝా తదితరులు దాఖలు చేసిన పిటిషన్లు మొదటి విడతగా విచారణకు వస్తాయి. వీటి వెనుకే మరో ఏడుగురు దాఖలు చేసిన తాజా పిటిషన్లు కూడా విచారణ జాబితాలో చేర్చవలసి ఉంది. వీటిల్లో టిఎంసి ఎంపి మహువా మొయిత్రా, సమాజ్‌వాదీపార్టీ ఎంపి (సంభాల్) జియావుర్ రెహ్మాన్ బర్ఖ్‌లు దాఖలు చేసిన పిటిషన్లు ఉన్నాయ. వైఎస్ఆర్‌సిపికి నాయకత్వం వహిస్తున్న ఆంధ్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ) ప్రధాన కార్యదర్శి డి.రాజా, తమిళగ వెట్రి కజగం అధిపతి, నటుడు విజయన్‌లు కూడా సుప్రీంకోర్టులో వక్ఫ్ సవరణ చట్టాన్ని సవాలు చేస్తూ పిటిషన్లు దాఖలు చేశారు. న్యాయవాది హరిశంకర్ జైన్, మణి మంజుల్ కూడా వేరువేరుగా పిటిషన్లు దాఖలు చేశారు.

ఈ చట్టానికి అనేక చట్ట నిబంధనల కింద రాజ్యాంగ చెల్లుబాటు లేదని వారు తమ తమ పిటిషన్లలో పేర్కొన్నారు. ఐతే కేంద్ర ప్రభుత్వం ఈనెల 18వ తేదీన ఒక కెవియట్‌ను సుప్రీంకోర్టులో దాఖలు చేసి తమకు తెలియజేయకుండా ఎలాంటి ముందస్తు ఉత్తర్వులు ఈ కేసులో జారీ చేయవద్దని కోరింది.

## గ్రీన్ ఛానల్ పరిధిలోకి 'గ్రామీణ ఉద్యోగులు'

మే నుంచి క్రమం తప్పకుండా వేతనాల చెల్లింపు

పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధి దస్త్రానికి ఆర్థిక శాఖ ఆమోదం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో పనిచేస్తున్న సుమారు 93 వేల మంది గ్రామీణ ఉద్యోగులకు ఇక నుంచి గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధి శాఖలోని మల్టి పర్పస్ వర్కర్ల నుంచి జూనియర్ పంచాయతీ, అవుట్‌సోర్సింగ్ కార్యదర్శుల వరకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా క్రమం తప్పకుండా ప్రతినెలా వేతనాలు చెల్లించనున్నారు.దీనికి సంబంధించిన దస్త్రానికి ఆర్థిక శాఖ ఆమోద ముద్ర వేసినట్టు తెలిసింది. మే నుంచి వారికి క్రమం తప్పకుండా వేతనాలు సకాలంలో చెల్లించే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం మొత్తంగా 92,175 మంది ఉద్యోగులు గ్రీన్‌ఛానల్ పరిధిలోనికి రానున్నారు. వీరికి ప్రతినెలా సుమారు రూ.115.35కోట్ల వేతనాలను చెల్లించనున్నారు. ఇది వరకు దశాబ్ధాలుగా వారికి వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈ విషయమై గత ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండాపోయిందని ఉద్యోగులు వాపోయారు. ఉద్యోగులకు సంబంధించిన వేతనాల విషయంలో పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ఆర్థిక శాఖకు ప్రతిపాదనలను పంపింది.గ్రామీణ ఉద్యోగులకు వేతనాలను సకాలంలో ఇవ్వాలని పలు మార్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లినట్టు అధికార వర్గాలు పేర్కొన్నాయి. ఇందులో భాగంగా ఉద్యోగుల వేతనాలను గ్రీన్‌ఛానల్ లో చెల్లించేందుకు సంబంధించిన ప్రక్రియను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్,సంచాలకులు సృజన పూర్తి చేశారు. దీంతో ఇక నుంచి గ్రామీణ ఉద్యోగుల నుంచి ప్రతి నెలా 25న అన్‌లైన్‌లో హాజరును తెప్పించుకుని, 26న బిల్ జనరేట్ చేయనున్నారు.

**గ్రీన్‌ఛానల్ వేతనాలు పొందే ఉద్యోగులు వీరే**

మల్టి పర్పస్ వర్కర్లు (52,473), జిపి కంప్యూటర్ ఆపరేటర్లు(1301), మండల్ కంప్యూటర్ ఆపరేటర్లు(278), జెడ్ పిపి పార్ట్ టైమ్‌వర్కర్లు (170),జెడ్ పిపి ఫుల్ టైమ్‌వర్కర్లు(1),ఎంపిపిపార్ట్ టైమ్ వర్కర్లు (1330), ఎంపిపిఫుల్ టైమ్ వర్కర్లు (19), మొత్తంగా 92,175 మంది ఉద్యోగులు గ్రీన్‌ఛానల్ పరిధిలోనికి రానున్నారు.

## రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



**ప్రజాపక్షం/వీపనగండ్ల :** అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులు, పోలీసులు హెచ్చరిస్తున్న మండలంలోని కొందరు ఇసుకసురులు తమ అలవాటును మాత్రం మార్చుకోవటం లేదు. మండల పరిధిలోని తూముకుంట ఓంకారేశ్వర వాగు నుండి సంపత్ రావు పల్లి గ్రామం చెందిన రెండు ట్రాక్టర్లను మంగళవారం తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో వాగు నుండి ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా సమాచారం అందుకున్న పోలీసులు వాగు వద్దకు వెళ్లి ఇసుక లోడుతో ఉన్న రెండో ట్రాక్టర్లను పట్టుకొని పోలీస్ స్టేషన్‌ను తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.రాణి తెలిపారు.

## ధాన్యం కొనుగోలు ప్రారంభించిన మార్కెట్ కమిటీ చైర్మన్



**ప్రజాపక్షం/మక్తల్ :** జెక్లెర్ గ్రామంలో ఐకేపీ డిఆర్‌డిఎ ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలును గావినోళ్ల రాధా లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులు ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా తాము పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకరావాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం క్వింటాలుకు 2300 చెల్లిస్తున్నట్లు తెలిపారు. కొనుగోలు చేసే సమయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చేసుకోవాల్సిందిగా ఐకేపీ మహిళా సమైక్య సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్లు రంజిత్ రెడ్డి ఎం శ్రీనివాసులు అగ్రికల్చర్ ఎఓ మిథున్ చక్రవర్తి, జేక్లెర్ గ్రామస్థులు పాల్గొన్నారు.

## సిఎంఆర్ఎఫ్ పథకం పేదలకు వరం



**ప్రజాపక్షం/వీపనగండ్ల :** అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో మెరుగైన చికిత్స పొందిన వారికి సీఎం రిలీఫ్ ఫండ్ పథకం ఆపద్బాంధవు లాంటిదని నాగర్‌కర్నూల్ జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నర్సింహ అన్నారు. మండల పరిధిలోని కల్వరాల గ్రామానికి చెందిన బండారు చెన్నమ్మ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో మెరుగైన చికిత్స పొందడంతో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో మంజూరైన 60వేల రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కును బాధితురాలు చెన్నమ్మకు నాగర్‌కర్నూల్ జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నర్సింహ అందజేశారు. ఇది ప్రజా ప్రభుత్వమని అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వాన్ని సంక్షేమ పథకాలు అందుతాయని, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యువ వికాసం పథకం కోసం ఈ నెల 24వ తేదీ వరకు అర్హులైన ప్రతి ఒక్కరు దరఖాస్తు చేసుకోవాలని నర్సింహ కోరారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఆసరా



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** నిరుపేదప్రజల మెరుగైన వైద్యానికి సిఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో ఆసరానిస్తుందని కల్వకుర్తి మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ షేక్‌ఎజాస్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి చొరవతో సిఎంరిలీఫ్‌ఫండ్‌ద్వారా కల్వకుర్తి మున్సిపాలిటి 17వవార్డుకు చెందిన జనార్దన్‌కు మంజూరైన రూ.52వేల చెక్కును మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాజీసర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, మాజీకౌన్సిలర్ షేక్ ఎజాస్‌లు లబ్దిదారునికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేదప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించడానికి కృషి చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు




**ప్రజాపక్షం/మాగనూర్ :** ముడుమాల్ దగ్గర కృష్ణానదిలో యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. సోమవారం రాత్రి హిటాచి నది మధ్యలో ఇసుకను డంపు చేసింది. పగటిపూట కూడా నది నడి మధ్యలో ఇసుక తవ్వకాలు చేపడుతున్న హిటాచిని అధికారులు చూసీ చూడనట్టు ఉండడంతో అనేక విమర్శలకు దారి తీస్తుంది. ఇసుకను తరలిస్తు అక్రమార్కులు లాభాలు పొందుతుంటే మరోవైపు రెవిన్యూ, పోలీస్, మైనింగ్ ఆఫీసర్లకు నజరానాలు అందడంతోనే అక్రమ ఇసుక దందా యథేచ్ఛగా కొనసాగుతుందన్న ఆరోపణలు ఉన్నాయి. నదిలో అక్రమ ఇసుక తవ్వకాలు జరుగుతుందన్న విషయంపై కృష్ణ మండంలో ఎక్కడ కూడా పర్మిషన్ ఉన్న రీచులు లేవని ఇసుక ఎక్కడ తవ్వకాలు జరిపినా అక్రమమే అని తెలిపారు. నదిలో ఉన్న హిటాచిని సీజ్ చేసి అక్రమార్కులపై కఠినమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## కొడుకు చేసిన పనికి తండ్రి హత్య



**ప్రజాపక్షం/అచ్చంపేట :** కొడుకు చేసిన ఓ పనికి తండ్రి దారుణంగా హత్యకు గురైన సంఘటన అచ్చంపేట మండలం నడింపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబసభ్యులు, గ్రామస్తుల వివరాల ప్రకారం.. అచ్చంపేట పరిధిలోని నడింపల్లి గ్రామానికి చెందిన దూరం వీరయ్య(55) హత్యకు గురయ్యాడు. మృతుడికి ఇద్దరు కుమారులు. అదే గ్రామానికి చెందిన ఇద్దరు పిల్లలున్న మహిళను తన చిన్న కుమారుడు తీసుకెళ్లి ఆంధ్రలోని గురజాలలో ఉంటున్నాడు. ఈవిషయం తెలుసుకున్న మహిళ కుటుంబీకులు యువకుడిని చితకబాది మహిళను నడింపల్లికి తీసుకువచ్చారు. అనంతరం వీరయ్య కుమారుడు మళ్లీ ఇంటికి వచ్చాడు. ఈక్రమంలో మంగళవారం వీరయ్య తన పెద్ద కుమారుడు వెంకటేష్‌తో కలిసి అచ్చంపేటకు వచ్చారు. పని ముగించుకొని నడింపల్లికి బైక్‌పై వెళుతుండగా హైదరాబాద్ అచ్చంపేట ప్రధాన రహదారి పక్కన ఇటుకల బట్టీల వద్ద మాటువేసిన వారు కారుతో బైక్‌ను ఢీకొట్టారు. బైక్‌పై ఉన్న వీరయ్య, వెంకటేష్ కళ్లలో కారం చల్లి ఆయుధాలతో దాడి చేశారు. అంతటితో ఆగకుండా వీరయ్యను గొడ్డలితో నరకడంతో అక్కడికక్కడే మరణించాడు. గాయాలపాలైన వెంకటేష్ తప్పించుకోవడంతో బయటపడ్డాడు. ఈఘటనతో గ్రామస్తులు ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ రమేష్ గ్రామస్తులను సముదాయించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## గిరిజన సంక్షేమానికి పెద్దపీట



**ప్రజాపక్షం/బిజినేపల్లి :** గిరిజనుల అభ్యున్నతికి ప్రజాప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందని గిరిజన సంఘం జిల్లానాయకులు రాంచందర్‌నాయక్ అన్నారు. గంగారం పరిధిలోని కీమ్యాతండా గ్రామపంచాయతీలో రూ.5లక్షలతో వేస్తున్న సిసిరోడ్లకు మంగళవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన గ్రామాలరోడ్ల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని, కాంగ్రెస్ హయాంలోనే రాష్ట్రం అభివృద్ధి జరుగుతుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేద ప్రజల పక్షపాతి అని, ఆయన నాయకత్వంలో పేదప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఇటీవల కాలంలో పేదప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం పథకాన్ని అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సోమ్లావెంకట్, రవీందర్, సంతోష్, శ్రీను, దశరథం పాల్గొన్నారు.

# పునరావాస కేంద్రం పనులు

# క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్

### అధికారులతో కలిసి పనుల పరిశీలన



**ప్రజాపక్షం/ జడ్చర్ల :** ఉదండపూర్ రిజర్వాయర్ నిర్మాణంలో ముంపునకు గురైన నిర్వాసితులకు పునరావాస కేంద్రంలో మౌలిక సదుపాయాల పనులను జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి మంగళవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. గ్రామాల వారీగా పునరావాస కేంద్రంలో మౌలిక సదుపాయాల పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జడ్చర్ల మండలం దేవుని గుట్ట తండా వల్లూరు, ఉదండా పూర్, తుమ్మల కుంట తండా, ఒంటి గుడిసె తండా ముంపు గ్రామాల నిర్వాసితులకు లోకేషన్ 1,2 ప్రాంతాల్లో చేపట్టిన పనులను రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు, అర్.డి.ఓ ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్‌లతో కలిసి సుమారు మూడు గంటల పాటు కాలినడకన ఎండ తీవ్రతను లెక్క చేయకుండా పునరాసన కేంద్రంలో కలెక్టర్ స్వయంగా పనుల ప్రగతిని పరిశీలించి సమీక్షించారు. పునరావాస కేంద్రం లోకేషన్ 1 లో రేగడి పట్టి తండా చిన్న గుట్ట తండా ముంపు గ్రామాల నిర్వాసితులకు 151 ప్లాట్ లలో చేపట్టిన మిషన్ భగీరథ త్రాగునీరు సరఫరా పైపు లైన్, ట్యాంక్‌ల నిర్మాణ పనులు, డ్రైన్స్ విద్యుత్ పనులు పూర్తి చేయడం జరిగినట్లు అధికారులు వివరించారు. ప్రాథమిక పాఠశాల, అంగన్ వాడి కేంద్రం నిర్మాణం చేయనున్న స్థలం పరిశీలించారు. మిగిలిన పనులు వెంటనే పూర్తి చేసి నిర్వాసితులకు ప్లాట్ లు కేటాయింపు చేయడానికి సిద్ధం చేయాలని అన్నారు. పునరావాస కేంద్రం లోకేషన్ 2 లో వల్లూరు, ఉదండపూర్, తుమ్మలకుంట తండా, ఒంటి గుడిసె తండా, శామగడ్డ తండా ముంపు గ్రామాల నిర్వాసితులకు చేపట్టిన పనుల ప్రగతి పరిశీలించారు. పనులు పురోగతిలో వాటిని సమీక్షించారు. పనుల ప్రగతి ప్రతి వారం కలెక్టర కార్యాలయంలో సంబంధిత అధికారులతో నిర్వహించే సమావేశాల్లో సమీక్షించి పనుల ప్రగతి ఎంత వరకు చేశారు. చేయవలసిన పనులు గురించి క్షుణ్ణంగా పరిశీలించి క్షేత్రస్థాయిలో అధికారులతో సమీక్షిస్తూ పనుల ప్రగతిలో మందగతిలో ఉంటే అధికారులను మందలించి సూచనలు ఇస్తూ పనులను అత్యంత ప్రాధాన్యత నిచ్చి వేసవి లో పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్వాసితుల సమస్యలు విని పరిష్కారం చేస్తానని సూచించారు. కలెక్టర్ వెంట రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు, స్పెషల్ కలెక్టర్ మధుసూదన్, ఆర్‌డిఓ. నవీన్, ఇరిగేషన్ ఎస్.ఈ.చక్ర ధరం, మిషన్ భగీరథ ఎస్.ఈ జగన్మోహన్, సర్వే లాండ్ రికార్డ్స్ ఏ.డి.కిషన్‌రావు, ఇరిగేషన్ ఈఈలు జె. రమేష్, ఉదయ్ కుమార్, మిషన్ భగీరథ ఇంట్రా ఈ. పుల్లారావు, మౌలిక విద్యా సదుపాయాలు సంస్థ ఈఈరాం చందర్, జడ్చర్ల తహశీల్దార్ నర్సింగరావు, డిఈలు, ఏఈలు తదితరులు ఉన్నారు.

## శిక్షణలో నైపుణ్యత పెంచుకోవాలి

### మున్సిపల్ చైర్ పర్సన్ కోనేటి పుష్పలత



**ప్రజాపక్షం/జడ్చర్ల :** బాదేపల్లి పట్టణంలో మంగళవారం ఉమెన్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో 3 నెలలుగా బ్యూటిషన్ శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. స్వయం ఉపాధితో మహిళలు ఎంతో ఆర్థిక అభివృద్ధి చెందాలని బ్యూటిషన్ కోర్సులో నైపుణ్యత పెంచుకోవాలని అలాగే కుట్టు శిక్షణ శిబిరంలో కూడా పెంచుకొని స్వయం ఉపాధి పొందటం ద్వారా కుటుంబం సమాజం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. మహిళలు ఆర్థిక పురోగతి సాధించడంతో పాటు నలుగురికి ఉపాధి కల్పించవచ్చన్నారు. నైపుణ్యత వెలికితీసి ఉపాధి అవకాశాలను పెంపొంది వారికుటుంబ జీవనాధారానికి చేయూతనిచ్చేందుకు ఉమెన్ డెవలప్మెంట్ సొసైటీ శిక్షణ కార్యక్రమం దోహదం చేస్తాయని మున్సిపల్ చైర్ పర్సన్ కోనేటి పుష్పలత అన్నారు. తుదపరి అనంతరము మహిళకు సర్టిఫికెట్ల ప్రధాన నిర్వహించడం జరిగింది. వార్డ్ కౌన్సిలర్ సతీష్ కుమార్, డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షురాలు బాలమణి, సాంస్కర భారతి సభ్యుడు గోనెల రాధాకృష్ణ రేవతి కోనేటీ నరసింహులు, పరమటయ్య, గోపాల్ గౌడ్ గంగాధర్ గౌడ్ మహిళా సభ్యులు పాల్గొన్నారు.

### భవనం కేటాయించాలని

# బిసి కుల సంఘాల విజ్ఞప్తి

### సానుకూలంగా స్పందించిన యెన్నం



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** పాలమూరు జిల్లాలో 65 శాతం బీసీలు ఉన్నందున బీసీ సంఘాలు వివిధ కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు తమ బీసీ కుల సంఘాలకు ప్రత్యేక బీసీ భవన్ కేటాయించాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డికి బిసి కుల సంఘాలు, ప్రజా సంఘాలు వినతిపత్రం ఇచ్చారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వివిధ కుల సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని బీసీలకు ఎక్కడ ప్రత్యేక బీసీ భవన్ లేదని, కాంగ్రెస్ పార్టీ ఆ విషయంలో బీసీల పట్ల చొరవచూపి బీసీ భవనం కేటాయించినట్లయితే రాష్ట్రంలోని మహబూబ్‌నగర్ జిల్లా పేరు చిరస్థాయిగా ఉండటమే కాకుండా బీసీల అభిమానం చురగొనేందుకు అవకాశం ఉందన్నారు. బీసీల వివిధ కార్యక్రమాలు సొంత డబ్బులతో పెట్టి నిర్వహిస్తున్నారు. కాబట్టి ఒక బీసీ భవన్ ఉంటే ఇటువంటి ఖర్చుల తగ్గించుకొని సంఘాల అభివృద్ధికి తాము ఖర్చు పెట్టేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి బీసీ సంఘాల విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించి త్వరలో జిల్లా కేంద్రంలో బీసీ భవన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడం సంతోషదాయకామని బీసీ సంఘాల నాయకులు అన్నారు. బిసి సంఘాల ప్రతినిధులు మోడల శ్రీనివాస్ సాగర్, సారంగీ లక్ష్మీ కాంత్, బుగ్గన్న, రామచంద్రయ్య, చిట్యాల రాములు, వడ్డెర చంద్రశేఖర్ మల్లేష్, నగేష్, పాలమూరు కృష్ణయ్య సత్యం ఆశన్న ముదిరాజ్, మ్యాదరి రాములు, తాయప్ప ముదిరాజ్, పాలకొండ గోవర్ధన్, ఆశన్న, సత్యనారాయణ సాగర్, కన్నా, కొంకతి రాములు, సతీష్, డి.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# డి2 సమీపంలో మట్టితవ్వకాలు



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం అమ్రాబాద్ మండలం దోమలపెంట గ్రామంలో గల ఎస్ఎల్‌బిసి సొరంగప్రమాద ప్రదేశంలో సహాయక చర్యలు కొనసాగుతుండటంతో సహాయకబృందాల ఉన్నతాధికారులతో టన్నెల్ ప్రత్యేకాధికారి శివశంకర్ లోతేటి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొరంగ ప్రమాద ప్రదేశంలో గల డి2 ప్రాంత సమీపంలో వేగంగా సహాయక చర్యలు నిరంతరంగా కొనసాగుతున్నట్లు, ఎస్కవేటర్ల ద్వారా నిర్విరామంగా మట్టి తవ్వకాలు చేపడుతూ కన్వేయర్ బెల్టుపైకి తరలిస్తూ టన్నెల్ బయటికి పంపుతున్నట్లు, టన్నెల్ బోరింగ్ మిషన్‌పై పేరుకుపోయిన బురదను అధిక పీడనంతో విడుదలయ్యే వాటర్‌జెట్‌ల సహాయంతో తొలగించే ప్రక్రియ సమాంతరంగా జరుగుతున్నట్లు తెలిపారు. టిబిఎం భాగాలను కత్తిరించే పనులు చేపడుతూ స్టీలు భాగాలను లోకో ట్రైన్ ద్వారా బయటికి తరలిస్తున్నట్లు వివరించారు. టన్నెల్ లోపల నిరంతరాయంగా వస్తున్న ఊటనీటిని పంపింగ్ స్టేషన్‌ల ద్వారా అత్యధిక సామర్థ్యంగల పంపుల సహాయంతో నదిలోకి పంపుతున్నట్లు తెలియజేశారు. సహాయక చర్యల్లో పాల్గొంటున్న సిబ్బంది రాత్రింబవళ్లు అత్యవసర మందులు, సహాయక సామాగ్రిని, పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్లు వివరించారు. ఈ సమీక్ష సమావేశంలో సింగరేణి మైన్స్ రెస్క్యూ జనరల్ మేనేజర్ బైద్య, ఎస్‌డిఆర్ఎఫ్, జెపి కంపెనీ సీనియర్ ప్రాజెక్టు ఇంజనీర్ సంజయ్‌కుమార్‌సింగ్, హైడ్రా అధికారులు పాల్గొన్నారు.

# చట్టాల రద్దుకు 20న సదస్సు



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** ఎఐటియూసి, సిఐటియు ట్రేడ్ యూనియన్ సంఘాల ఆధ్వర్యంలో ఈనెల20న నిర్వహించే జిల్లాసదస్సును విజయవంతం చేయాలని ఎఐటియూసి జిల్లాప్రధాన కార్యదర్శి శివశంకర్ కోరారు. మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రం లోని సిఐటియు జిల్లాకార్యాలయంలో సిఐటియు, ఎఐటియూసి సంఘాల జిల్లా సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన కార్మిక చట్టాలను రద్దు చేయాలని, ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని అన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులు, గ్రామపంచాయతీ కార్మికులు, మున్సిపల్ కార్మికులు, భవననిర్మాణ కార్మికులు, లోడింగ్ అన్‌లోడింగ్ హమాలీలు, సివిల్‌సప్లై హమాలీలు, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులు, సెకండ్ ఎఎన్ఎంలు, ఇసి ఎఎన్ఎంలు, వ్యవసాయ మార్కెట్ చాటకూలీలు అడ్డా కార్మికులు, జాతీయ ఉపాధి హామీ కార్మికులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఐటియూసి జిల్లా సహాయ కార్యదర్శి బండి లక్ష్మి పతి, ఎఐటియూసి భవన నిర్మాణ సంఘం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా డిహెచ్‌పిఎస్ ప్రధాన కార్యదర్శి దాసరి బాలమురళికృష్ణ, సిఐటియు జిల్లానాయకులు సురేష్, సుభాష్, ఎఐటియుసి నాయకులు గొర్ల సత్యం, బండి శ్రీను పాల్గొన్నారు.

# ముగిసిన పదోతరగతి మూల్యాంకనం



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలోని లిటిల్‌ఫ్లవర్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పదోతరగతి జవాబుపత్రాల మూల్యాంకనం అత్యంత జాగ్రత్తగా ఈనెల7న ప్రారంభమై మంగళవారంతో ముగిసిందని నాగర్‌కర్నూల్ జిల్లావిద్యాశాఖ అధికారి ఎ.రమేష్‌కుమార్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మూల్యాంకనం ప్రశాంతంగా ముగిసిందని, ఎలాంటి అవరోధాలులేకుండా అత్యంత పారదర్శకంగా పదోతరగతి జవాబుపత్రాల మూల్యాంకన ప్రక్రియ నిర్వహించడం జరిగిందని చెప్పారు. 64మంది చీఫ్ ఎగ్జామినర్లు, 384మంది సహాయ ఎగ్జామినర్లు, 130మంది స్పెషల్ అసిస్టెంట్స్ విధులకు హాజరై 1,34,503 జవాబుపత్రాలను మూల్యాంకనం చేసినట్లు వెల్లడించారు. ఎక్కడా ఎలాంటి అసౌకర్యాలు లేకుండా పూర్తిచేశామని, సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎగ్జామ్స్ ఎసి రాజశేఖర్‌రావు, అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్ కుర్మయ్య, కార్యాలయ పర్యవేక్షకులు నాగేందర్, మూల్యాంకనం పర్యవేక్షణ అధికారులు లత, సత్యనారాయణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతయ్య, నర్సింహ్ములు, ఎంఈ వో భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్లపై ధాన్యాన్ని పోసి ప్రమాదాలకు కారణం కావొద్దు

### జిల్లా ఎస్పీ డి.జానకి



**ప్రజాపక్షం/మహబూబ్ నగర్ ప్రతినిధి :** రోడ్లపై ధాన్యాన్ని పంచుకునే విధానంపై ప్రజలకు మహబూబ్‌నగర్ జిల్లా పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. సాధ్యమైనంతవరకు రోడ్లపై ధాన్యాన్ని ఉంచుకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ డి.జానకి అన్నారు. అతివేగంగా రోడ్లపై ప్రయాణించే వాహనాలు, రోడ్లపై పెట్టిన ధాన్యం గుట్టలను గమనించలేక, ప్రమాదాలకు దారితీస్తున్నాయని వివరించారు. ప్రత్యేకంగా రాత్రి సమయంలో రోడ్లపై ధాన్యాన్ని ఉంచి, నల్ల కవర్ కప్పడం వల్ల ధాన్యం కుప్ప కనబడక, వాహనాలు ఢీకొని ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇటువంటి ఘటనలు మానవ ప్రాణాలకు ముప్పుగా మారుతున్నాయని, గతంలో ఈ విధంగా చాలా మంది ప్రాణాలు కోల్పోయిన దుర్ఘటనలు జరిగినట్లు ఆమె తెలిపారు.

**ప్రజలకు సూచనలు :**

1.ధాన్యాన్ని రోడ్లపై ఆరబోయడాన్ని నియంత్రించుకోవాలి.

2. కర్షకులు ధాన్యం ఎండబెట్టే సమయాల్లో రోడ్లపై కాకుండా ఇతర సముచిత ప్రదేశాలను ఉపయోగించుకోవాలి.

3. అత్యవసరంగా రోడ్లపై ధాన్యం ఉండాల్సి వచ్చినప్పుడు స్పష్టమైన గుర్తింపు కోసం అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలి.

4. రోడ్లపై ధాన్యం ఉంటే, ప్రమాదాలకు కారణమయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని గుర్తుంచుకోవాలి.

## మాస్టర్ మైండ్స్ హైస్కూల్ విద్యార్థుల విజయ దుందుభి



**ప్రజాపక్షం/పెబ్బేరు :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఈ అభ్యాస్ అకాడమీ ప్రతి ఏట నిర్వహించే రాష్ట్రస్థాయి ఒలంపియాడ్ పరీక్షలలో పెబ్బేరు మాస్టర్ మైండ్స్ హైస్కూల్‌కు చెందిన పలువురు విద్యార్థులు రామన్ సైన్స్ మహోత్సవ్, రామానుజన్ మ్యాత్స్ మహోత్సవ్, బోస్ మెడికల్ అప్టిట్యూడ్ టెస్ట్ , ఠాగూర్ ఇంగ్లీష్ అప్టిట్యూడ్ టెస్టు, అర్యభట్ట మెంటల్, ఎబిలిటి టెస్ట్‌లలో రాష్ట్రస్థాయి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను సొంతం చేసుకున్నారు. అలాంటి విద్యార్థులను డిఆర్డిఓ డైరెక్టర్ డా.జి.సతీష్ రెడ్డి, ఏఐఎస్ ఆఫీసర్ జనార్ధన్ రెడ్డి, విద్యార్థులను మెమొంటుతో సత్కరించి అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బెస్ట్ ఒలంపియాడ్ స్కూల్ ఆఫ్ ది ఇయర్ అవార్డుతో పాఠశాల కరస్పాండెంట్ లావణ్య, రంగారెడ్డిని ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆదేశాలను పాటించాలి

### పిఎసిఎస్ చైర్మన్ తలసాని జనార్ధన్‌రెడ్డి



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** రాష్ట్రప్రభుత్వం ఆదేశానుసారం కల్వకుర్తి పిఎసిఎస్ పరిధిలో కల్వకుర్తి, ఊర్కొండ మండలాల్లో 22సెంటర్లద్వారా యాసంగి వరిధాన్యం కొనుగోలు చేసే సెంటర్ ఇంచార్జీలకు ప్రభుత్వం నియమ నిబంధనలు, జిల్లా కలెక్టర్ అధికారులు ఇచ్చిన ఆదేశాలను తూచ తప్పకుండా రైతులు పాటించాలని పిఎసిఎస్ చైర్మన్ తలసాని జనార్దన్‌రెడ్డి సూచించారు. వరిధాన్యం విక్రయించే రైతుల నుండి ఆధార్, రైతు పట్టా పాసుబుక్, బ్యాంకు పాసుబుక్ జిరాక్సుతీసుకొని నిర్దేశించిన సెంటర్‌లోనే కొనుగోలుచేయాలని దళారులకు అవకాశం ఇవ్వకుండా చూడాలని ప్రభుత్వ ఆదేశాలను ధిక్కరించిన యెడల చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జిల్లాసహకారశాఖ అధికారి శ్రీనివాస్, సిఇఓ వెంకట్‌రెడ్డి, సెంటర్ ఇంచార్జీలు పాల్గొన్నారు.

## పేదపిల్లల చదువుకు అండగా ఉప్పల వెంకటేష్



**ప్రజాపక్షం/కల్వకుర్తిరూరల్ :** మండలపరిధిలోని గుండూరు గ్రామానికి చెందిన ఇద్దరుపేదపిల్లల చదువులకు అండగా ఉప్పలచారిటబుల్ ఉంటుందని ట్రస్టు చైర్మన్ ఉప్పలవెంకటేష్ అన్నారు. మంగళవారం మండలంలోని గుండూరు గ్రామానికి చెందిన బోడ బీరప్ప కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందడంతో భార్య పిల్లలు ఆర్థిక ఇబ్బందులతో పిల్లలను చదివించుకోలేని పరిస్థితిని కార్మిక సంఘం అధ్యక్షుడు బిఆర్ఎస్‌పార్టీ సీనియర్ నాయకులు సూర్యప్రకాష్‌రావు ద్వారా తెలుసుకున్న ఆయన ఇద్దరు పిల్లలను చేరదీసి వారి కుటుంబానికి అండగా ఉంటానని తమట్రస్టుద్వారా చదివించే బాధ్యత తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం




**ప్రజాపక్షం/ఊర్కొండ :** ఊర్కొండ మండలంలోని రాచాలపల్లి గ్రామానికిచెందిన మంగలిఅంజమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాదారం మాజీసర్పంచ్, కాంగ్రెస్ మండల పార్టీవర్కింగ్ ప్రెసిడెంట్ ధ్యాపనిఖిల్‌రెడ్డి మృతురాలి కుటుంబానికి కాంగ్రెస్ నాయకుల ద్వారా రూ.5వేలు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ యువనాయకులు మధురెడ్డి, అఖిల్, పరమేష్, వెంకటేష్, సాయికృష్ణ, సంతోష్, హరీష్ పాల్గొన్నారు.

## భూ నిర్వాసితులకు ఇండ్ల స్థలాల పరిశీలన



**ప్రజాపక్షం/మర్రిగూడ:** శివన్నగూడ రిజర్వాయర్ భూములు, ఇండ్లు కోల్పోయిన చర్లగూడెం గ్రామ భూ నిర్వాసితులకు మంగళవారం చండూరు ఆర్‌డిఓ శ్రీదేవి ఇరిగేషన్, ఈఈ, రాములు నాయక్, చింతపల్లి మండలంలోని వర్కాల గ్రామంలో నిర్వాసితులతో కలిసి ఇండ్ల స్థలాల పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో భూ నిర్వాసితుల నాయకుడు ఎరుకల నిరంజన్ గౌడ్, వల్లపు కేశవులు, మాదగొని శ్రీను, రామకోటి గౌడ్, బండి నరసింహ, ఎరుకలి యాదయ్య, నిర్వాసితులు ఉన్నారు.

## అధికారులు సరైన జాబితా, పూర్తి సమాచారంతో రావాలి : కలెక్టర్



**ప్రజాపక్షం/యాదాద్రి :** జిల్లా సమన్వయ పర్యవేక్షణ కమిటి (దిశ) సమావేశమునకు సంబంధిత శాఖ అధికారులు సరైన జాబితా, పూర్తి సమాచారంతో రావాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మంగళవారం మినీ మీటింగ్ హాలులో రేపు జరిగే దిశ మీటింగ్ పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించబడుతున్నందున కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలు జరిగే పథకాల పై 2024/25. (తేది: 01.07.2024 నుండి 31.03.2025 ) ఆర్థిక సంవత్సరమునకు సంబందించిన పూర్తి సమాచారం తయారు చేసుకొని సమావేశంకు సకాలంలో హాజరు కావాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో శోభారాణి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగి రెడ్డి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## విధుల పట్ల అప్రమత్తం : ఎస్‌పి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** పోలీసులు విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్‌పి కె నర్సింహ అన్నారు. మంగళవారం సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మీకంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రిసెప్షన్ సెంటర్‌లో ఫిర్యాదుల నిర్వహణ రికార్డును పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీసులకు సలహాలు, సూచనలు చేశారు. ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగ నడుచుకోవాలని, పోలీసుల సేవల పట్ల నమ్మకం కలిగేలా త్వరితగతిన ప్రాథమిక దర్యాప్తు పూర్తి చేయాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలు, ఇతర సామాగ్రిని ఆయన పరిశీలించారు. సిసి కెమెరాల కంట్రోల్ సెంటర్‌ను తనిఖీ చేసి సిసి కెమెరాల ఉపయోగాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. రౌడీషీటర్లపై, లాండ్ గ్రాఫర్‌పై నిఘా పెంచాలని, ప్రజలను ఇబ్బందులు కలిగేలా చేసే వారు ఎంతటివారైన కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం నేరమని, మద్యం ప్రియుల ఆటలు కట్టడి చేయాలన్నారు. రద్దీ ప్రాంతాల్లో నిఘా పెట్టాలన్నారు. అనంతరం పోలీస్ సిబ్బందితో మాట్లాడి ఆయా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పట్టణ ఇన్‌స్పెక్టర్ వీరరాఘవులు, ఎస్‌ఐలు ఆంజనేయులు, సైదులు, ఏడుకొండలు ఉన్నారు.

## రైతు భరోసా కూడా కంచికేనా...?

సిపిఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్(గరిడేపల్లి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉగాది నాటికి రైతులందరికీ రైతు భరోసా నిధులను వారి ఖాతాలలో జమ చేస్తామని చెప్పి ఇన్ని రోజులు అవుతున్నా,లక్షలాది మంది రైతుల ఖాతాలలో నేటికి కూడా రైతు భరోసా నిధులు జమ కాలేదని రుణమాఫీ లెక్క రైతు భరోసా కూడా కంచికేనా అని సిపిఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం గరిడేపల్లి మండలంలోని గానుగబండలో జరిగిన రైతుసంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతుల విషయంలో ప్రభుత్వం చెప్పేదానికి,చేసేదానికి పొంతన లేకుండా పోయిందన్నారు. రైతుల విషయంలో మోసం చేసిన పాలకులు ముందర పడ్డ చరిత్ర లేదని,రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఓట్ల కోసం ఎన్నికలల్లో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలన్నారు. మిగిలిన రైతులకు కూడా రుణ మాఫీ చేసి,రైతు భరోసాను రైతుల ఖాతాలలో జమ చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు కడియాల అప్పయ్య,కుందూరు వెంకటరెడ్డి,పోకల ఆంజనేయులు,షేక్ నబిసాహెబ్,ఈద సైదులు,షేక్ పీర్ సాహెబ్,పోకల నరసింహారావు,పంగ సైదయ్య,పాలెల్లి సైదులు,శేషమ్మ, సాంబయ్య,నందిపాటి కాశయ్య,తాళ్ల తిరపతయ్య,మెండే వెంకటేశ్వర్లు,లింగరాజు, ముండ్ల కోటయ్య, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

## నాంపల్లిలో అకాలంగా ఈదురు గాలులు, వడగళ్ల వర్షం



**ప్రజాపక్షం/ నాంపల్లి:** అకాలంగా కురుస్తున్న వర్షాలతో ఆరు కాలం కష్టించి పండించిన పంట తడవడంతో రైతన్నలు ఆగమవుతున్నారు. మంగళవారం మండల వ్యాప్తంగా అకాలంగా ఈదురు గాలులతో పాటు వడగళ్ల వర్షం కురవడంతో మండలంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతుల అమ్మకానికి ఉంచిన దాన్యం పై కప్పిన పట్టాలు ఎగిరిపోయి దాన్యం తడిసి ముద్దవ్వడంతోపాటు అక్కడక్కడ చెట్లు విరిగిపోయాయి. మండలంలో ఖరీఫ్ సీజన్లో పండిన పంటను ఇప్పటికే కోతపూర్తై ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకురాగా మరి కొంతమంది రైతులు పంట పొలాల్లోనే పంట కోయకుండా ఉండడంతో ప్రస్తుత వర్షాలకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో ని మార్కెట్ యార్డ్ లో పిఎసిసిఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి 14 రోజులు ఆయనప్పటికీ ఇప్పటివరకు హమాలీలు లేకపోవడం విశేషం. ఇప్పటికైనా ధాన్యం కొనుగోలు కేంద్రంలో హమాలీలను ఏర్పాటు చేసి తీమశాతం వచ్చే రైతుల ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి ఎప్పటికప్పుడు మిల్లులోకి పంపించే ఏర్పాట్లు చేయాలని పలువురు అంటున్నారు.

## నాణ్యమైన మెటీరియల్‌ను ఉపయోగించండి

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం నమూనా పరిశీలన

**ప్రజాపక్షం/ జోగులాంబ గద్వాల ప్రతినిధి:** గద్వాల నియోజకవర్గం ధరూర్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇల్లు నమూనాను ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్, జాయింట్ కలెక్టర్ లక్ష్మీ నారాయణ పరిశీలించడం జరిగింది. ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పనుల పై సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడుతూ నాణ్యమైన మెటీరియల్‌ను ఉపయోగించి త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. త్వరలోనే ఇందిరమ్మ ఇల్లు పథకంలో మంజూరైన లబ్ధిదారులకు ఇల్లు నిర్మాణం చేసుకునే విధంగా ప్రభుత్వం కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విజయ్, మాజీ జెడ్పిటిసి రాజశేఖర్, మాజీ వైస్ ఎంపీపీ రామకృష్ణ, నాయుడు, నాయకులు రమేష్ నాయుడు, శ్రీనివాస్ రెడ్డి, అధికారులు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# సంక్షేమ చట్టంలో నిబంధనలు మార్చొద్దు

భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్



**ప్రజాపక్షం/చింతలపాలెం:** పాలకులు సంక్షేమ చట్టంలోని నిబంధనలు మారిస్తే ప్రతిఘటిస్తామని భవన నిర్మాణ కార్మిక సంఘం(ఎఐటియుసి అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారగోని ప్రవీణ్ కుమార్ అన్నారు. మండలంలోని దొండపాడు గ్రామంలో జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం 4వ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహాసభను పురస్కరించుకొని గ్రామంలో కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. సంఘం జెండాను మామిడి శ్రీనివాస్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మమిక చట్టాలను పాలకులు తమకు అనుగుణంగా మార్చుకుంటున్నారని అన్నారు. దేశ వ్యాప్తంగా కార్మిక చట్టాలు ఒకేలా ఉండాలన్నారు. సభ్యుల సభ్యత్వ నమోదును గుర్తించి ప్రమాద పరిహారంతో పాటు 60 సంవత్సరాలు దాటిన కార్మికులకు పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేశంలో ఎక్కడైన వర్తించే విధంగా గుర్తింపు కార్డులు జారీ చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డును రద్దు చేసి ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలన్నారు. రానున్న రోజుల్లో కార్మికులు తమ హక్కుల సాధన కోసం నిర్వహించే సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ఈనెల 21,22 తేదీల్లో రంగారెడ్డి జిల్లాలో జరిగే రాష్ట్ర మహాసభకు కార్మికులు పెద్ద ఎత్తున తరలి వచ్చి జయప్రదం చేయాలన్నారు. ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాస్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉస్తెల నారాయణరెడ్డిలు మాట్లాడుతూ పాలకులు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం కార్మికులు ఐక్యతతో ముందుకు సాగి హక్కులను సాధించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జడల శ్రీనివాస్, ఎస్‌కె లతీఫ్, రాఘవరెడ్డి, చింత్రియాల రవి, జియాలుద్దీన్, జట్టి ప్రసాద్, బాలశౌరి, విద్యాచారి, వెంకటేశ్వర్లు, సైదులు, కాసర్ల కాంతారావు, రేవూరి సత్యం పాల్గొన్నారు.

## దివ్యాంగ కుమారుడిని బావిలో తోసి తల్లి ఆత్మహత్య

తల్లి, కొడుకు మృతితో గ్రామంలో విషాదాచాయలు



**ప్రజాపక్షం/కోదాడ(చిలుకూరు):** దివ్యాంగుడైన తన కొడుకును బావిలోకి తోసి తాను బావిలోకి దూకి ఆత్మహత్య చేసుకోవడంతో తల్లి,కొడుకు ఇద్దరు మృతి చెందిన సంఘటన మంగళవారం చిలుకూరు మండలం కొత్త కొండాపురం (రామచంద్రనగర్) గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, మృతుల కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం చిలుకూరు మండల పరిధిలోని పాత కొండాపురం గ్రామంకు చెందిన బుడిగెం వీరమ్మ (65) భర్త భిక్షమయ్యకు ముగ్గురు కుమారులు. గత కొన్నేళ్ల క్రితం బిక్షమయ్య మృతి చెందాడు. ముగ్గురు కుమారుల్లో రెండో కుమారుడు వీరబాబు అనారోగ్యంతో ఇటీవల కాలంలో మృతి చెందాడు. మొదటి కుమారుడు వెంకన్న గత కొంతకాలంగా అనారోగ్యంకు గురై చికిత్స పొందుతున్నాడు. మూడో కుమారుడు నాగేశ్వరరావు దివ్యాంగుడు (మూగీ) వాడు. భర్త మృతి చెందిన దగ్గర నుండి వీరమ్మ తన దివ్యాంగ కుమారుడు నాగేశ్వరరావుతో కలిసి ఆమె తమ్ముడు దొంగరి నాగేశ్వర రావు అండదండలతో ఉంటున్నారు. ఆమె కుటుంభంకు నాగేశ్వరరావు చేదోడువాదోడుగా ఉంటున్నాడు. ఆమె తమ్ముడు నాగేశ్వరరావు కూడా ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో ఆమె తీవ్ర మనస్థాపనకు గురైంది. ఆమెకు, దివ్యాంగుడైన నాగేశ్వరరావుకు దిక్కు ఎవరు లేరని భావించిన వీరమ్మ సోమవారం రాత్రి గ్రామ శివారులోని వెంకటేశ్వర్లు రైతు బావిలోకి తన కొడుకును తోసి ఆమె కూడా బావిలోకి దూకి ఆత్మహత్య చేసుకుంది. మంగళవారం బావిలో శవాలు తేలడంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు గ్రామస్తుల సాయంతో మృతదేహాలను బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను కోదాడ ప్రభుత్వ వైద్య శాలకు తరలించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను బంధువులకు అప్పగించారు. మృతుల బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ సురభి రాంబాబుగౌడ్ తెలిపారు. వీరమ్మ, నాగేశ్వరరావు మృతితో గ్రామంలో విషాదాచాయలు అలుముకున్నాయి.



## సోషల్ మీడియా సైనికులే కాంగ్రెస్‌కు బలం

భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి

**ప్రజాపక్షం/యాదాద్రి :** కాంగ్రెస్ పార్టీకి అధికారంలోకి రావడానికి ముఖ్య కారకులు సోషల్ మీడియా సైనికులే అని భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం పెద్ద అంబర్ పేటలోని తన క్యాంప్ కార్యాలయంలో భువనగిరి పార్లమెంట్ సోషల్ మీడియా సైనికులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు, పార్టీ బలోపేతానికి తీసుకోవలసిన చర్యలపై వారికి దిశా నిర్దేశం చేశారు, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన దగ్గర నుండి చిత్తశుద్ధితో పనిచేస్తూ ప్రజాపాలన అందిస్తుందనీ సన్న బియ్యం, ఉచిత విద్యుత్తు, 500కు గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, యువకులకు స్వయం ఉపాధి కోసం రాజీవ్ యువ వికాసం ఇలా పలు రకాల పథకాలను ప్రవేశపెట్టి ప్రజల కోసం పనిచేస్తుందనీ వీటన్నిటి గురించి ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చెయ్యాలని సూచించారు. ఎలాంటి భేదాభిప్రాయాలు లేకుండా పార్టీ నాయకత్వాన్ని బలపరచాలని అన్నారు, కాంగ్రెస్ పార్టీ సముద్రం లాంటిదని, పనిచేసిన గారికి ఖచ్చితంగా సరైన సమయంలో సరైన పదవులు, సముచితమైన గౌరవం ఇస్తుందని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా కంకణబద్దులు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలు నియోజకవర్గాల నుండి సోషల్ మీడియా కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** వేప చెట్టుకు టవల్‌తో వేలాడుతూ గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన సంఘటన మిర్యాలగూడ రైల్వే స్టేషన్ సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. మిర్యాలగూడ రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మిర్యాలగూడ రైల్వే స్టేషన్ సమీపంలోని వేప చెట్టుకు మృతదేహం వేలాడుతూ కనిపించిందని మంగళవారం పశువుల కాపరి మధ్యాహ్నం మిర్యాలగూడ రైల్వే స్టేషన్ సిబ్బందికి, రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో అక్కడికి చేరుకున్న రూరల్ ఎస్‌ఐ లక్ష్మయ్య మృతదేహాన్ని గమనించి 3035 సంవత్సరాల వయస్సు గల గుర్తు తెలియని పురుషుడు వేప చెట్టుకు రెండు మూడు రోజుల క్రితం టవల్‌తో ఉరి వేసుకోని మృతిచెందినట్లు గుర్తించామన్నారు. మృతదేహం పక్కన ఉన్న చొక్కాలో ఈనెల 12న సికింద్రాబాద్ నుంచి సెరామ్(కర్ణాటక)కు రైల్వే టికెట్ లభించిందన్నారు. మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రిలోని మార్చురికి తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతదేహాన్ని గుర్తించిన వారు ఎవరైనా మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

## స్థానిక వాహనదారులకు టోల్‌గేట్ ఫీజు లేకుండా ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలి

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ధనుంజయ నాయుడు డిమాండ్



**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** స్థానిక వాహనదారులకు 20కిలోమీటర్ల లోపు టోల్ గేట్ ఫీజు లేకుండా ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు అన్నారు. మంగళవారం మున్సిపల్ కేంద్రంలోని పార్టీ కార్యాలయం ప్రజా భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర మంత్రి నితిన్ గట్కారి ఇంటి నుండి 60 కిలో మీటర్ల వరకు టోల్ ఫీజు లేకుండా ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని పార్లమెంట్ సాక్షిగా ప్రకటించారన్నారు. నేరేడుచర్ల సమీపంలోని చిల్లపల్లి టోల్ ప్లాజా వద్ద అఖిలపక్షాల ఆధ్వర్యంలో ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించగా టోల్ గేట్ యాజమాన్యం స్థానిక వాహనదారులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని పత్రిక ముఖంగా ప్రకటించిందన్నారు. కొద్ది రోజులకే తిరిగి యాజమాన్యం టోల్ ఫీజును వసూళ్లు చేయడం జరుగుతుందన్నారు. జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ జోక్యం చేసుకొని టోల్ ఫీజు లేకుండా స్థానిక వాహనదారులు ఉచితంగా ప్రయాణించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ కార్యదర్శి ఎల్లబోయిన సింహాద్రి, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు చిలక రాజు శ్రీను పాల్గొన్నారు.

## బాలికల ఎస్‌సి సంక్షేమ హాస్టల్‌లో ఎసిబి అధికారుల తనిఖీ



**ప్రజాపక్షం/తుంగతుర్తి:** నియోజకవర్గ కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఎస్‌సి సంక్షేమ హాస్టల్‌లో మంగళవారం తెల్లవారుజామున ఏసిబి అధికారులు తనిఖీ చేశారు. ప్రభుత్వం ప్రతి విద్యా సంవత్సరం విద్యార్థుల కోసం ఇచ్చే సంక్షేమ ఫలాలు విద్యార్థులకు అందుతున్నాయా లేవా అని తెలుసుకునేందుకు ఈ తనిఖీలు నిర్వహించినట్లు ఏసిబి అధికారులు తెలిపారు. హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన భోజనం, దుస్తులు, దుప్పట్లు, నోటు, పాఠ్యపుస్తకాలు అందించారా, హాస్టల్ పరిసరాల పరిశుభ్రత, వార్డెన్ అందుబాటులో ఉంటున్నారా అనే కోణంలో తనిఖీ నిర్వహించారు. ప్రభుత్వం అందజేస్తున్న నిధులను తప్పుడు బిల్లులు పెట్టి కాజేస్తున్నారనే ఆరోపణలు అందడంతో రాష్ట్ర వ్యాప్త తనిఖీల్లో భాగంగా తుంగతుర్తి ఎస్‌సి బాలికల సంక్షేమ హాస్టల్‌లో తనిఖీలు చేసినట్లు నల్లగొండ ఏసిబి డిఎస్‌పి జగదీష్ చంద్ర, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ స్వాతి, ఆడిటర్ ప్రవీణ్, శానిటరి ఇన్‌స్పెక్టర్ నాగరాజు, లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబులు తెలిపారు. హాస్టల్ విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. హాస్టల్ వార్డెన్ అందుబాటులో ఉండరని, నెలలో కొద్ది రోజులు మాత్రమే వస్తారని చెప్పారు. అడ్మిషన్ రికార్డులో 51మంది విద్యార్థులు ఉండగా అధికారుల పరిశీలనలో 25మంది విద్యార్థులే హాస్టల్‌లో ఉంటున్నట్లు తేలింది. అడ్మిషన్ రికార్డుతో పాటు మరే రికార్డు సరిగ్గా లేదని తెలిపారు. స్టోర్ రూంలో విద్యార్థుల అవసరాలకు సరిపడ సరకులు లేకపోగ పురుగులు పడి ఉన్నట్లు గుర్తించారు. హాస్టల్‌లో సరైన బెడ్స్ లేకపోవడంతో విద్యార్థులు అక్కడ ఉండడం లేదని తేల్చారు. హాస్టల్ తనిఖీలో తాము గుర్తించి అంశాలను ఏసిబి డిజికి నివేదిక అందజేస్తామని వారు చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులు లంచాలు ఆశిస్తే ఏసిబి టోల్ ఫ్రీ నెంబర్ 1064కు సమాచారం ఇవ్వాలన్నారు.

# ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలి

యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు



**ప్రజాపక్షం/యాదాద్రి :** ప్రతి గ్రామంలో తిరుగుతూ ప్రజల యొక్క సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ హనుమంతరావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డితో కలిసి తాగునీటి సమస్య, ఇందిరమ్మ ఇండ్లు, భూభారతి వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాల పై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. రాబోవు మే, జూన్ మాసాలు వేసవి సీజన్ దృష్టిలో పెట్టుకుని తాగు నీటి సరఫరా వ్యవస్థను క్షేత్రస్థాయిలో సమగ్రంగా గ్రామాలలో పరిశీలన చేయాలని సూచించారు. అవసరమైన చోట యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాలన్నారు. ఆయా గ్రామాల వారీగా నీటి సరఫరా పరిస్థితిని నిరంతరం గ్రామాలలో ప్రజలతో సమీక్షించాలని అన్నారు. చేతి పంపులు, బోరు బావులకు అవసరమైన చోట తక్షణమే మరమ్మతులు జరిపించాలని,అవసరమైన చోట ముందస్తు మంచి నీటి బోర్ వెల్స్‌ను, హైర్ బోర్ వేల్ ను ముందుగానే 2 ఆల్టర్నేట్ ఏర్పాటు చేసుకొని అవసరాన్ని బట్టి బోర్లు వేసి మోటర్లు ఏర్పాటు చేయాలని, మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీ ద్వారా నీటి ట్యాంకర్లు ఏర్పాటు చేసి ప్రజలకు నీటి సమస్య లేకుండా చూడాలన్నారు. ముందు ముందు ఎండలు ఎక్కువగా ఉంటాయి కాబట్టి తగు ఏర్పాట్లు చేసుకోవాలి తెలిపారు. ఏ గ్రామంలోనైనా నీటి సమస్య ఉంటే సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించాలని లేనిచో కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. అవసరమైతే పల్లె నిద్ర చేసి గ్రామాలలో తిరిగి ప్రజల యొక్క సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించాలన్నారు. తదుపరి ఇందిరమ్మ ఇండ్ల గురించి సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించి మాట్లాడుతూ పూరి గుడిసె , పై కప్పు సరిగ్గా లేని అర్హులైన నిరు పేదలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించించారు. ఎటువంటి పైరవీలకు తావు లేకుండా పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్లు నిర్వహించాలని L1,L2,L3 జాబితాలోని కుటుంబ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. అర్హులైన నిరు పేదలకు మాత్రమే ఇందిరమ్మ ఇండ్లను అందించే విధంగా కృషి చేయాలన్నారు. అప్లై చేసుకున్న దరఖాస్తులను పూర్తి స్థాయిలో లోతుగా పరిశీలించాలన్నారు. అట్టి లబ్ధిదారుల జాబితా కమిటీ ఆమోదం తదుపరి సంబంధిత స్పెషల్ ఆఫీసర్ వెరిఫికేషన్ చేసి L1 ద్వారా ఆలేరు, భువనగిరి శాసన సభ్యుల సమక్షంలో అర్హులైన లబ్ధిదారుల జాబితాను సంబంధిత ఇంచార్జీ శాఖ మంత్రి అనుమతితో అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో జడ్పీ సీఈవో శోభారాణి, భువనగిరి చౌటుప్పల్ ఆర్డీవోలు కృష్ణారెడ్డి శేఖర్ రెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి నాగిరెడ్డి, ఎస్.ఈ ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ ఈ.ఈ కరుణాకర్, జిల్లాలోని తహసిల్దారులు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీఓలు, హౌసింగ్ అధికారులు, ఆర్డబ్ల్యూఎస్ ఏఈలు పాల్గొన్నారు.

## యువతి కుటుంబానికి న్యాయం చేయాలని రాస్తారోకో

**ప్రజాపక్షం /నిడమనూరు:** ప్రేమ పేరుతో దళిత యువతిని మోసం చేసి ఆత్మహత్యకు కారణమైన నిందితుడు కుక్కల జానారెడ్డిని కఠినంగా శిక్షించి ధర్మారపు మల్లేశ్వరి కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ మంగళవారం కూడా యువతి శవంతో కోదాడ జడ్చర్ల ప్రధాన రహదారిపై బొక్కమంతలపాడు గ్రామంలో గ్రామస్తులు యువతి బంధువులు సుమారు మూడు గంటల పాటు రాస్తారోకో నిర్వహించారు. యువతి తన మరణవాంగ్మూలంలో రాసిన 12 మంది పై చర్యలు తీసుకోవాలని, యువత కుటుంబానికి న్యాయం చేయాలని బంధువులు డిమాండ్ చేస్తున్నారు, గత ఆరు సంవత్సరాలుగా యువతని శారీరకంగా ఆర్థికంగా వాడుకొని వదిలేసిన జామరెడ్డి పై కఠిన చర్య తీసుకోవాలని రాస్తారోకో లో పాల్గొన్న పలువురు డిమాండ్ చేశారు, జానారెడ్డి కుటుంబ సభ్యులు స్పందించకపోతే వారి ఇంటి ముందే యువతిని ఖననం చేస్తామని బంధువులు హెచ్చరించారు యువతని జాన రెడ్డి ఇంటికి తీసుకుపోయి ఖననం చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకొని మల్లేశ్వరి బంధువులకు నచ్చజెప్పి రాస్తారోకోను విరమణ చేశారు, మంగళవారం పొద్దుపోయే వరకు కూడా యువతి శవాన్ని బంధువులు కన్నా చేయకపోవడం విశేషం, గ్రామంలో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ బందు బస్తును ఏర్పాటు చేశారు.



# ఫోకస్


# మహిళ

## సంప్రదాయ సంకెళ్లు



భారతదేశంలో పితృస్వామ్య మనస్తత్వం, లింగ అసమానత జాడ్యం కొనసాగుతునే ఉంది. మహిళలకు సంప్రదాయాల పేరిట సంకెళ్లు పడుతునే ఉన్నాయి. అందుకే లక్షలాది మంది మహిళలు తమకు నచ్చని లేదా తాము మెచ్చని రంగాలు లేదా పనుల్లో నిమగ్నమవుతున్నారు. తల్లులుగా, భార్యలుగా, కుమార్తెలుగా, కోడళ్లుగా సాంప్రదాయ పాత్రలను సమర్థవంతంగా పోషించేలా మహిళలపై అన్ని రకాలుగా ఒత్తిడి పెరుగుతున్నది. ఆడది అబల, నిస్సహాయురాలు అనే పదాలను వ్యూహాత్మకంగా మహిళల మస్తిష్కాల్లో నింపేశారు. శతాబ్దాలుగా ఇదే మాట వినిపిస్తున్నది. ఇదే స్థితి కనిపిస్తున్నది. అందుకే, ప్రస్తుతం మన దేశంలో మహిళా సాధికారత అనేది కేవలం ఉపన్యాసాలకు, వ్యాసాలకు, హామీలకు మాత్రమే ఉపయోగపడుతున్నది. నిజానికి లింగ అసమానతకు మానసిక లేదా మేధో సంపత్తిని ప్రామాణికంగా తీసుకోకూడదు. స్త్రీ, పురుషుల మధ్య జీవసంబంధమైన లేదా జన్యుపరమైన తేడాలపైనే మాత్రమే మార్పు కనిపిస్తుంది. కాబట్టి, శారీరక అంశాలను మేధాపరమైన అంశంగానూ, సామాజిక విషయంగానూ మార్చకూడదు. దీర్ఘకాలంగా కొనసాగుతున్న అసమానతలు, పెత్తనం చేస్తున్న పితృస్వామ్య విధానాలకు హేతుబద్ధమైన కారణం ఏదీ కనిపించదు. దేశంలో మహిళల ప్రస్తుత స్థితి పురోగతి, కొనసాగుతున్న సవాళ్ల సంక్లిషలన్ను పరస్పర చర్య ద్వారా వర్గీకరించవచ్చు. లింగ సమానత్వం, మహిళా సాధికారత వైపు కొన్ని ముఖ్యమైన విజయాలు నమోదయ్యాయనడంలో అనుమానం లేదు. అయితే, లోతుగా పాతుకుపోయిన సామాజిక నిబంధనలు, ఆర్థిక అసమానతలు, రాజకీయ సవాళ్లు భారతదేశంలో లింగ అసమానత కొనసాగుతోందని సూచిస్తున్నాయి. ఈ పరిస్థితికి తెరపడితేగానీ, లింగ అసమానతలు తొలగవు. మహిళలకు మంచిరోజులు రావు. మార్పు తెచ్చే బాధ్యత సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరిపైనా ఉంది.

## మాటల కోటలే!



మన దేశంలో మహిళా సాధికారత ఎండమావిగానే మిగిలిపోతున్నది. పురాణ ఇతిహాసాలను ప్రస్తావిస్తూ, శతాబ్దాలుగా మహిళలను భారత దేశం గౌరవిస్తున్నదని వాదించడం కొత్త కాదు. భారతీయ సమాజం ఎల్లప్పుడూ మహిళలను గౌరవిస్తూ ఉంది కాబట్టే గంగ, యమున, సరస్వతి వంటి నదులు మహిళల పేర్లతోనే ఉన్నాయని, దసర స్వతి, దుర్గ, లక్ష్మి, కాళి మొదలైన అనేక మంది స్త్రీ దేవతలను పూజిస్తున్నామని పేర్కోవడం రివాజు. అయితే, వేద కాలం నుండి పురుషులకు అనుకూలంగా ఉండే ఆచారాలు, సంప్రదాయాలతో పితృస్వామ్య వ్యవస్థ ప్రబలంగా ఉంది. భారతీయ చరిత్రలో గార్గి, మైత్రేయి మరియు సులభ వంటి అనేక మంది అద్భుతమైన మహిళల ప్రస్తావన ఉంది. వారి తార్కిక సామర్థ్యం సాధారణ మానవుల కంటే చాలా గొప్పది. అదేవిధంగా, మన దేశంలోని వివిధ ప్రాంతాలలో ప్రభావతి గుప్త, రాణి దుర్గావతి వంటి మహిళా పాలకులు ఉన్నారు. కానీ, పురుషుల సంఖ్యతో పోలిస్తే వీరు ఎంత మంది అనేది ప్రశ్న. చీకటి కోణాన్ని ఒకసారి పరికించి చూస్తే, పురాతన కాలం నుండి మహిళల పట్ల వివక్షత ప్రబలంగా ఉందనే వాస్తవం తెలుస్తుంది. మహిళలు నిశ్శబ్ద బాధితులుగా కొనసాగుతున్న వైనం కళ్లకు కట్టినట్టు కనిపిస్తుంది. కేవలం మాటలు మాట్లాడినంత మాత్రాన సమస్యలు తీరవు. గొప్పగా పొగిడినంత మాత్రాన సాధికాతర సాధ్యం కాదు. పురాణాలను ప్రస్తావిస్తూ, మహిళలకు ప్రత్యేక గౌరవం ఇస్తున్నట్టు మాటల కోటలే తప్ప, వాస్తవంలో వారి పరిస్థితి ఎంత దారుణంగా ఉందో కళ్లెదుట కనిపిస్తునే ఉంది. మహిళలపై నిత్యం అత్యాచారాలు, హింస, హత్యలు జరుగుతునే ఉన్నాయి. పాలకులు మాటలు కట్టిపెట్టి, మహిళల అభ్యున్నతికి కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# కీలక గణాంకాలు..



దేశంలో మహిళలు స్త్రీలు వివక్షకు గురవుతున్నారనేది నిజం. సమాన అవకాశాలు వారికి రావడం లేదన్నది కూడా నిజమే. భారతదేశంలో లింగ అసమానతకు అందుబాటులో ఉన్న గణాంకాలే అద్దం పడతాయి. లింగ అంతర నివేదిక, 2023 ప్రకారం, లింగ సమానత్వం పరంగా భారతదేశం 146 దేశాలలో 127వ స్థానంలో ఉంది. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రసాస్వామిక దేశంలో ఈ పరిస్థితి నెలకొనడం సిగ్గుచేటు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం, భారతదేశంలో మొత్తం లింగ నిష్పత్తి 1000 మంది పురుషులకు 1020 మంది స్త్రీలు. అయితే, జనన సమయంలో లింగ నిష్పత్తి 929గా ఉంది. దీనిని బట్టి భ్రూణ హత్యలు ఏ స్థాయిలో జరుగుతున్నాయో ఊహించుకోవచ్చు. లింగ నిర్ధారణ పరీక్షలు చట్ట విరుద్ధమైనప్పటికీ, లంచాలు మరిగిన ఆసుపత్రులు ఈ పరీక్షలు చేస్తునే ఉన్నాయి. గర్భంలో ఉన్నది ఆడపిల్ల అని తెలిసిన వెంటనే, గర్భస్రావం చేయించడం సాధారణమైంది. ఈ విషయంలో మహిళలకు ఎలాంటి హక్కు లేదు. బిడ్డకు జన్మనివ్వాలా? లేదా? అనే నిర్ణయం తీసుకునేది కూడా పురుషులే. ఇలావుంటే, ప్రసూతి మరణాల రేటు (ఎంఎంఆర్‌పై భారత రిజిస్ట్రార్ జనరల్ విడుదల చేసిన ప్రత్యేక బులెటిన్ ప్రకారం, 201820 కాలానికి భారతదేశంలో ప్రసూతి మరణాలు ఆందోళనకరంగానే ఉన్నాయి. ఇక, 1549 సంవత్సరాల వయసు గల స్త్రీలలో 18.7 శాతం మంది పౌష్టికాహార లోపంతో బాధపడుతూ, తక్కువ బరువుతో ఉన్నారు. 1549 సంవత్సరాల వయసు గల స్త్రీలలో 21.2 శాతం మంది ఎదుగుదల లోపంతో బాధపడుతున్నారు. 1549 సంవత్సరాల వయస్సు గల స్త్రీలలో దాదాపు 53శాతం మందిలో రక్తహీనత సమస్య ఉంది. ఎన్ఎఫ్‌హెచ్ఎస్ (201921) ప్రకారం, పురుషుల అక్షరాస్యత రేటు 84.7 శాతం కాగా, స్త్రీలలో అక్షరాస్యత రేటు 70.3 శాతం మాత్రమే. ఇలావుంటే, మహిళలపై అత్యాచారం, హింస, హత్య, అణచివేత సంఘటనలు రోజురోజుకూ పెరుగతునే ఉన్నాయి. 2021 సంవత్సరంలో మహిళలపై 4 లక్షలకు పైగా నేరాలు నమోదయ్యాయని నివేదికలు పేర్కొంటున్నాయి. ఈ సంఖ్య నివేదించబడిన సంఘటనలను మాత్రమే ప్రతిబింబిస్తుంది కాబట్టి, వాస్తవ సంఖ్య చాలా ఎక్కువగానే ఉంటుంది. ఎన్ఎఫ్‌హెచ్ఎస్–5 ప్రకారం, 20 నుంచి 24 సంవత్సరాల వయస్సు గల స్త్రీలలో 23.3 శాతం మంది 18 సంవత్సరాల కంటే ముందే వివాహం చేసుకున్నారు . లేదా బలవంతంగా పెళ్లి చేసుకునే పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఆర్థిక అసమాత కూడా ప్రబలంగానే ఉంది. పిఎల్ఎఫ్ఎస్ నివేదికను అనుసరించి, 2021 22లో పని చేసే వయస్సు గల (15 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ) స్త్రీలలో దాదాపు 32.8 శాతం మాత్రమే శ్రామిక శక్తిలో భాగస్వాములుగా ఉన్నారు. అంతర్జాతీయ కార్మిక సంస్థ ప్రకారం, భారతదేశంలో 81.8 శాతం మహిళా ఉపాధి అనధికారిక ఆర్థిక వ్యవస్థలో కేంద్రీకృతమై ఉంది. భారతదేశంలోని చాలా మంది మహిళా కార్మికులు అధిక జీతం వచ్చే ఉద్యోగాలలోకి రాలేకపోతున్నారని ఈ నివేదిక చెప్పకనే చెప్తున్నది. దేశంలో లింగాల మధ్య వేతన అంతరం ప్రపంచంలోనే అత్యంత విస్తృతమైనది. గ్లోబల్ జెండర్ గ్యాప్ రిపోర్ట్ 2021 ప్రకారం, భారతదేశంలోని మహిళలకు సగటున పురుషుల ఆదాయంలో 21 శాతం చెల్లిస్తున్నారు. రాజకీయాల్లోనూ మహిళల పట్ల వివక్ష కొనసాగుతున్నది. ప్రస్తుతం, మొత్తం పార్లమెంటు సభ్యులలో కేవలం 14.94 శాతం మాత్రమే మహిళలు. భారత ఎన్నికల సంఘం అధికారిక డేటా ప్రకారం, డిసెంబర్ 2023 నాటికి, రాష్ట్ర శాసనసభలలో మొత్తం సగటు మహిళా ప్రాతినిధ్యం కేవలం 13.9 శాతం మాత్రమే. ఏప్రిల్ 2023 నుండి పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ డేటా ప్రకారం, పంచాయతీ ఎన్నికైన ప్రతినిధులలో దాదాపు 46.94 శాతం మంది మహిళలు. అయితే, 'సర్పంచ్‌పతి' సంస్కృతి ప్రాబల్యం విపరీతంగా ఉంది. అంటే, మహిళలు ప్రజాప్రతినిధులుగా కొనసాగుతున్నప్పటికీ, వారి భర్తలే ఎక్కువగా అధికారాన్ని చెలాయిస్తుంటారు. మహిళల పాత్ర నామమాత్రమే. మొత్తం మీద వివిధ గణాంకాలు దేశంలో మహిళలు అన్ని రంగాల్లోనూ వివక్షకు గురవుతునే ఉన్నారనే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి.

**దేశంలో లింగపరమైన వేతన అంతరం ప్రపంచంలోనే అత్యంత విస్తృతమైనది**

# ఎన్నో పోరాటాలు..

మహిళల సాధికారత, లింగ సమానత్వం కోసం దేశంలో ఎన్నో పోరాటాలు జరిగాయి. అయితే, వ్యవస్థీకృత ప్రయత్నాలు మాత్రం 19వ శతాబ్దంలో ప్రారంభమయ్యాయి. సామాజికమత సంస్కరణల ఉద్యమాలతో ఒక కొత్త శకం ప్రారంభమైంది. రాజా రామ్మోహన్ రాయ్, స్వామి దయానంద సరస్వతి, ఈశ్వర్ చంద్ర విద్యాసాగర్ వంటి సామాజిక సంస్కర్తలు, వివిధ సంస్థలు చేసిన ప్రయత్నాలు భారతదేశంలో లింగ సమానత్వం, మహిళా సాధికారతను ప్రోత్సహించడానికి సహాయపడ్డాయి. వీరి కృషి ఫలితంగానే 1829లో సతి నిర్మూలన చట్టం, 1856లో వితంతు పునర్వివాహ చట్టం, 1929లో బాల్య వివాహ నిరోధక చట్టం లేదా సర్దా చట్టం వచ్చాయి. 20వ శతాబ్దం ప్రారంభంలో మహిళా సంఘాల స్థాపన ప్రారంభమైన తర్వాత వారి హక్కుల కోసం డిమాండ్ పెరిగింది. పోరాటాలు ఉధృతమయ్యాయి. భారత మహిళా పరిషత్, మహిళా భారతీయ సంఘం, ఆల్ ఇండియా మహిళా సమావేశం వంటి మహిళా సంస్థలు భారతదేశంలో లింగ అసమానత అంశాన్ని లేవనెత్తాయి. ఇతరులతో పాటు మహిళల ఓటు హక్కు, వారసత్వ హక్కులను డిమాండ్ చేశాయి. భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో మహిళల సమష్టి సమీకరణ, భాగస్వామ్యంపై గాంధీజీ ప్రత్యేక దృష్టి పెట్టారు. రాజకీయ స్వేచ్ఛ కోసం అలాగే వారి సామాజిక , రాజకీయ హక్కుల కోసం పోరాడాలని ఆయన మహిళలను ప్రోత్సహించారు. జాతీయ ఉద్యమాలలో మహిళల భాగస్వామ్యం నేరుగా పితృస్వామ్య సమాజాన్ని ప్రశ్నించడం లక్ష్యంగా పెట్టుకోకపోయినా, భారతదేశంలో లింగ సమానత్వం, మహిళా సాధికారతను ప్రోత్సహించడానికి సహాయపడింది. మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని, వారి బలాన్ని గ్రహించాల్సిన అవసరాన్ని జాతికి నాటి పోరాటం గుర్తుచేసింది. అసంబద్ధమైన, అన్యాయమైన, కాలం చెల్లిన సంప్రదాయాలు, ఆచారాలను ఎంతో మంది మహిళలు నిలదీశారు. ప్రశ్నించారు. అనేక అడ్డంకులను బద్దలు కొట్టారు. భారతదేశ స్వాతంత్ర్యం తర్వాత కాలంలో మహిళా సాధికారత, లింగ సమానత్వ ఉద్యమం మందగమనంతో సాగింది. చాలా మంది మహిళా కార్యకర్తలు దేశ నిర్మాణ పనులలో పాల్గొనడం, విభజన గాయం వంటి అంశాలు మహిళలను లక్ష్యం నుండి దృష్టిని మళ్లించాయి. 1970 దశకం చివరి నుంచి దేశంలో తిరిగి మహిళా సాధికారత, లింగ సమానత్వ ఉద్యమాల పునరుద్ధరణ జరిగింది. దీనినే భారత మహిళా ఉద్యమంలో రెండవ దశగా పేర్కొంటారు. ప్రముఖ మహిళా సంస్థలు భారతదేశంలో లింగ సమానత్వం, మహిళా సాధికారతను ప్రోత్సహించడానికి అనేక విస్తృతమైన కార్యక్రమాలను చేపట్టాయి. అవి: స్వయం ఉపాధి మహిళా సంఘం (ఎస్ఇడబ్ల్యుఎ/ సేవా) అసంఘటిత రంగంలో పనిచేసే మహిళల పరిస్థితులను మెరుగుపరచడానికి కృషి చేసింది. అయితే, తరతరాలుగా వేళ్లూనుకున్న పితృస్వామ్య భావనలను కూకటివేళ్లతో పెకలించడానికి ఈ కృషి, ప్రయత్నాల, ఉద్యమాలు, పోరాటాలు సరిపోవు. వాడవాడలా మహిళలు హక్కుల పోరాటాలను మొదలుపెట్టాలి. సాధికారత సాధన దిశగా అడుగులు వేయాలి.





## చరిత్రలో మేడే ప్రత్యేకమైనది..

**సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు**



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** కార్మికుల హక్కుల కోసం రక్తం చిందించి పోరాడి సాధించుకున్న రోజు మేడే ప్రపంచ చరిత్రలో ఎంతో ప్రత్యేకమైనదనిగా నిలిచిందని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్‌లోని సిపిఐ కార్యాలయంలో మేడే నిర్వహణ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బెజవాడ మాట్లాడుతూ ప్రపంచంలో అతి సుందరమైన అన్ని అంశాలు కార్మికుడి శ్రమతోనే సృష్టించబడ్డాయని గుర్తించాలన్నారు. దేశాభివృద్ధిలో కార్మికుల పాత్ర మరువలేనిదన్నారు. అట్టి కార్మికుల హక్కులను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం హరిస్తుందని ఆరోపించారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను, హక్కులను కాలరాసేలా కేంద్రప్రభుత్వం నాలుగు లేబర్‌కోడ్‌ల పేరిట కార్పోరేట్ శక్తులకు మేలు చేసేలా మార్పులు చేస్తుందన్నారు. ఐక్యమత్యంతోనే కార్మికులు తమ హక్కులు సాధించుకోగలుగుతారని గుర్తించాలన్నారు. మేడేను జిల్లా వ్యాప్తంగా అన్నికార్మిక సంఘాలు ఘనంగా నిర్వహించాలని, వాడవాడలాల కార్మిక జెండాలు ఎగురవేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు, హుజూర్‌నగర్ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, సిపిఐ నాయకులు సోమగాని కృష్ణ, జక్కుల శ్రీను, ఇందిరాల వెంకటేశ్వర్లు, యల్లావుల ఉమ, చక్రాల స్టాలిన్, జడ వెంకన్న, చెన్నగాని సైదులు, యల్లావుల సురేందర్, నలమాద వెంకటేశ్వర్లు, జక్కుల రమణ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి ఉద్యమ కార్యాచరణ : జాడి పోశం



**ప్రజాపక్షం/బెల్లంపల్లి :** రాష్ట్ర 4వ మహాసభల్లో కార్మికుల సమస్యలపై చర్చించి, వాటి పరిష్కారానికి కార్యాచరణ రూపొందిస్తామని బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) జిల్లా కార్యదర్శి జాడి పోశం తెలిపారు. మంగళవారం బెల్లంపల్లి పట్టణంలోని విజ్ఞాన్ భవన్ సిపిఐ కార్యాలయంలో రాష్ట్ర మహాసభల ప్రచార పోస్టర్ల ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 21, 22 తేదీలలో రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో మహాసభలు జరుగనున్నాయని, మహాసభలకు జిల్లాలోని భవన నిర్మాణ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సంఘం జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వెంకన్న మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల హక్కులు, సమస్యల పరిష్కారంపై ఈ మహాసభల్లో కీలకంగా చర్చలు జరగనున్నాయని, ప్రతి కార్మికుడు తప్పకుండా హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాజేష్, పట్టణ కార్యదర్శి ఆడపు రాజమౌళి, మండల కార్యదర్శి బొంతల లక్ష్మీ నారాయణ, బికెఎంయు జాతీయ సమితి సభ్యుడు అక్కపెల్లి బాపు, పట్టణ కార్యవర్గ సభ్యులు రత్నం, రాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమాలు

**సిపిఐ రాష్ట్ర కార్యవర్గసభ్యురాలు నేదునూరి జ్యోతి**



**ప్రజాపక్షం/కాజీపేట :** పాలకవర్గాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజాస్వామిక ఉద్యమాలను తీవ్రతరం చేయాల్సిన సమయం ఆసన్నమైనదని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి తెలిపారు. మంగళవారం కాజీపేట మండలం రావినారాయణరెడ్డి కాలనీలో గుగులోతు రమేష్ అధ్యక్షతన మహాసభ జరగగా సమావేశానికి నేదునూరి జ్యోతి హాజరై మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చట్టాలు, ముస్లిం, మైనార్టీ వ్యతిరేక చట్టాలు తీసుకొస్తూ విభజన రాజకీయాలు చేస్తూ దేశాన్ని విడగొట్టే చర్యలు చేపడుతుందన్నారు. రైతులు, దళితులపై దాడులు కొనసాగించడాన్ని ప్రజాస్వామికవాదులు తిప్పికొట్టాలన్నారు. దేశంలో మోడీ విధానాలు పేదలు, ధనికుల మధ్య తీవ్ర అంతరాలకు దారితీస్తాయన్నారు. విభజన, మత రాజ కీయాలపై అప్రమత్తంగా ఉంటూ ప్రజాస్వామ్య రక్షణకు పోరాటాలు చేయాలని కోరారు. సమస్యల పరిష్కారంలో పేద ప్రజలలకు అండ కమ్యూనిస్టులేనన్నారు. హనుమకొండ జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్ మాట్లాడుతూ ఆర్ఎన్ఆర్ నగర్‌లో పేదలు గుడిసెలు వేసుకొని 15 సంవత్సరాలుగా ఉంటున్నారని, వారికి పట్టాలు ఇచ్చి పక్కాగృహాలు నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మే 26,27 తేదీలలో హనుమకొండ జిల్లా సిపిఐ మహాసభలు హసన్‌పర్తి మండల కేంద్రంలో జరుగుతాయని, మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బిసి హక్కుల రాష్ట్ర సాధన సమితి ఉప ప్రధాన కార్యదర్శి నేదునూరి రాజమౌళి, ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి, కాజీపేట మండల సిపిఐ కార్యదర్శి మునిగాల బిక్షపతి, సహాయ కార్యదర్శి మాలోతు శంకర్, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు రాసమల్ల దీన, దొమ్మటి ప్రవీణ్, రాంపూర్ శాఖ కార్యదర్శి మంద సుమన్, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాస మల్ల కుమార్, ఎం.కమల, భీమనమ్మ, పద్మ, ఎల్లమ్మ, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు. మహాసభలో నూతన నాయకత్వాన్ని ఎన్నుకున్నారు. రావి నారాయణరెడ్డి కాలనీ కార్యదర్శిగా గుగులోత్ లోతు రమేష్, సహాయ కార్యదర్శిగా చిల్లువేరు రాజేశ్వరి, కార్యవర్గ సభ్యులుగా కృష్ణ మనమ్మ, భూక్య మమత, ఉర్సు వనిత, చప్పిడి రజిత, వల్లపు రేణుక ఎన్నికయ్యారు.

## కార్మిక హక్కుల రక్షణకు పోరాటాలు

**ప్రజాపక్షం/వేములవాడ :** కార్మికుల హక్కుల రక్షణకు పోరాటాలు చేయాలని ఎఐటియుసి రాజన్న సిరిసిల్ల జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు కోరారు. మంగళవారం వేములవాడ అమరవీరుల స్తూపం వద్ద ఎఐటియుసి అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘం మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. ఈనెల 21,22వ తేదీలలో రంగారెడ్డి జిల్లా, శంషాబాద్‌లో జరిగే రాష్ట్ర 4వ మహాసభలను విజయవంతం చేయాలని భవన నిర్మాణ కార్మికులకు ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. నూతన లేబర్ కార్డులు జారీ చేయాలని, భవన నిర్మాణ కార్మికులకు పెండ్లికి రూ.లక్ష, డెలివరీ 50 వేలు, సహజ మరణం 5 లక్షలు, ఆక్సిడెంట్ 10 లక్షలు, 55 సంవత్సరాలు నిండిన కార్మికులకు రూ.5 వేల పెన్షన్ ఇవ్వాలన్నారు. బిజెపి ప్రభుత్వం సెస్ డబ్బులను ఇతర అవసరాలకు వాడడం మానుకోవాలని, భవన నిర్మాణ సంక్షేమంలోని డబ్బులను భవన నిర్మాణ కార్మికులకు మాత్రమే ఉపయోగించాలని, సెస్ డబ్బులను సక్రమంగా వసూలు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గాజుల పోశెట్టి, కోరేపు శ్రీను, లక్ష్మన్, లింగం, నరేష్ తదితర కార్మిక సంగం నాయకులు పాల్గొన్నారు.



## పెట్టుబడిదారీ యాజమాన్యాలకు మేలు చేస్తున్న పాలకులు

**సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి**

**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి :** కార్పొరేట్ పెట్టుబడిదారీ యాజమాన్యాలకు మేలు చేస్తూ, కార్మికుల సంక్షేమాన్ని పాలకులు విస్మరిస్తున్నారని సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి విమర్శించారు. ఎఐటియుసి అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘం వరంగల్ జిల్లా కార్యవర్గ సమావేశం శివనగర్ భవన్‌లో ఎండి యాకూబ్ అధ్యక్షతన జరిగిన సమావేశం మంగళవారం జరిగింది. ముఖ్య అతిథులుగా సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి హాజరై మాట్లాడుతూ అధికారంలో ఏ పార్టీ ఉన్నా, మాటలతో కాలం గడుపుగున్నారే తప్పా, ఆచరణలో కార్మికులకు ఒరిగింది ఏమీ లేదన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ఉద్దేశపూర్వకంగా దివాలా తీస్తూ ప్రైవేటుకరిస్తూ అమ్మేస్తూ దేశానికి తీరని నష్టం తలపెడుతున్నాయన్నారు. వరంగల్ జిల్లాలో భారీ పరిశ్రమలు నెలకొల్పాలని, మామునూర్ ఎయిర్ పోర్టును త్వరగా ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు షేక్ భాషుమియా, పనాస ప్రసాద్, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు గన్నారపు రమేష్, జిల్లా కార్యదర్శి మియాపురం గోవర్ధన్, జిల్లా కోశాధికారి దండు లక్ష్మణ్, ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు గుండె బద్రి, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఉప్పుల రవి, జిల్లా సహాయ కార్యదర్శి నల్ల తీగల కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు పరికిరాల రమేష్, యోగానంద చారి తదితరులు పాల్గొన్నారు.



## భవన నిర్మాణ సంక్షేమబోర్డులో... కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం

**సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లా దేవేందర్‌రెడ్డి డిమాండ్**



**ప్రజాపక్షం/మోటకొండూరు :** భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డులో కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలని ఎఐటియుసి భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లా దేవేందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మోటకొండూరు మండల కేంద్రంలోని మహాలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో జరిగిన భవన నిర్మాణ కార్మిక సంఘం 3వ మహాసభ బీరకాయల మల్లేష్ అధ్యక్షతన జరిగింది. మహాసభ సందర్భంగా ఎఐటియుసి జెండాను జిల్లా గౌరవ అధ్యక్షులు బోలగాని సత్యనారాయణ ఆవిష్కరించారు. మహాసభకు ముఖ్య అతిథిగా పల్లా దేవేందర్‌రెడ్డి హాజరై మహాసభను ప్రారంభించి మాట్లాడారు. ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న సంక్షేమ బోర్డు సమస్యల నిలయంగా మారిందని ఆరోపించారు. గత కొన్ని నెలలుగా కార్మికులకు డబ్బులు ఇవ్వడం లేదని, ఆన్‌లైన్‌లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నా పరిష్కరించడంలో లేబర్ డిపార్ట్‌మెంట్ వైఫల్యం చెందిందని ఆరోపించారు. కార్మికులు రోజుల తరబడి లేబర్ కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ అప్‌డేట్‌పేరుతో గత ఆరునెలలుగా కార్మికులను ఆఫీస్ చుట్టూ తిప్పుకుంటూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. కార్మిక సంక్షేమ బోర్డులో జమ కావాల్సిన సెస్సు సక్రమంగా వసూలు చేయకపోవడంతో కార్మిక సంక్షేమ నిధులు పెరగడం లేదన్నారు. మెడికల్ చెకప్‌ల పేరుతో జరుగుతున్న ఆర్థిక దోపిడీపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన కార్మిక వ్యతిరేక విధానాలు తిప్పికొట్టేందుకు పోరాటాలు తీవ్రతరం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈనెల 21,22 తేదీలలో రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో జరిగే భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని పల్లా దేవేందర్‌రెడ్డి కోరారు. సిపిఐ యాదాద్రి జిల్లాకార్యదర్శి గోదాశ్రీరాములు మాట్లాడుతూ కార్మికుల హక్కుల కోసం ఎఐటియుసి నిరంతరం రాజీలేనీ సమరశీల పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలు పెరగాలన్నారు. మహాసభలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, ఎఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షులు బోలగాని సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు గోరేటి రాములు, ప్రధానకార్యదర్శి ఎండి ఇమ్రాన్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్ళేం కృష్ణ, చెక్క వెంకటేష్, కుసుమని హరిచంద్ర, సిపిఐ మండల కార్యదర్శి గాదేగాని మాణిక్యం, ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు పిల్లి శంకర్, జిల్లా సహాయ కార్యదర్శులు బీరకాయల మల్లేష్, గానబోయిన వెంకటేష్, గోపగాని రాజు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కొల్లూరి మల్లేష్, బోళ్ల శ్రీనివాస్, బోట్ల జహంగీర్, బోట్ల శ్రీను, వంగపల్లి నర్సింహా, రైతు సంఘం జిల్లా కార్యదర్శి జక్క దయాకర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు సామల శోభన్‌బాబు, చేరాల లింగయ్య, పబ్బల శ్రీరాములు, రాజు, ముక్కెర్ల కొమురయ్య, కందుకూరి దుర్యోధన్ తదితరులు పాల్గొన్నారు.




# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## ఎస్ఎ2 పరీక్షల నిర్వహణ తీరు పరిశీలన



**ప్రజాపక్షం/దోమ:** పరిగి నియోజకవర్గంలోని దోమ మండల పరిధిలోని మోత్కూర్ పాఠశాలలో ఎస్ఎ2 పరీక్షలు నిర్వహిస్తున్న విధానాన్ని మండల విద్యాధికారి వెంకట్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ప్రధానోపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. మార్కులను ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని ఎఫ్ఎల్ఎన్, ఎల్ఐపి ,మిడ్ లైన్ ఎంట్రీ వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే స్కూలికి నెలనుండి రాని విద్యార్థుల కు సంబంధించిన వివరాలను పంపించాలని ఆదేశించారు. ఆన్‌లైన్‌లో ఈ నెల 23వ తేదీ వరకు తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థుల ప్రోగ్రెస్ రిపోర్ట్ ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.



## బ్రహ్మోత్సవాలకు హాజరైన ఎంపి ఈటల

**ప్రజాపక్షం/నాగారం:** ప్రతి ఒక్కరు దైవ చింతన కలిగి ఉండి భగవంతుని కృపకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్ ఆకాంక్షించారు. మంగళవారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని శిల్పా నగర్ కాలనీలో శ్రీ మరకత చంద్రమౌళీశ్వర స్వామి, శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి, శ్రీ కార్యసిద్ధి ఆంజనేయస్వామిల ప్రథమ వార్షికోత్సవానికి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్‌తో కలసి మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డిలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఆలయ కమిటీ సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గూడూరు అంజనేయులుగౌడ్, కౌకుట్ల అనంత్‌రెడ్డి, నాయకులు అన్నంరాజు శ్రీనివాస్, మర్రి మోహన్‌రెడ్డి,యువనాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లకొండ గ్రామస్తుడికి 'దళిత రత్న'అవార్డు!

**ప్రజాపక్షం/నవాబుపేట్ :** వికారాబాద్ జిల్లా నవాబ్ పేట్ మండలం ఎల్లకొండ గ్రామానికి చెందిన బేగారి గాలయ్యకు దళిత రత్న అవార్డు వరించింది. సోమవారం హైదరాబాద్ రవీంద్ర భారతిలో నిర్వహించిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 134వ జయంతి ఉత్సవాలలో భాగంగా దళితులకు అందించిన సేవలను గుర్తించి ఈ అవార్డు ప్రటించినట్లు బేగారి గాలయ్య మంగళవారం ఓ ప్రకటనలో మాట్లాడుతూ, ఈ మేరకు రవీంద్రభారతిలో ఎస్సీ 57, ఎంబీఎస్సీ కులాల హక్కుల పోరాట సమితి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు బైరి వెంకటేశం,





ఉత్సవాల కమిటీ చైర్మన్ ఇటుక రాజు, రామచంద్రం చేతులమీదుగా ఈ అవార్డును అందుకోవడం జరిగిందన్నారు. ఈ అవార్డు తన యొక్క బాధ్యతను మరింత పెంచిందని చెప్పా రు. దళితులందరికి ఈ అవార్డు అంకితం చేస్తున్నట్లు వెల్లడించారు. నా సేవలను గుర్తిం చి దళిత అవార్డుకు ఎంపికచేసి ప్రదానం చేసిన పెద్దలందరికీ, ఈ అవార్డు రావడానికి కృషి చేసిన ప్రతిఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

మల్కాజిగిరిలో సత్తయ్యకు 'దళిత రత్న'

మౌలాలి డివిజన్‌కు చెందిన బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు సత్తయ్యకు స్థానిక ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి దళిత రత్న అవార్డు అందచేసారు. దళితుల అభివృద్ధికి ప్రభుత్వాలు అందచేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను వినియోగించుకొనేలా మరింత కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు రావుల అంజయ్య, బుద్ధి నర్సింగరావు, భాగ్య నందనరావు తదితరులు పాల్గొన్నారు.



## సిసి రోడ్డు పనులు ప్రారంభించిన కార్పొరేటర్

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** డివిజన్‌లోని కాలనీల్లో ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకొని రావాలని గౌతంనగర్ కార్పొరేటర్ మేకల సునీత కోరారు. మంగళవారం డివిజన్‌లోని జ్యోతినగర్‌లో రూ.39.50లక్షల వ్యయంతో చేపట్టిన సిసి రోడ్డు పనులను ప్రారంభించారు. అన్ని కాలనీల్లో భూగర్భ డ్రైనేజి నిర్మాణం, వీధి దీపాలు, రోడ్లు వంటి మౌలిక వసతులు పూర్తి స్థాయిలో కల్పించేందుకు కృషి చేస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జ్యోతినగర్ కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు, రాము యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



## క్షయ వ్యాధి గ్రస్తులకు పోషకాహార కిట్లు

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** క్షయ వ్యాధి నివారణకోసం ప్రభుత్వాలు అందిస్తున్న పౌష్టికాహారం ఎంతగానో ఉపయోగపడుతుందని టిబి విభాగ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రాజేశం మందులతో పాటు పౌష్టికాహారం విధిగా తీసుకోవాలని సూచించారు. టిబి ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నిక్షయ్ మిత్రాగా నమోదు చేసుకొన్న దాతల సహకారంతో ప్లాన్ ఇండియా ఆర్గనైజేషన్ సంస్థ క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లను పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ ఉమాగౌరి మాట్లాడుతూ క్షయ వ్యాధి నివారించటంలో భాగంగా ముందస్తు వ్యాధి నిర్ధారణ, పూర్తికాలం మందులు వాడటం ముఖ్యమన్నారు. జిల్లాలోని 6 టిబి యూనిట్లలో 750 మంది టిబి వ్యాధిగ్రస్తులకు రెండు నెలలకు సరిపడా 1500 న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. టిబి విభాగ ప్రోగ్రాం ఆఫీసర్ డా. శ్రీదేవి, జిల్లా వైద్యారోగ్య శాఖకు చెందిన వైద్యులు సత్యవతి, సౌశీల్య, అభిలాష్, శ్రీనివాస్, వాసు ప్రసాద్, ప్రకాష్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వ్యక్తి అదృశ్యం



**ప్రజాపక్షం/శామీర్‌పేట:** వ్యక్తి అదృశ్యమైన సంఘటన శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తూంకుంట మున్సిపాలిటీ ఉప్పర్‌పల్లికి చెందిన ముద్దంగుల లక్ష్మీ నారాయణ(46) సోమవారం ఇంటి నుంచి బయల్దేరి వెళ్లాడు. ఎంతసేపయినా ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల, తెలిసిన వారివద్ద వెదికినా లాభం లేకపోవడంతో శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### స్లాట్ బుకింగ్ రిజిస్ట్రేషన్ల ఉపసంహరణపై
## డాక్యుమెంట్ రైటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నిరసన



**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన స్లాట్ బుకింగ్ విధానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని మల్కాజిగిరి డాక్యుమెంట్ రైటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కోరింది. ఈ మేరకు మంగళవారం మల్కాజిగిరి సబ్ రిజిస్ట్రార్‌కు వినతి పత్రం సమర్పించారు.

తెలంగాణా డాక్యుమెంట్ రైటర్స్ ఫెడరేషన్ పిలుపు మేరకు మంగళవారం తమ దుకాణాలను మూసేసి నిరసన తెలిపిన డాక్యుమెంట్ రైటర్లు బుధవారం మరోసారి ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం వరకు దుకాణాలను మూసేస్తామని మల్కాజిగిరి అసోసియేషన్‌కు చెందిన అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి నరేష్‌బాబులు తెలిపారు. దస్తావేజు లేఖనం చేసుకొంటూ అనేక సంవత్సరాలుగా స్వయం ఉపాధితో తమ కుటుంబాలను పోషించుకొంటున్నామని, ఈ తరుణంలో స్లాట్ బుకింగ్ రిజిస్ట్రేషన్ల విధానంవల్ల వేలాది మంది గా ఉన్న తమ జీవితాలు రోడ్డున పడుతాయని ఆవేదన వ్యక్తం చేసారు. మరో పక్క దరఖాస్తుదారులు సైతం ఇబ్బందులు పడే అవకాశం ఉంటుందని, ఆన్‌లైన్‌లో దరఖాస్తులో ఏవైనా పొరపాట్లు ఉంటే సవరించుకొనే అవకాశం ఉండదన్నారు. ప్రభుత్వ దృష్టికి తమ డిమాండ్‌ను తీసుకొని వెళ్లేందుకు శాంతియుతం గా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట తమ దుకాణాలు మూసేసి నిరసన వ్యక్తం చేస్తున్నామని, ప్రభుత్వం ఈ విషయంలో స్పందించని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్‌కు చెందిన వంశీ, కుమారి, మురళి, హిమజ, ప్రభాకర్, కమల్ రాజ్, ఫారూఖ్, కెపి ప్రసాద్, భార్గవ్ రామ్, రూప, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.



### కరణ్‌కోట్ ఎస్‌బిఐ బ్యాంక్‌లో
## అగ్ని ప్రమాదం

* దగ్ధమైన విలువైన దస్త్రాలు
* నగదు, బంగారం భద్రం
* మంటలను అదుపులోకి తెచ్చిన ఫైర్ సిబ్బంది

**ప్రజాపక్షం/తాండూరు:** వికారాబాద్ జిల్లా తాండూరు మండల పరిధి కరణ్ కోట్ గ్రామంలోని (సిసిఐ) ఎస్‌బిఐ బ్యాంక్‌లో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. గత రెండు రోజులు సెలవులు రావడంతో బ్యాంకు తాళాలు వేసిన వెళ్ళిన సిబ్బంది. మంగళవారం ఉదయం వాచ్ మాన్ బ్యాంకు తళాలు తీసి సరికి బ్యాంకు షాట్ సర్కిట్‌తో పొగలు అలుముకున్నాయి. ఇది గమనించిన సిబ్బంది అప్రమత్తం అయ్యేలోపు బ్యాంకులో దట్టమైన పొగలు అలుముకుని బ్యాంకులోని విలువవైన దస్త్రాలు పూర్తిగా దగ్ధం కావడంతో పాటు కంప్యూటర్ వంటి పరికరాలు దగ్దమైపోయ్యాయని తెలిపారు. కాగా బ్యాంకులో దాచిపెట్టిన డబ్బులు, బంగారు నగలకు ఎలాంటి ప్రమాదం జరగలేదని తెలిపారు. ఇట్టి ప్రమాదాన్ని గమనించిన సిబ్బంది ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించినప్పటికి వారు వచ్చేలోపు బ్యాంకులోని మంటలు తీవ్రతరం మారి పూర్తిగా దగ్దమైనందని, బ్యాంకు చుట్టు ప్రాంతం దట్టమైన పొగలు అలుము కున్నాయని తెలిపారు. బ్యాంకులో జరిగిన అగ్ని ప్రమాదంపై విచారణ చేస్తామని పోలీసులు తెలిపారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో జరిగిందా? లేక ఇంకేదైనా కారణంతో జరిగిందా? అన్న విషయంపై విచారణ చేపడుతామని తెలిపారు.

## సన్నబియ్యంతో పేదల కడుపు నింపిన కారణజన్ముడు

### కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్



**ప్రజాపక్షం/దుండిగల్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని 125 డివిజన్ లెనిన్ నగర్ లో సన్నబియ్యం లబ్దిదారులు లక్ష్మమ్మ భాస్కర్ దళిత కుటుంబ సభ్యుల ఆహ్వానం మేరకు మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ వారి కుటుంబ సభ్యులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం లబ్ధిదారుని ఇంట్లో డా॥ బాబా సాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలువేసి లక్ష్మమ్మ కుటుంబానికి ప్రభుత్వం నుండి ఎన్ని సంక్షేమ పథకాలు అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి నాయకత్వంలో ప్రజాప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సన్నబియ్యం పథకం లబ్దిదారుని ఇంట్లో మధ్యాహ్న భోజనం చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాక మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, గృహజ్యోతి పథకం ద్వారా నిరుపేదల ప్రజలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతు భరోసా ద్వారా రైతులకు 12వేల పెట్టుబడి సహాయం, రైతులకు 2 లక్షల రుణమాఫీ, ప్రజా ప్రభుత్వ తొలి ఏడాదిలోనే 50 వేలకు పైన ప్రభుత్వ ఉద్యోగాలు, ఇందిరమ్మ ఇండ్లు పథకం ద్వారా పేదల ఇంటి నిర్మాణానికి 5 లక్ష ల ఆర్థిక సహాయం, తెలంగాణ రైతాంగానికి రక్షణ కవచంగా భూభారతి పథకం. పేద,మధ్యతరగతి ప్రజల ఆరోగ్యమే మహాభాగ్యంగా 10 లక్షల ఆరోగ్యశ్రీ పథకం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఎస్‌సి వర్గీకరణకు, బడుగు బలహీన వర్గాల భావితరాల భవిష్యత్తు కోసం బిసిలకు 42 రిజర్వేషన్, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనకోసం రాజీవ్ యువ వికాస్ పథకం ద్వారా 5 లక్షల వరకు ఆర్థిక సహాయం ఇలా ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతుందన్నారు. బిజెపి, బిఆర్ఎస్ ప్రజా ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక, జీర్ణించుకోలేక ప్రజను ప్రక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రివర్యులు శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో మన రాష్ట్రం సాంకేతిక, పారిశ్రామిక రంగాలలో గణనీయంగా అభివృద్ధి చెందుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి, బుచ్చిరెడ్డి, రషీద్ బేగ్, రాజిరెడ్డి, రామ్ నర్సయ్య, రామిరెడ్డి,శ్రీనివాస్, చారిలతో పాటు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన మహాసభల కరపత్రం ఆవిష్కరణ



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** గిరిజన మహసభలను విజయవంతం చేయాలని గిరిజన సమాఖ్య జిల్లా ఇన్‌చార్జ్ తోటపల్లి శంకర్ అన్నారు. మంగళవారం మూడుచింతలపల్లి మండలం కేశవరంలో గిరిజన మహాసభల కరపత్రాలను గిరిజన జిల్లా అద్యక్షురాలు శ్యామల లత ఆద్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా గిరిజన సమాఖ్య నూతన కమిటీని ఎన్నుకున్నారు. గిరిజన సమాఖ్య మండల కన్వీనర్‌గా దాసరి వేణు, కో కన్వీనర్‌గా మూడావత్ రాజమణి, మండల కౌన్సిల్ సభ్యులుగా దాసరి రవి, దాసరి లక్ష్మి, దాసరి అంజమ్మ, దాసరి లత, ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గిరిజనుల సమస్యలపై నిరంతరం తెలంగాణ గిరిజన సమాఖ్య అలుపెరగని పోరాటాం నిర్వహిస్తుందన్నారు.

ఈ నెల 22న జిల్లా మహాసభలను నిర్వహిస్తున్నామని జిల్లాలోని గిరిజనులు అందరు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి రాములుగౌడ్, గిరిజన జిల్లా సమాఖ్య కార్యదర్శి స్వరుపనాయక్, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల పరిష్కారానికి కృషి

### ఎమ్మెల్యే కెపి.వివేకానంద్



**ప్రజాపక్షం/దుండిగల్ :** పేట్ బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జీహెచ్ఎంసీ కుత్బుల్లాపూర్, గాజుల రామారం సర్కిళ్లకు చెందిన ఇంజనీరింగ్ విభాగం అధికారులతో బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ జీహెచ్ఎంసీ పరిధిలోని ఎనిమిది డివిజన్లలో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ, జంట సర్కిళ్ల పరిధిలో అన్ని డివిజన్లలో పెండింగ్ లో ఉన్న సీసీ రోడ్డు, ప్రహరీ గోడ నిర్మాణ పనులను చేపట్టేందుకు సర్కిల్‌కు 7 కోట్ల రూపాయల చొప్పున దాదాపు 14 కోట్ల రూపాయలు మంజూరు అయ్యాయని వారు అధికారులకు తెలిపారు. గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో వేలకోట్ల రూపాయల నిధులు వెచ్చించి నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశామని, ఇంకా అక్కడక్కడ మిగిలిపోయిన పనులను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రణాళికలు రూపొందించి సమస్య పరిష్కారానికి కృషిచేయాలని తెలియజేశారు. అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి సామాన్య ప్రజలకు ఎటువంటి అసౌకర్యంగా కలగకుండా చూడాలని తద్వారా నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే నెంబర్ వన్ నియోజకవర్గంగా నిలిపేందుకు అధికారులు ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉండి పనిచేయాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో ఇంజనీరింగ్ ఇఇ లు లక్ష్మీ గణేష్, డిఇ పాపమ్మ, శిరీష, రూపాదేవి, ఎఇ లు కళ్యాణ్, తిరుపతి, అనురాగ్, అశోక్, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా ఓపెన్ స్కూల్, ఓపెన్ ఇంటర్ పరీక్షలు

### కలెక్టర్ ప్రతీక్‌జైన్




**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి:** ఓపెన్ స్కూల్, ఓపెన్ ఇంటర్ పరీక్షల నిర్వహణకు సంబంధించిపకడ్బందిగా ఏర్పాట్లు చేయాలని, ఎట్టీ పరిస్థితుల్లో కూడా పరీక్షా కేంద్రంలోనికి సెల్ ఫోన్ అనుమతించకూడదని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. కలెక్టర్ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు ఇంటర్ పది పరీక్షల నిర్వహణపై సమిక్ష సమావేశం నిర్వహించారు. వికారాబాద్ జిల్లావ్యాప్తంగా 8సెంటర్లు ఏర్పాటు చేయడం జరిగింది అని అన్నారు. వికారాబాద్ రెండు సెంటర్లు ,తాండూర్ ఒకటి ఇంటర్‌కు సంబంధించిన తాండూర్ ఓకటి ,వికారాబాద్ మూడు ఏర్పాటు చేయడం జరిగింది అని తెలిపారు. ఉయదం 9గంటల నుండి మధ్యాహ్నం 12గంటలకు ఉంటుందని అన్నారు. 2.30 గంటల నుండి 5.30వరకు ఇంటర్ పరీక్షలు ఉంటాయని అన్నారు. 20నుండి 26వరకు పరీక్షలు ఉంటయాని అన్నారు. పరీక్షలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపుచ కలెక్టర్ లింగ్యానాయక్ , విద్యాశాఖ అధికారి రేణుకాదేవి, డిఎసిపి శ్రీనివాస్, తదితరులు పాల్గోన్నారు.

**భూ భారతి కొత్త ఆర్ఓఆర్ చట్టంపై రైతుల్లో అవగాహన**

భూ భారతి కొత్త ఆర్ఓఆర్ చట్టంపై రత్తుల్లో అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఆర్డిఓ వాసుచంద్రతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ భారతి కొత్త ఆర్ఓఆర్ చట్టంపై రైతులకు అవగాహన కల్పించడంతో పాటు ఎలాంటి సమస్యలు పరిష్కారం అపుతాయనే విషయం రైతులకు సూచించారు. భూ భరతి పోర్టల్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. రైతులకు కొత్త చట్టంపై రైతుల్లో ఎలాంటి అభ్రాద్రతా భావం కలిగి ఉండకూడదని, భూ భారతి ద్వారా సమస్యలు పరిష్కారరం అవుతున్నాయనే అనే నమ్మకం ప్రజల్లో కల్పించాలని కలెక్టర్ తెలిపారు. వారసత్వ భూ బదలాయింపు, సాదాబైనామ భూముల పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. రెవిన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి సమస్యలు త్వరిత గతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. అధికారులకు ఏమైనా అనుమానాలు ఉంటే సందేహాలను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి నివృత్తి చేసుకోవాలని కలెక్టర్ తహసీల్దార్‌కు సూచించారు. మహిళ సాదికారత ఇందిరా మహిళా శక్తి పెట్రోల్ బంకుల నిమిత్తం స్థోలాలను గుర్తించి స్థలాలను గుర్తించి ప్రతిపాదనలు సమర్పించాలిని కలెక్టర్ తహసీల్దార్‌కు సూచించారు. మిగిలిపోయిన తహసీల్దార్ కార్యాలయ మరమ్మత్తు పనులు పూర్తి చేయాలని కలెక్టర్ అదేశించారు. అసంపూర్తిగా ఉన్న సాహనీ స్కానింగ్ పక్రియ ను పూర్తి చేయాలని అదేశించారు. రేషన్ కార్డులు వివిధ ధ్రువీకరణ పత్రాల కోసం వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించిందేకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను అదేశించారు.

## మార్కెటింగ్ యార్డు వేగంగా పూర్తి

### రివ్యూ మీటింగ్‌లో అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/తాండూరు:** తాండూరు పట్టణంలో నిర్మించే మార్కెట్ యార్డు నిర్మాణం పనులను త్వరత గతిన పూర్తి చేయాలని స్థానిక ఎంఎల్ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో వ్యవసాయ, మార్కెటింగ్, ఇంజనీరింగ్ అధికారులతో తాండూరులో నిర్మించే మార్కెట్ యార్డు గూర్చి సమీక్షించారు. త్వరలోనే మార్కెట్ యార్డు నిర్మాణం పనులను పూర్తి చేయాలని సూచించారు. పనులను పురోగతిపై ఇంజనీరింగ్ అధికారులతో అడిగి తెలుసుకున్నారు. నిధుల వ్యవహారం తదితర విషయాలపై చర్చించారు. ఈ రివ్యూమిటింగ్‌లో తాండూరు మార్కెట్ కమిటి చైర్మన్ పట్లోళ బాల్‌రెడ్డి, సంబంధిత వ్యవసాయ, మార్కెటింగ్ అధికారులు ఉన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన మహిళ సమాఖ్య ఎన్నికలు




**ప్రజాపక్షం/కోట్‌పల్లి :** ఓటింగ్ విధానంలో అవగాహన కలిగి ఉంటే రాజకీయాల్లోనూ రాణించేందుకు సులువుగా ఉంటుందని కోట్‌పల్లి మండల ఏపిఎం శివయ్య మహిళ సంఘం సభ్యులకు సుచించారు. మంగళవారం కోట్‌పల్లి మండల కేంద్రంలోని మహిళ సమాఖ్య సంఘం కార్యాలయంలో మహిళ మహాసభను ఏర్పాటు చేసి, జిల్లా డిపిఎం వీరయ్య సమక్ష్యంలో ఎన్నికలను నిర్వహించడం జరిగిందని ఆయన అన్నారు. ఈ ఎన్నికల్లో మండలంలోని అన్ని గ్రామాల మహిళ సంఘాల సభ్యులు పాల్గోన్నారు. ఈ ఎన్నికలకు ముగ్గురు మహిళ సభ్యులు పోటీ చేయగా వారిలో అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారిగా మహిళ సభ్యులు ఓటింగ్ ద్వారా ఎన్నుకోవడం జరిగిందన్నారు. 12 మంది ఈసీ సభ్యుల నుండి ఎన్నికల మహాసభను ఏర్పాటు చేసి అధ్యక్షురాలుగా వసంత (రాంపూర్), కార్యదర్శిగా దేవమ్మ (కరీంపూర్), కోశాధికారిగా వెంకటమ్మ (కంకణాలపల్లి) లను జిల్లా ఎన్నికల అధికారులు డిపిఎం వీరయ్య సమక్ష్యంలో ఎన్నుకోవడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిసిలు బీమ్లానాయక్, సంజీవ్‌కుమార్, హన్మంత్‌రెడ్డి, గణేష్, అంబుజా, అధ్యక్షులు, కార్యదర్శులు మహిళ సభ్యులు ఉన్నారు.

# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## అక్రమ నిర్మాణాల వివరాలివ్వండి
### మణికొండ జాగీర్‌పై హైకోర్టు

**హైదరాబాద్ :** రంగారెడ్డి జిల్లా మణికొండ జాగీరులో జరిగిన అక్రమ నిర్మాణాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని జిహెచ్‌ఎంసి, హెచ్‌ఎండిఎలను హైకోర్టు ఆదేశించింది. మణికొండ జాగీరులో ఎన్ని నిర్మాణాలు అనుమతులు పొందినవి, నిబంధనలను ఉల్లంఘించి కట్టినవి వంటి పూర్తి వివరాలు ఇవ్వాలంది. అక్రమ నిర్మాణాలకు విద్యుత్,, నీటిసరఫరా నిలిపివేతకు చర్యలు తీసుకున్నదీ లేనిదీ కూడా చెప్పాలంది. అక్రమ నిర్మాణాలకు కారణమైన అధికారులపై తీసుకున్న చర్యలను వివరించాలంది. ఈ వివరాలను జులై 2లోగా అందజేయాలంది. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం మణికొండ జాగీరు గ్రామంలో సర్వే నెం.203/1/3/1, 204 నుంచి 209, 210/1/3ల్లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా చర్యలు తీసుకోకపోవడాన్ని సవాలు చేస్తూ దాఖలు చేసిన కేసుల్లో చర్యలు తీసుకోవాలన్న ఉత్తర్వులను అధికారులు అమలు చేయలేదంటూ గోపాల్ కోర్టు ధిక్కార పిటిషన్ వేశారు. దీనిపై జస్టిస్ సివి భాస్కర్‌రెడ్డి మంగళవారం విచారణ సందర్భంగా ఈ ఆదేశాలు జారీ చేశారు. విచారణను జూన్‌కు వాయిదా వేశారు.

## జలమండలి 'మోటార్ ఫ్రీ టాప్' డ్రైవ్ ప్రారంభం
### మొదటి రోజే 64 మోటార్లు స్వాధీనం
### 84 మందికి జరిమానా విధింపు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగరంలో అక్రమ మోటార్ వాడకాన్ని అరికట్టడానికి, నీటి వృథాను నివారించడానికి జలమండలి మోటార్ ఫ్రీటాప్ డ్రైవ్‌ను ప్రారంభమైంది. ప్రధానంగా లోప్రెజర్ ఉన్న ప్రాంతాలు, మోటార్ల వాడకం ఎక్కువగా ఉన్న కాలనీలలో ఈడ్రైవ్‌లో బాగంగా ఎండి అశోక్‌రెడ్డి క్షేత్రస్థాయిలో సిబ్బందితో కలిసి కొన్ని ప్రాంతాల్లో మోటార్లు సీజ్ చేశారు. ఈ నేపథ్యంలో జలమండలి ఎండి అశోక్ రెడ్డి విజిలెన్స్, స్థానిక అధికారులతో కలిసి మాదాపూర్‌లోని కాకతీయ హిల్స్‌లో నీటి సరఫరా సమయంలో తనిఖీలు నిర్వహించారు. అపార్ట్‌మెంట్‌వాసులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎండి మాట్లాడుతూ జలమండలి సుదూర ప్రాంతాల నుంచి నీటిని శుద్ధి చేసి సరఫరా చేస్తోందని, నీటిని వృథా చేయకుండా వాటిని తాగునీటి అవసరాలకు మాత్రమే వినియోగించాలని కోరారు. ఇప్పటికే నగరంలో భూగర్భ జలాలు అడుగంటిపోగా కొన్ని ప్రాంతాల్లో ట్యాంకర్లకు డిమాండ్ పెరిగిందన్నారు. రానున్న రోజులలో నీటికి ఇబ్బంది అయ్యే అవకాశం ఉన్నందున ప్రజలు తాగు నీటిని ఇతర అవసరాలకు వృధా చేయకూడదని విజ్ఞప్తి చేశారు. నల్లాలకు మోటార్లు బిగించి నీటిని తోడితే మిగితా వినియోగదారులకు లో ప్రెషర్ తో నీటి సరఫరా కావడంతో ఇబ్బంది పడుతున్నారన్నారు. జలమండలి పైపులైనుకు నేరుగా విద్యుత్ మోటార్లు బిగించి నీటిని అక్రమంగా తోడుతున్న వినియోగదారులను గుర్తించి జలమండలి విజిలెన్స్ సిబ్బంది మోటార్లు సీజ్ చేశారు. మోటార్ ఫ్రీ టాప్ డ్రైవ్‌లో మొదటి రోజు ఇప్పటివరకు అన్ని డివిజన్‌లలో కలిపి మొత్తం 64 మోటార్లను సీజ్ చేయగా 84మంది వినియోగదారులకు అక్రమంగా మోటార్లు ఉపయోగించినందుకు, నీటి వృథా చేసినందుకు జారీమాన విధించారు. వినియోగదారులెవరూ నల్లాకు మోటార్లు బిగంచకూడదని, ఒకవేళ తక్కువ ప్రెషర్‌తో నీరు సరఫరా అయినా, లేదా నీటి సరఫరాలో ఏవైనా సమస్యలు తలెత్తినా, సంబంధిత అధికారులను సంప్రదించాలన్నారు. కస్టమర్ కేర్ నంబర్ 155313కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు అని ఎండి తెలిపారు.

## తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు
### ఎంపిడిఒ నరేందర్‌రెడ్డి



**ప్రజాపక్షం/యాచారం :** వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండాన చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ నరేంధర్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం యాచారం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సంధర్బంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ఎండల తీవ్రత దృష్ట్యా భూగర్భ జలాలు అడుగంటి తాగు నీటి సమస్య వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ విషయాన్ని గమనించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. ఉపాధి కూలీలందరకి పని కల్పించాలన్నారు. నర్సరీలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగు పర్చాలని కోరారు. సమావేశంలో ఎంపిడిఒ శ్రీలత, ఉపాధి ఎపిఒ నరేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం
### మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** వేసవి కాలంలో ప్రజల దాహార్తి తీర్చడానికి చలి వేంద్రం ఏర్పాటు అభినందనీయమని జిహెచ్‌ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి అన్నారు. మంగళవారం డివిజన్‌లోని సహార రోడ్డు వివేకానంద మార్గ్ వద్ద సహారా స్టేట్స్ సీనియర్ సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నర్సింహ్మారెడ్డి మాట్లాడుతూ చలి వేంద్రంలో మజ్జిగ పంపిణీ చేయడం అభినంనీయమన్నారు. కార్యక్రమంలో సీనియర్ సిటజన్ అధ్యక్షుడు జ్ఞానేశ్వర్, శ్రీకాంత్, రాఘవేంద్ర, శిశ్వనాథ్, కృష్ణారెడ్డి, ప్రకాష్, వెంకటాద్రి, ప్రసాద్ రావు, సుధాకర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, శేఖర్, కాలనీ అధ్యక్షులు సయ్యద్ జానీ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ సంఘాలతో కాలనీలు అభివృద్ధి
### బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి




**ప్రజాపక్షం/ఎల్‌బినగర్ :** కాలనీ సంక్షేమ సంఘాలతోనే కాలనీలు అభివృద్ధి చెందుతాయని బిఎన్‌రెడ్డి నగర్ డివిజన కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. మంగళవారం బిఎన్‌రెడ్డి నగర్ ఫేస్1 సంక్షేమ సంఘం నూతన కమిటీని, సంక్షమ సంఘం ప్రతినిధులను కార్పొరేటర్ సత్కరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కారం చేస్తామన్నారు. కార్యక్రమంలో నూతన అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, ప్రధాన కార్యదర్శి ధనరాజ్, ట్రెజరర్ నవీన్ కుమార్, ఉపాధ్యక్షులు రాములు, జాయింట్ సెక్రటరీ రవికిరణ్‌రెడ్డి, కల్చరల్ సెక్రటరీ శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు అలెగ్జాండర్, సత్యనారాయణ, మాల్లారెడ్డి, ప్రభాకర్, హరి గోపాల్, అజయ్, కాశీరెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పౌష్టిక ఆహారంతోనే ఆరోగ్యం



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** పౌష్టిక ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని అంగన్‌వాడి టీచర్ కె.మంజుల అన్నారు. మంగళవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని లింగారెడ్డిగూడ గ్రామంలోని అంగన్‌వాడి సెంటర్1లో గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారులతో కేక్ కట్ చేయించడంతోపాటు పోషణపక్షం కార్యక్రమంలో చిన్నారులకు, గర్భిణీలకు, కిషోర బాలికలకు పోషక ఆహార పదార్థాలపై అవగాహన కల్పించా రు. ఈ సందర్భంగా మంజుల మాట్లాడుతూ పోషక ఆహారంపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మాధవి, పంచాయతీ కార్యదర్శి అర్జున్, మాజీ వార్డులు సభ్యులు రంగంపల్లి సురేష్ గౌడ్, రంగంపల్లి రమేష్ గౌడ్, చీపిరి గణేష్ యాదవ్, శ్రీధర్ గౌడ్, పయ్యల కృష్ణ యాదవ్, మంగలి మల్లేష్, శంకరయ్య యాదవ్, ఎఎన్‌ఎం నిర్మల, ఆశ వర్కర్‌తోపాటు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఫిజియోథెరపీదే ముఖ్య పాత్ర
### కాళోజీ వర్సిటీ విసి నందకుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** వైద్యరంగంలో ఫిజియోథెరపీ ప్రధాన పాత్ర పోషిస్తున్నదని కాళోజీ హెల్త్ యూనివర్సిటీ విసి పివి నందకుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో దుర్గాబాయి దేశ్ ముఖ్ కాలేజీ ఆఫ్ ఫిజియోథెరపీ (డిడిఎంఎస్) సిల్వర్ జూబ్లీ వేడుకలు, 3వ జాతీయ సదస్సు ప్రారంభించారు. దీనికి ముఖ్యఅతిథులుగా విసి నందకుమార్‌రెడ్డి, హైపవర్ కమిటీ చైర్మన్ జస్టిస్ గోపాల్‌రెడ్డి, డిడిఎంఎస్ ప్రెసిడెంట్ ఉషా కందా, ఎస్‌బిఐ జిఎం ప్రకాశ్ చంద్ర భారర్, డిడిసిఒపి చైర్మన్, మాజీ సిఎస్ ఐవైఆర్ కృష్ణారావు హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి, వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పివి నందకుమార్ మాట్లాడుతూ రెండురోజులు జరిగే ఈ సదస్సులో విద్యార్థులు మంచి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించా రు. చంద్ర భారర్ మాట్లాడుతూ ఫిజియోథెరపీ అంటే నొప్పికి, మన మనశ్శాంతికి అనుసంధానమన్నారు. సమావేశంలో డిడిఎంఎస్ ఉపాధ్యక్షుడు కె.లక్ష్మి సుందరి, ప్రిన్సిపాల్ ప్రొ.ఛాయానందిని తదితరులు పాల్గొన్నారు.

## తక్షణమే జిపి కార్మికులకు వేతనాలు
### ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహ్మారెడ్డి డిమాండ్

**ప్రజాపక్షం/కొత్తూరు:** గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నర్సింహ్మారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం కొత్తూరు ఎంపిడిఒకు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నర్సింహ్మారెడ్డి మాట్లాడుతూ పంచాయతీ కార్మికులు చాలీచాలని వేతనాలతో కుటుంబం అర్థ ఆకలితో జీవిస్తున్నారని వివరించారు. గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలు కేవలం రెండు నెలలకు సంబంధించినవి మాత్రమే ఆకౌంట్‌లలో వేశారని, మిగిలిన మూడు నెలలకు సంబంధించిన వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. గ్రామ పంచాయతీల్లో పనులు చేస్తున్న కార్మికులకు పిఎఫ్, ఇఎస్‌ఐ సౌకర్యం లేదని, తక్షణమే ఇన్సురెన్స్ సౌకర్యం కల్పించేందుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు పర్మినెంట్ గుర్తింపు కార్డులు, పనికి తగిన వేతనం ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో శేఖర్ రెడ్డి, బిక్షపతి, ఎర్ర దేవయ్య, సురేష్, జంగమ్మ, సురేష్, రాములు, కృష్ణయ్య, మల్లమ్మతోపాటు గ్రామ పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.




## వడగండ్ల వర్షంతో నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

**ప్రజాపక్షం/యాచారం :** వడగండ్ల వర్షంతో నష్టపోయిన రైతులందరికి నష్ట పరిహారం ఇప్పించేందుకు కృషి చేస్తామని మండల వ్యవసాయధికారి అర్ రవినాథ్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని నానక్ నగర్, తాడిపర్తి, చింతపట్ల, మొండిగౌరేల్లి,మంథన్‌గౌడ్, సుల్తాన్‌పూర్, మంథనిగౌరేల్లి, గ్రామాల్లో పర్యటించి వడగండ్ల వర్షంతో నష్టపోయిన పంటలను ఆయన తమ సిబ్బందితో కలిసి పంట నష్టం అంచనా వేసినట్లు తెలిపారు. అయా గ్రామాల్లో 200 ఎకరాల్లో వరిపంట, 30 ఎకరాల్లో కూరగాయాల తోటలు, మామిడి తోటలకు నష్టం వాటిల్లినట్లు ప్రాధమికంగా అంచనా వేసినట్లు తెలిపారు. పంటల నష్టం అంచనాపై అధికారులకు నివేధిక పంపిస్తామని అన్నారు. రైతులందరికీ న్యాయం చేయడానికి కృషి చేస్తామన్నారు.

## పిడుగుపాటుకు ఎద్దు మృతి

**ప్రజాపక్షం/కొందుర్గు:** కొందుర్గు మండలంలో మంగళవారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి మండల పరిధిలోని శ్రీరంగాపూర్‌లో పిడుగుపడడంతో గ్రామానికి చెందిన బియ్యని లాలయ్య ఎద్దు దుర్మరణం పాలయ్యిందని గ్రామస్థులు తెలిపారు. మృతి చెందిన ఎద్దు విలువ సుమారు రూ.70వేల వరకు ఉంటుందని, ప్రభుత్వం ఆర్థిక సహాయం చేసి బాధిత రైతు లాలయ్యను ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు. అలాగే మండల పరిధిలోని లక్ష్మీ దేవుని పల్లిలో వడగండ్ల వర్షం కురువడంతో కోళ్లఫారం రేకులు గాలికి ఎగిరిపోయాయని, మామిడి తోటల్లో మామిడి కాయలు గాలికి నేల రాలిపోయి తీవ్రంగా నష్టం జరిగిందని గ్రామస్థులు తెలిపారు. బాధితులకు ప్రభుత్వం ఆర్థిక సహాయం చేయాలని గ్రామస్థులు కోరారు.

## ఫ్రీ ఎంట్రీ పేరుతో యువకులకు ఎర
### వైల్డ్ పబ్‌లో అసభ్యకర నృత్యాలు..
### పోలీసుల దాడులు...16 మంది యువతులు, డిజె, ఆపరేటర్ అరెస్ట్




**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** పబ్ లోకి ఫ్రీ ఎంట్రీ అంటూ ఫర్ ఇచ్చి ఆ పైన యువతులను ఎర వేసి యువకుల జేబులు ఖాళీ చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా యువతులతో అసభ్యకర నృత్యాలు చేయిస్తున్న వైల్డ్‌హార్ట్ పబ్ పై చైతన్యపురి పోలీసులు, ఎల్‌బినగర్ ఎస్‌ఒటి పోలీసులు మెరుపుదాడులు నిర్వహించిన సంఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబందించి సిఐ జి.వెంకటేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం గ్రీన్‌హిల్స్ కాలనీ ప్రధాన రహదారిలో ఉన్న వైల్డ్ హార్ట్ పబ్ నిబంధనలు అతిక్రమించి యువతులతో అసభ్యకర నృత్యాలు చేయిస్తున్నారనే సమాచారం మేరకు దాడులు చేసి సోదాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడిలో 16 మంది యువతులు, ఒక డిజేతో పాటు అపరేటర్‌ను అదుపులోకి తీసుకున్నారు. పబ్ యాజమాని రాము యువతులను ఫ్రీ ఎంట్రీ పేరు మీద అమ్మాయిలను ఎంగేజ్ చేసుకోని ఒంటరిగా వచ్చిన యువకులను మంబై యువతులతో ట్రాప్ చేయించి అధిక బిల్లులు వసూలు చేయిస్తున్నారని గుర్తించారు. మేనేజర్ సంతోష్ పరారీలో ఉన్నారని, పలు సెక్షన్ల కింద నమోదు చేస్తున్నట్లు వెల్లడించారు.

## నాగపట్నం మహాసభకు తరలివెళ్ళిన రైతుసంఘం నేతలు

**ప్రజాపక్షం/షాబాద్ :** తమిళనాడు రాష్టంలోని నాగపట్నంలో జరుగుతున్న ఆఖిల భారత కిసాన్ మహాసభకు రైతు సంఘం నేతలు తరలి వెళ్ళారు. మంగళవారం హైదరాబాద్ నుంచి తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ, ఉపాధ్యక్షుడు ఎం.ప్రభులింగం, ప్రధాన కార్యదర్శి సంధ్య, రంగారెడ్డి జిల్లా నుండి రైతు సంఘం కౌన్సిల్ సభ్యులు బానూరు సుభాన్‌రెడ్డి, ఎం.సుధాకర్‌గౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డి, నిమ్మల నర్సింహులు నాయకత్వంలో నాగపట్నం మహాసభకు తరలివెళ్ళారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ 89 సంవత్సరాల సుధీర్ఘ పోరాటాల రైతు సంఘం ఆవిర్భవించిందని తెలిపారు.



## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు ప్రోత్సాహం
### రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి



**ప్రజాపక్ష/రంగారెడ్డి ప్రతినిధి :** ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు త్వరతగతిన నిర్మాణాలు చేపట్టేలా వారిని అన్ని విధాలుగా ప్రోత్సహించాలని కలెక్టర్ నారాయణరెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, రాజీవ్ యువశక్తి, భూ భారతి చట్టాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకుపోవాలన్న అంశంపై జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి సంబంధిత అధికారులతో వేరువేరుగా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి జిల్లాలో ఇప్పటి వరకు జిల్లాలో 78 వేల 788 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఇంకనూ అర్హులైన వారు ఉంటే, అలాంటి వారిని గుర్తించి మంజూరు పత్రాలు అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వివిధ కారణాల వల్ల ఇండ్ల నిర్మాణాలు ప్రారంభించలేకపోయిన లబ్దిదారులను కలిసి, వారికి ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం అందించే ఆర్థిక తోడ్పాటు గురించి వివరిస్తూ అవగాహన కల్పించాలన్నారు. అనంతరం రాజీవ్ యువశక్తి సమీక్షిస్తూ శాఖల వారిగా వచ్చిన దరఖాస్తులను వెంటనే డాటా ఎంట్రీ చేయించి పరిశీలన ప్రక్రియను ప్రారంభించాలని కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. భూసమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు తీసుకొచ్చిన భూభారతి'ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని తెలిపారు. ప్రతి నియోజకవర్గం, రెవెన్యూ డివిజన్ పరిధి, మండలాల పరిధిలో, ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి పూర్తి స్థాయిలో రైతులకు భూభారతి'పై అవగాహన చేయించాలన్నారు. రెవెన్యూ శాఖపైన సృష్టించిన అపోహలను తొలగించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రభుత్వ అధికారులు, ప్రభుత్వ వివిధ శాఖల అధికారుల సహకారంతో చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయడం కోసం కలిసి కట్టుగా పనిచేయాలన్నారు. సమావేశాల్లో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డిఆర్‌డిఒ సంగీత, ఆర్‌డిఒలు అనంతరెడ్డి, చంద్రకళ, జగదీశ్వర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు, ఎమ్మార్వోలు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి
### రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్



**ప్రజాపక్షం/గండిపేట :** అభివృద్ధి పనుల నిర్మాణంలో కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటించాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అన్నారు. మంగళవారం కొత్వాల్ గూడ వద్ద జల మండలి ఆధ్వర్యంలో హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ వద్ద నిర్మించనున్న 20 ఎంఎల్‌డి సామర్థం గల ఎస్‌టిపి సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్‌లకు ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ హిమాయత్ సాగర్‌కు వచ్చే నీరు కలుషితం కాకుండా చూస్తామన్నారు. ఇందుకోసం శంషాబాద్, కవ్వ గూడ, కొత్వాల్ గూడ నుంచి వచ్చే నీటిని ఎస్‌టిపిలకు మళ్లించి నీటిని శుద్ధి చేస్తామని ఆయన తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా మౌలిక సదుపాయాలను పెంపొందించడానికి రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలు, తాగునీటి వసతులు, వీధి లైట్ల ఏర్పాట్లలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసే బాధ్యత తనదే అన్నారు. పనుల నిర్మాణంలో కాంట్రాక్టర్లు ఉన్నత ప్రమాణాలను పాటించాలని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ స్పష్టం చేశారు. నియోజకవర్గం అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మణికొండ మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావు, జల మండలి డైరక్టర్, జనరల్ మేనేజర్‌లు పాల్గొన్నారు.

## ఆయిల్‌పామ్‌తో అధిక లాభాలు
### ఉద్యానవన శాఖ అదనపు డైరెక్టర్ సరోజిని



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** అయిల్ ఫామ్ పంటలను సాగుచేసి ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు అన్నదాతలు కృషి చేయాలని ఉద్యానవన శాఖ అదనపు డైరక్టర్ సరోజిని అన్నారు. మంగళవారం కేశంపేట మండలంతోపాటు ఫరూఖ్‌నగర్ మండ ల పరిధిలోని వెల్‌జర్ల గ్రామంలో రైతు నర్సింహ్మారెడ్డి సాగుచేసిన ఆయిల్‌పామ్ పంటను పరిశీలించారు. అంతర్ పంట బొప్పాయి పంటను పరిశీలించారు. తెలంగాణకు సంబంధించిన జాతీయ పరిరక్షణ బృందంలో హైదరాబాద్ ఆయిల్ సీడ్స్ అభివృద్ధి డైరెక్టర్ డాక్టర్ కె.పొన్ను స్వామి, శాస్త్రవేత్త (హెచ్‌ఆర్‌ఎస్‌హెచ్) డాక్టర్ జి.విజయకృష్ణతోపాటు ఆయిల్ సీడ్స్ డైరెక్టర్ అభివృద్ధి డైరెక్టరేట్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ సరోజిని మాట్లాడుతూ ఆయిల్ పామ్ పంట సాగు చేసేందుకు అన్నదాతలకు ఆసక్తి ఉంటే ఏప్రిల్ చివరి వరకు ఉద్యానవన కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వాల్యూ ఆయిల్ అండ్ గ్యాస్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ ఉపాధ్యక్షుడు రాంమోహన్‌రావు, మండల ఉద్యానవన శాఖ అధికారిణి హిమబిందు, పామ్ ఆయిల్ విభాగం అధికారి మల్లారెడ్డితోపాటు అన్నదాతలు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తున్నాం
### షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/కొత్తూరు:** ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. మంగళవారం కొత్తూరు మండల సరిధిలోని సిద్దాపూర్, వైఎం తండా, ఎస్బిపల్లి, కొడిచర్ల గ్రామాల్లో జైబాపు..జైభీమ్..జై సంవిధాన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తోపాటు మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, మాజీ జడ్పిటిసి సభ్యుడు మామిడి శ్యాంసుందర్‌రెడ్డి పాల్గొన్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ రాజ్యాంగ విలువలపై ప్రజల్లో అవగాహన పెంచడమే జైబాపు..జైభీమ్..జై సంవిధాన్ లక్ష్యమన్నారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడానికి రాహుల్‌గాంధీ జైబాపు..జైభీమ్..జై సంవిధాన్ నినాదానికి పిలుపునిచ్చినట్లు తెలిపారు. రాజ్యాంగం అమల్లో వచ్చి 75 ఏళ్లు పూర్తి చేసుకున్న నేపద్యంలో రాజ్యాంగ విలువలపై ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యంగా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని వివరించారు. పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగ విలువలను అణగదొక్కేందుకు చూస్తున్నారని, వారి కుట్రలను తిప్పికొట్టేందుకు ప్రజలంతా చైతన్యం కావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జైపాల్, మండల అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు జె.సుదర్శన్ గౌడ్‌తోపాటు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, మహిళా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## కేంద్ర ఆర్థిక శాఖ డైరెక్టర్‌గా నియమితులైన లయకు సత్కారం



**ప్రజాపక్షం/షాద్‌నగర్ :** కేంద్ర ఆర్థిక శాఖ డైరెక్టర్‌గా మద్దూరి లయ నియమితులయ్యారు. షాద్‌నగర్ పట్టణంలోని సిఎస్‌కే విల్లాలో నివాసం ఉంటున్న మద్దూరి లయను రిటైర్డ్ దూరదర్శన్ మాజీ డైరెక్టర్ కుమార్ మంగళవారం అభినందించారు. ప్రస్తుతం అస్సాం రాష్ట్రంలోని గౌహతిలో జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారని, అక్కడి నుండి కేంద్ర ఆర్థిక శాఖలో ఉన్నతమైన పదవిలో నియమించడం సంతోషంగా ఉందన్నారు. సింగారం శ్రీనివాస్, కె.రంగనాథం, టివి రంగయ్య, వడ్ల రమేష్‌చారి, శివ, మల్లిఖార్జున్‌గౌడ్, సత్యనారాయణలు మద్దూరి లయను అభినంధించారు. లయ భవిష్యత్‌లో మరింత ఉన్నతమైన పదవులు అధిరోహించాలని వారు ఆకాంక్షించారు.

క్రీడ

## బంగ్లాదేశ్‌లో భారత పర్యటన
# ఖరారు



ఈ ఏడాది ఆగస్టులో బంగ్లాదేశ్‌తో జరగనున్న వైట్ బాల్ సిరీస్‌ను బీసీసీఐ మంగళవారం ప్రకటించింది. ఇరు దేశాల మధ్య ఈ సిరీస్ ఆగస్టు 17 నుంచి ప్రారంభం కానుంది. ఈ ఏడాది ఆగస్టులో భారత క్రికెట్ జట్టు బంగ్లాదేశ్‌లో పర్యటించనుంది. ఈ టూర్‌లో టీమిండియా మూడు వన్డేలు, మూడు టీ20లు ఆడనుంది. మీర్పూర్, చిట్టగాంగ్ వేదికల్లో ఈ మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈ పర్యటన ఆగస్టు 17న ప్రారంభమై ఆగస్టు 31న ముగుస్తుంది. ఈ పర్యటన ఆగస్టు 17, 20, 23 తేదీల్లో వన్డే సిరీస్‌తో ప్రారంభమవుతుంది. ఆగస్టు 26, 29, 31 తేదీల్లో టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లు జరుగుతాయి.

### రెండు జట్ల మధ్య పూర్తి షెడ్యూల్ ఇదే..

**వన్డే షెడ్యూల్ ఇలా..**
మొదటి వన్డే ఆగస్టు 17 (మీర్పూర్)
రెండవ వన్డే ఆగస్టు 20 (మీర్పూర్)
మూడో వన్డే ఆగస్టు 23 (చిట్టగాంగ్)

**టీ20 షెడ్యూల్ ఇలా..**
మొదటి టీ20 మ్యాచ్ ఆగస్టు 26 (చిట్టగాంగ్)
రెండో టీ20 మ్యాచ్ 29 ఆగస్టు (మీర్పూర్)
మూడో టీ20 మ్యాచ్ ఆగస్టు 31 (మీర్పూర్)

ప్రస్తుతం భారత క్రికెటర్లంతా ఐపిఎల్ 2025తో చాలా బిజీగా ఉన్నారు. ఈ ఏడాది ఐపిఎల్ మే 25న ముగియనుండగా.. అనంతరం భారత జట్టు ఇంగ్లాండ్‌లో పర్యటించనుంది. జూన్, జులై, ఆగస్టు నెలల్లో ఇంగ్లాండ్‌తో భారత్ 5 మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ ఆడనుంది. ఈ సిరీస్ ఆగస్టు 4న ముగుస్తుంది. ఈ సిరీస్ తర్వాత్ భారత్ బంగ్లాదేశ్ లో పర్యటించనుంది.

**ఇంగ్లాండ్‌లో భారత్ షెడ్యూల్ ఇలా..**
తొలి టెస్టు జూన్ 2024
రెండో టెస్టు జులై 26
మూడో టెస్టు జులై 1014
నాలుగో టెస్టు జులై 2327
ఐదో టెస్టు జులై 31ఆగస్టు 4

భారత్ బంగ్లాదేశ్ పర్యటన అనంతరం సెప్టెంబర్ నెలలో ఖాళీగా ఉండి అక్టోబర్ 2 నుంచి వెస్టిండీస్‌తో స్వదేశంలో రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ ఆడనుంది. అనంతరం నవంబర్–డిసెంబర్‌లో దక్షిణాఫ్రికాతో రెండు టెస్టులు, మూడు వన్డేలు, ఐదు టీ20లు ఆడనుంది.

**వెస్టిండీస్ సిరీస్ షెడ్యూల్ ఇలా..**
తొలి టెస్టు అక్టోబర్ 26 (అహ్మదాబాద్)
రెండో టెస్టు అక్టోబర్ 1014(కోల్‌కతా)

**భారత్‌లో దక్షిణాఫ్రికా పర్యటన షెడ్యూల్ ఇలా..**
తొలి టెస్టు నవంబర్ 1418(ఢిల్లీ)
రెండో టెస్టు నవంబర్ 2226(గౌహతి)

**సౌతాఫ్రికాతో వన్డేలు ఇలా..**
తొలి వన్డే నవంబర్ 30(రాంచీ)
రెండో వన్డే డిసెంబర్ 3(రాయ్ పూర్)
మూడో వన్డే డిసెంబర్ 6(వైజాగ్)

సౌతాఫ్రికాతో టీ20 మ్యాచ్ లు ఇలా..
తొలి టీ20 డిసెంబర్ 9(కటక్)
రెండో టీ20 డిసెంబర్ 11(చండీగఢ్)
మూడో టీ20 డిసెంబర్ 14 (ధర్మశాల)
నాలుగో టీ20 డిసెంబర్ 17(లక్నో)
ఐదో టీ20 డిసెంబర్ 19(అహ్మదాబాద్)

రెండు స్వదేశీ సిరీస్‌ల మధ్య టీమిండియా ఆస్ట్రేలియాలో 3 వన్డేలు , 5 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లను ఆడుతుంది. ఈ నెల ప్రారంభంలో క్రికెట్ ఆస్ట్రేలియా సిరీస్ షెడ్యూల్‌ను ప్రకటించింది, అక్టోబర్ 19 నుంచి వన్డేలు, అక్టోబర్ 29 నుంచి టీ20లు ప్రారంభమవుతాయి.

**ఆస్ట్రేలియాతో భారత పర్యటన ఇలా..**
తొలి వన్డే అక్టోబర్ 19(పెర్త్)
రెండో వన్డే అక్టోబర్ 23(అడిలైడ్)
మూడో వన్డే అక్టోబర్ 25(సిడ్నీ)

**టీ20 షెడ్యూల్ ఇలా..**
తొలి టీ20 అక్టోబర్ 29(కాన్‌బెర్రా)
రెండో టీ20 అక్టోబర్ 31(మెల్బోర్న్)
మూడో టీ20 నవంబర్ 2(హోబర్ట్)
నాలుగో టీ20 నవంబర్ 6(గోల్డ్ కోస్ట్)
ఐదో టీ20 నవంబర్ 8(బ్రిస్బేన్)

# రఫ్ఫాడించిన చాహల్, మార్కో

### కోల్‌కతా నైట్ రైడర్స్‌పై పంజాబ్ కింగ్స్ 16 పరుగుల తేడాతో అనూహ్య విజయం



ఐపిఎల్ 2025 సీజన్‌లో పంజాబ్ కింగ్స్ మరో విజయాన్ని నమోదు చేసింది. మంగళవారం ముల్లాన్‌పూర్ వేదికగా కోల్‌కతా నైట్ రైడర్స్‌తో ఉత్కంఠగా సాగిన లోస్కోరింగ్ మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ 16 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ 15.3 ఓవర్లలో 111 పరుగులకే కుప్పకూలింది. ప్రియాంశ్ ఆర్య(12 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 22), ప్రభ్‌సిమ్రాన్ సింగ్(15 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లతో 30) టాప్ స్కోరర్లుగా నిలిచారు. కేకేఆర్ బౌలర్లలో హర్షిత్ రాణా(3/25) మూడు వికెట్లు తీయగా.. సునీల్ నరైన్2/14), వరుణ్ చక్రవర్తి(2/21) రెండేసి వికెట్లు పడగొట్టారు. వైభవ్ అరోరా, అన్రిచ్ నోర్జ్ తలో వికెట్ పడగొట్టారు. అనంతరం కేకేఆర్ 15.1 ఓవర్లలో 95 పరుగులు చేసింది. అంగ్‌క్రిష్ రఘువంశీ(28 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 37), ఆండ్రీ రస్సెల్(11 బంతుల్లో ఫోర్, 2 సిక్స్‌లతో 17 ) టాప్ స్కోరర్లుగా నిలిచారు. పంజాబ్ బౌలర్లలో(4/28) నాలుగు వికెట్లు తీయగా.. మార్కో జాన్సెన్(3/17)మూడు వికెట్లు పడగొట్టాడు. గ్జేవియర్ బార్ట్‌లెట్, గ్లెన్ మ్యాక్స్‌వెల్ తలో వికెట్ తీసారు.

# 'కింగ్‌డమ్'పై సాలిడ్ అప్డేట్..!




టాలీవుడ్‌లో తెరకెక్కుతున్న ప్రెస్టీజియస్ చిత్రాల్లో స్టార్ హీరో విజయ్ దేవరకొండ నటిస్తున్న 'కింగ్‌డమ్' కూడా ఒకటి. ఈ సినిమాను దర్శకుడు గౌతమ్ తిన్ననూరి డైరెక్ట్ చేస్తుండటంతో ఈ మూవీపై అంచనాలు భారీగా క్రియేట్ అయ్యాయి. ఇక ఈ మూవీ నుంచి రిలీజ్ అయిన టీజర్ ప్రేక్షకుల్లో ఈ మూవీపై అంచనాలను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లాయి. అయితే, ఈ సినిమాకు సంబంధించి విజయ్ దేవరకొండ తాజాగా ఓ సాలిడ్ అప్డేట్ అయితే ఇచ్చాడు. ప్రస్తుతం 'కింగ్‌డమ్' చిత్ర డబ్బింగ్ పనులు జరుగుతున్నాయని.. ఫస్ట్ హాఫ్ డబ్బింగ్ పూర్తయిందంటూ విజయ్ తన ఇన్‌స్టా స్టోరీలో తెలిపాడు. దర్శకుడు గౌతమ్‌తో విజయ్ దీని గురించి చర్చిస్తున్న ఫోటోను కూడా ఆయన షేర్ చేశాడు. దీంతో ఈ సినిమాపై నెలకొన్న అనుమానాలు తొలగిపోయాయని అభిమానులు అంటున్నారు. ఇక ఈ సినిమాలో విజయ్ దేవరకొండ పాత్ర వేరే లెవెల్‌లో ఉండబోతుందని ఇప్పటికే రిలీజ్ అయిన టీజర్ చూస్తే అర్థమవుతుంది. ఈ సినిమాలో అందాల భామ భాగ్యశ్రీ బొర్సె హీరోయిన్‌గా నటిస్తోంది. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చున్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై నాగవంశీ, సాయి సౌజన్య ప్రొడ్యూస్ చేస్తున్నారు.

రీల్

## 'అఖండ 2' యాక్షన్ ప్లాన్..
# ఆ నలుగురుతో !



నందమూరి నటసింహం బాలకృష్ణ హీరోగా తన బ్లాక్ బస్టర్ హిట్ దర్శకుడు బోయపాటి శ్రీను కాంబినేషన్ లో తెరకెక్కిస్తున్న అవైటేడ్ చిత్రం అఖండ 2 కోసం అందరికీ తెలిసిందే. అయితే ఈ చిత్రం మొదటి భాగానికి సీక్వెల్ గా వస్తుండగా పాన్ ఇండియా లెవెల్లో దీనిపై సాలిడ్ బజ్ నెలకొంది. అయితే ఈ చిత్రం కోసం బోయపాటి శ్రీను మరింత కేర్ ని స్క్రిప్ట్ నుంచి చాలా అంశాల్లో తీసుకుంటున్నారు. ఇక బోయపాటి సినిమాల్లో యాక్షన్ ఎపిసోడ్స్ కి ఒక సెపరేట్ ట్రాక్ రికార్డు ఉంటుంది. ప్రతీ సినిమాకి కూడా కొత్త కొత్త యాక్షన్ ఎపిసోడ్స్ ని తాను డిజైన్ చేయించుకుంటారు. ఇలా అఖండ 2 యాక్షన్ సీక్వెన్స్ లపై కూడా క్రేజీ టాక్ వినిపిస్తుంది. దీనితో ఈ మొత్తం సినిమాకి నాలుగు స్టంట్ డైరెక్టర్స్ వర్క్ చేస్తున్నారట. రామ్ లక్ష్మణ్ సోదరులు అలాగే పీటర్ హెయిన్ సహా మరో ప్రముఖ స్టంట్ మాస్టర్ రవి వర్మలు అఖండ 2లో యాక్షన్‌లు తెరకెక్కిస్తున్నారట. అయితే వీరిలో రవి వర్మతో బోయపాటి మరింత స్పెషల్ గా ప్లాన్ చేస్తున్నట్టుగా తెలుస్తుంది.

# రూ.30 కోట్లు డిమాండ్



బాలీవుడ్ స్టార్ నటుడు హృతిక్ రోషన్ మెగాఫోన్ పడుతున్న విషయం తెలిసిందే. తాను హీరోగా వచ్చిన బ్లాక్ బస్టర్ క్రిష్ ఫ్రాంచైజీలో భాగంగా నాలుగో పార్ట్‌కు హృతిక్ రోషన్ దర్శకత్వం వహించబోతున్నాడు. 20 ఏళ్ల క్రితం 'కోయీ మిల్ గయా'తో మొదలైన ఈ సిరీస్, ఆ తర్వాత 'క్రిష్ 2', 'క్రిష్ 3'లతో బ్లాక్ బస్టర్‌లు అందుకుంది. ఈ సినిమాల్లో హృతిక్‌తో పాటు అందాల తార ప్రియాంక చోప్రా ఫీమేల్ లీడ్‌గా నటించగా, కంగనా రనౌత్, వివేక్ ఒబెరాయ్ వంటి స్టార్స్ కీలక పాత్రల్లో కనిపించారు. అయితే తాజాగా రాబోతున్న 'క్రిష్ 4'లో ప్రియాంక చోప్రా మరోసారి లీడ్ రోల్‌లో కనిపించబోతున్నారని తెలుస్తుంది. హృతిక్ రోషన్ ఈ మూవీ కథను ప్రియాంకకు వినిపించగా.. ఆమెను ఆకట్టుకున్నట్లు తెలుస్తోంది. ప్రియా పాత్రలో ఆమె మెరవనున్నట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే, ఈ విషయంపై ప్రియాంక చోప్రా టీమ్ నుంచి ఇప్పటివరకూ అధికారిక ప్రకటన రాలేదు. ఇదిలావుంటే ఈ ప్రాజెక్ట్ కోసం ప్రియాంక చోప్రా భారీ మొత్తంలో డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తుంది. క్రిష్ 4కి ఏకంగా రూ.20 నుంచి 30 కోట్లు రెమ్యూనరేషన్ డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తుంది. ఇదిలా ఉంటే, సూపర్‌స్టార్ మహేష్ బాబు, దర్శకుడు రాజమౌళి కాంబినేషన్‌లో రూపొందుతున్న 'SSMB29' సినిమాకు కూడా ప్రియాంక దాదాపు రూ.30 కోట్ల వరకు పారితోషికం తీసుకోనున్నట్లు సమాచారం.

# 'గుడ్ బ్యాడ్ అగ్లీ' టీంకు ఇళయరాజా షాక్!



మన సౌత్ సినిమా దగ్గర ఎన్నెన్నో ఆణిముత్యాల్లాంటి పాటలు అందించిన లెజెండరీ సంగీత దర్శకుడు ఇళయరాజా కోసం అందరికీ తెలిసిందే. అయితే ఇప్పటికీ కూడా అదే రీతి అద్భుతమైన గీతాలని తాను అందిస్తుండగా ఈ మధ్య కాలంలో వీటితో పాటుగా మరికొన్ని అంశాల్లో తాను హైలైట్ అవుతున్నారు. తాను ఇచ్చిన ఎన్నో చార్ట్ బస్టర్ సాంగ్స్‌ని ప్రస్తుత తరం యువ దర్శకులు తమ సినిమాల్లో అభిమానంతో మంచి వైబ్ కోసం పెడుతున్నారు. కానీ ఇదే వారికి చిక్కులు తెస్తుంది. ఇలా లేటెస్ట్‌గా అజిత్ కుమార్ నటించిన గుడ్ బ్యాడ్ అగ్లీ సినిమాలో కూడా జరిగింది. తన ట్యూన్ అనుమతి లేకుండా వాడినందుకు తనకి 5 కోట్లు ఆ చిత్ర యూనిట్ చెల్లించాలి అని ఇళయరాజ ఊహించని షాకిచ్చారు. దీనితో ఈ వార్త సినీ వర్గాల్లో వైరల్ గా మారింది. మరి దీనిని మేకర్స్ ఎలా సెటిల్ చేస్తారో వేచి చూడాలి. ప్రస్తుతం అయితే ఈ చిత్రం భారీ వసూళ్లు అందుకొని దూసుకెళ్తుంది.

## ఉపాధి కూలీలు, ఉద్యోగులకు
# పెండింగ్ వేతనాలు చెల్లించండి

**శ్రీనిధి బాధ్యతలను ఐఎఎస్ అధికారికి అప్పగించండి**
**బిఆర్ఎస్ మాజీ మంత్రి హరీశ్‌రావు**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహాత్మాగాంధీ పేరుతో అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకానికి కాంగ్రెస్ ప్రభుత్వం తూట్లు పొడిచేలా వ్యవహరించడం సిగ్గుచేటని బిఆర్ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఉపాధి కూలీలు సహా, ఫీల్డ్ అసిస్టెంట్లకు, ఎపిఒలకు, సిఒలకు మూడు నెలలుగా జీతాలను చెల్లించకపోవడం శోచనీయమని, చేసిన పనికి వేతనాలు రాక ఉపాధి కూలీలు, సిబ్బంది ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించి, ఉపాధి కూలీలు, ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. మహిళలకు వడ్డీ లేని రుణాల విషయంలో ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కమంచిర్యాలలో మంచినీళ్లు తాగినంత సులువుగా మరోసారి అబద్ధాలు చెప్పారని ఆరోపించారు. రూ.21 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు మహిళలకు ఇచ్చామని మరోసారిమోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. గత ఏడాది నవంబర్ 19న, వరంగల్‌లో స్వయం సహాయక సంఘ సభ్యులకు రుణ బీమా, ప్రమాద బీమా చెక్కులను సిఎం అందించారని, మళ్ళీ అవే చెక్కులను ఈ ఏడాది మార్చి 8న ఇందిరా మహిళా శక్తి పేరుతో హైదరాబాద్‌లో అందించారని ఆరోపించారు. ఈ చెక్కులు ఇప్పటి వరకు క్లియర్ కాలేదని, ఈ చెక్కులను వెంటనే క్లియర్ చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలల విద్యార్థుల డ్రెస్ కుట్టుకు రూ.50ల చార్జీలను ఇచ్చి, రూ.75లుగా ప్రచారం చేసుకున్నారని, ఈ విషయమై తాము నిలదీస్తే మిగిలిన రూ.25లను విడుదల చేశారని హరీశ్‌రావు పేర్కొన్నారు. విద్యార్థుల డ్రెస్ చార్జీలను రూ.150లకు పెంచాలని డిమాండ్ చేశారు. స్వయం సహాయక బృందాలకు రుణాలు ఇచ్చే 'శ్రీనిధి' నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని, దీనిపైన ప్రత్యేక దృష్టి సారించాలని, ఐఎఎస్ అధికారికి బాధ్యతలను అప్పగించి, శ్రీనిధి భవిష్యత్తును కాపాడాలన్నారు.



## రాజ్యాధికార సాధనకు
# బిసిలు ఏకం కావాలి

**బిసి ఇంటలెక్చువల్ ఫోరం సమావేశంలో పలువురు వక్తలు**

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** రాబోయే ఎన్నికల్లో బిసిలు ఏకమై తమ సత్తా చాటి, రాజ్యాధికారం సాధించుకోవాలని పలువురు వక్తులు పిలుపునిచ్చారు. అప్పుడే విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో అందరికీ సమాన అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బిసి ఇంటెలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో 'తెలంగాణ రాష్ట్రం – సామాజిక న్యాయం' అనే అంశంపై జరిగిన సమావేశంలో ఫోరం చైర్మన్ టి.చిరంజీవులు, జస్టిస్ ఈశ్వరయ్య, ప్రొఫెసర్ తిరుమలి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో 90శాతం ఉన్న బలహీన వర్గాలకు 75 ఏండ్ల రాజ్యాంగ పాలనలో న్యాయం జరగలేదన్నారు. సామాజిక న్యాయం అంటూ ప్రతి సభలో మాట్లాడుతున్న రాహుల్‌గాంధీ వారి పాలిత రాష్ట్రాల్లో, తెలంగాణలో సామాజిక న్యాయం ఎక్కడ అమలవుతున్నదని ప్రశ్నించారు. రాష్ట్రంలో 10శాతం లేని అగ్రవర్ణ కులాలకు 50శాతానికిపైగా కార్పొరేషన్ల చైర్మన్లు కేటాయించి, మిగతా వర్గాలకు తీవ్ర అన్యాయం చేశారని తెలిపారు. సిఎం కార్యాలయంలో, రాహుల్‌గాంధీ ఆఫీస్‌లో, ప్రభుత్వ సలహాదారుల్లో, న్యాయాధికారుల్లో, పార్లమెంట్‌లో, వీసీల నియామకాల్లో బిసిల ప్రాతినిథ్యం నామమాత్రమేనన్నారు. ఎప్పుడైతే ప్రతి బిసి బిడ్డ తన ఓటును బిసి అభ్యర్థులకు వేస్తేనే అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తున్నదని తెలిపారు. సమావేశంలో తెలంగాణ విద్యార్థి నిరుద్యోగ, యువజన జెఎసి చైర్మన్ అశోక్, ఒబిసి జాక్ చైర్మన్ డాక్టర్ అవ్వారు వేణుకుమార్, ఎఐఒబిసిఎస్ఎ వ్యవస్థాపకులు జి.కిరణ్‌కుమార్, అడ్వకేట్ జెఎసి శ్రవణ్‌కుమార్, కె.వి.గౌడ్, కొండల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# సన్న బియ్యం సరఫరా సంక్షేమానికి నాంది

**రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి**



**ప్రజాపక్షం/దేవరకొండ:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సన్న బియ్యం పథకాన్ని ప్రజలందరూ మెచ్చుకుంటున్నారని రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన నల్గొండ జిల్లా కొండమల్లేపల్లి, దేవరకొండ మండలాలలో జాతీయ ఆహార భద్రత చట్టం 2013 అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా దేవరకొండ ఏరియా ఆసుపత్రిలో పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేవరకొండ, కొండమల్లేపల్లి మండలాలలో రేషన్‌షాపులు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలో మధ్యాహ్న భోజనం, హాస్టళ్లను ఆకస్మికంగా తనిఖీ చేశామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చౌకధరల దుకాణాల ద్వారా పేద ప్రజలకు అందిస్తున్న సన్న బియ్యం పట్ల ప్రజలు సంతోషంగా ఉన్నారని, అందరూ మెచ్చుకుంటున్నారని అన్నారు. అంత్యోదయ కార్డులకు పంచదార కేటాయించాలని ప్రజలు కోరారని, చౌకధర దుకాణాలలో ఫిర్యాదుల పెట్టే ఏర్పాటు వంటి అంశాలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్న పిల్లలు, గర్భిణిలకు పౌష్టికాహారం పంపిణీ, ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు బాగుందన్నారు. దేవరకొండ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల, గిరిజన బాలికల వసతి గృహం, మెనుకబడిన తరగతుల బాలుర వసతి గృహాలలో తనిఖీలు నిర్వహించి అక్కడ మెనూ ప్రకారం భోజనం, ఇతర సౌకర్యాలను తనిఖీ చేశామని, నిబంధనల ప్రకారమే విద్యార్థులకు కల్పిస్తున్నారని సంతృప్తి వ్యక్తం చేశారు. నల్గొండ జిల్లాలో అధికారులు, సిబ్బంది బాగా పనిచేస్తున్నారని, దీని ద్వారా జిల్లా యంత్రాంగం పనితీరు పట్ల అభినందన తెలియజేశారు. దేవరకొండ ఏరియా ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న భోజనాన్ని, వంటగదిని, స్టోర్ రూంను కమిషన్ సభ్యులతో కలిసి తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఏరియా ఆసుపత్రి 100 పడకల సామర్థ్యం ఉన్నప్పటికి ప్రభుత్వం 180 మంది వస్తున్నారని, 200 పడకల కోసం ప్రభుత్వానికి సిఫారస్ చేశామని డిసిహెచ్ మాతృనాయక్ తెలిపారు. అయితే రాష్ట్ర ఆహార కమిషన్ ద్వారా 200పడకల ఆసుపత్రిగా స్థాయి పెంచేందుకు తమ వంతు కృషిగా లేఖ రాస్తామని చైర్మన్ తెలిపారు. అంతకు ముందు రాష్ట్ర ఆహార కమిషన్ దేవరకొండలోని సాంఘీక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేశారు. 6వ తరగతి విద్యార్థినిలతో ముఖాముఖి మాట్లాడి ఆహార కమిషన్ గురించి అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత కమిషన్ మైనార్టీ రెసిడెన్షియల్ సంక్షేమ వసతి గృహాన్ని తనిఖీ చేశారు. కాగా ఇక్కడ విద్యార్థులకు అమలు చేస్తున్న మెనూ, భోజనం, ఇతర వివరాలను మైనార్టీ సంక్షేమ అధికారి విష్ణు కమిషన్‌కు వివరించారు. ఇక్కడ అమలు చేస్తున్న మెనూ, భోజనం ఇతర విషయాల పట్ల కమిషన్ సంతృప్తి వ్యక్తం చేసింది.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు శారద, భారతి, జ్యోతి, దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి, బిసి సంక్షేమ అధికారి ఖాజా నజీమ్‌అలి, డిప్యూటి డిఎంహెచ్‌వో డా. కళ్యాణ చక్రవర్తి, డిఆర్‌డివో పిడి శేఖర్‌రెడ్డి, ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ డా. రవిప్రకాష్, తహశీల్దార్ సంతోష్‌కిరణ్, ఎంపిడివో డానియల్, డిటిసిఎస్ శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

# చల్లని కబురు (మొదటి పేజీ తరువాయి)

వేడితో మండిపోతున్నాయి. ఏప్రిల్ నుండి జూన్ వరకు ఎక్కువ రోజులు అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది. దీని ఫలితంగా విద్యుత్ గ్రిడ్‌లు దెబ్బతినడంతో పాటు నీటి కొరత ఏర్పడనుంది. భారతదేశ వ్యవసాయ రంగానికి రుతుపవనాలు చాలా కీలకం. వ్యవసాయరంగం జనాభాలో దాదాపు 42.3 శాతం మందికి జీవనోపాధి కల్పింది. దేశ జిడిపికి 18.2 శాతం దోహదం చేస్తుంది. నికర సాగు విస్తీర్ణంలో 52 శాతం ప్రాథమిక వర్షపాత వ్యవస్థపై ఆధారపడి ఉంటుంది. దేశవ్యాప్తంగా విద్యుత్ ఉత్పత్తితో పాటు, తాగునీటికి కీలకమైన జలాశయాలను తిరిగి నింపడానికి కూడా ఇది చాలా కీలకం. కాబట్టి, వర్షాకాలంలో సాధారణ వర్షపాతం అంచనా వేయడం దేశానికి భారీ ఉపశమనం కలిగిస్తుంది. భారీ వర్షపాతాలు (స్వల్ప వ్యవధిలో ఎక్కువ వర్షాలు) నమోదవుతున్న నేపథ్యంలో వరదలు, కరువు పరిస్థితులకు దారీ తీస్తున్నాయని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. మరోవైపు ప్రైవేటు వాతావరణ సంస్థ స్కైమెట్ కూడా ఇటీవల వర్షపాతంపై తన నివేదికను విడుదల చేసింది. రాబోయే 'నైరుతి' సీజన్‌లో సాధారణ వర్షపాతం నమోదవుతుందని తెలిపింది. మార్చి వరకు వాతావరణ పరిస్థితులు, పలు అంశాలను విశ్లేషించిన తర్వాత ఈ విషయాన్ని వెల్లడించింది. జూన్ నుంచి సెప్టెంబర్ మధ్యకాలంలో దేశంలో సగటున 868.6 మిల్లీమీటర్ల వర్షం కురుస్తుందని అంచనా వేస్తోంది. నైరుతి సీజన్ నెమ్మదిగా ప్రారంభమైనా మధ్యలో వర్షాలు వేగం పుంజుకోనున్నాయని స్కైమెట్ పేర్కొంది. పశ్చిమ, దక్షిణ భారతదేశంలో సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది.

# రూ.4లక్షల ఎక్స్‌గ్రేషియా

(మొదటి పేజీ తరువాయి)

సహాయాన్ని అందించడంతో పాటు ఎక్స్‌గ్రేషియాను రూ.4 లక్షలు పెంచుతున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఈమేరకు రెవెన్యూ శాఖ( విపత్తు నిర్వహణ) ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. దేశ వ్యాప్తంగా ప్రస్తుత నెల (ఏప్రిల్)నుంచి జూన్ వరకు వేడిగాలులు వీసే అవకాశాలు ఉంటాయని, సాధారణం కంటే అధిక వడగాలులు వీచే రాష్ట్రాలలో తెలంగాణ రాష్ట్రం కూడా ఉన్నదని భారత వాతావరణ కేంద్రం (ఐఎండి) సూచించింది. రానున్న రోజుల్లో రాత్రి సమయంలో కూడా వేడిగాలులు వీస్తాయని, పగటి సమయంలో ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశాలు ఉన్నాయని, ముఖ్యంగా 40 డిగ్రీల కంటే మరో ఐదు డిగ్రీల పెరిగితే ఉష్ణోగ్రతలు పెరిగి, వడగాలు ఉన్నట్టు గుర్తించాలని తెలిపింది. కాగా గత ఏడాది 2024 ఎండకాలంలో28 జిల్లాల్లో వేడి గాలులు వీసాయి. దీనిని దృష్టిలో పెట్టుకుని రానున్న రోజుల్లో మున్సిపల్ కార్పొరేషన్లు, గ్రేటర్ హైదరాబాద్, వరంగల్ కార్పొరేషన్లు తదితర స్థానిక సంస్థలు అప్రమత్తంగా ఉండాలని విపత్తు నిర్వహణ డిపార్ట్‌మెంట్ సూచించింది. ప్రధానంగా నిర్మాణ రంగంలో పనిచేసే కార్మికులు, రోజు వారి కూలీలపై వేడిగాలలు, ఎండ ప్రభావం ఉంటుందని విపత్తు నిర్వహణ డిపార్ట్‌మెంట్ హెచ్చరించింది. ఇందులో భాగంగానే విపత్తు నిర్వహణ విభాగం అప్రమత్తమైంది. జిల్లాల వారిగా వడగాలలు కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని, ఒఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో పెట్టాలని,,చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్లకు సూచించింది. విపత్తు నిర్వహణ బడ్జెట్ నుంచి 10 శాతం నిధులను ఖర్చు చేయాలని నిర్ణయించింది. వడ బెబ్బకు మృతి చెందినట్టు స్థానిక తహసిల్దార్లు,సంబంధిత మెడికల్ అధికారుల ధృవీకరించాల్సి ఉంటుందని విపత్తు నిర్వహణ డిపార్ట్‌మెంట్ సూచించింది. ఒక వేళ రైతు మృతి చెందితే, వారి కుటుంబాలకు రైతబీమా స్కీమ్,లేదా ఎక్స్‌గ్రేషియా ఈ రెండింటిలో ఏది ఎక్కువగా వస్తే ,ఆ స్కీమును మృతుని కుటుంబ సభ్యులు ఎంచుకోవచ్చని ప్రభుత్వం స్పష్టం చేసింది.

# విడుదల చేస్తేనే..

(మొదటి పేజీ తరువాయి)

హమాస్ నాయకత్వం తరపున అధికార ప్రతినిధి సమీ అబు జుహ్రీ చెప్పారు. ఐతే కాల్పుల విరమణ సంపూర్ణంగా, శాశ్వత ప్రాతిపదికపై అమలు జరగాలనీ, ఇజ్రాయెల్ సైన్యం గాజా నుండి పూర్తిగా వైదొలగాలని హమాస్ ఇంతకుముందునుండీ డిమాండ్ చేస్తున్నది. ఇజ్రాయెల్ తాజా ప్రతిపాదన నేపథ్యంలో ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ స్పందిస్తూ, పాలస్తినా అధికార వ్యవస్థలో ప్రక్షాళన జరగాలన్నారు. మార్చి 18వ తేదీన కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిన ఇజ్రాయెల్ గాజాపై తన దాడులు ఉధృతం చేసింది. మొదటిరోజు గగనతల దాడుల్లో 400 మందిని హతమార్చింది. ఇప్పటివరకూ దాదాపు పాతికరోజులకాలంలో 1600 మంది పాలస్తీనియన్లను బాంబుదాడుల్లో హతమార్చింది. ఖాన్‌యూనిస్‌ను వదలివెళ్ళిపోవాలని ప్రజలకు ఆదేశాలు జారీ చేసింది. తాత్కాలిక గుడారాలలో నివసిస్తున్నవారిపై కూడా బాంబుదాడులు చేసింది. గాజాలోకి మానవతా సహాయాన్ని రానివ్వకుండా మార్చి రెండో తేదీ నుండి ఇజ్రాయెల్ అడ్డుకుంది. ఇటీవలి క్రూరమైన దాడుల్లో పిల్లలు పెద్దసంఖ్యలో మరణించారు. ఇజ్రాయెల్‌లో బందీల కుటుంబాల సంఘం నుండి నేతన్యాహూపై తీవ్రస్థాయిలో వత్తిడి వస్తున్నది. బందీల కుటుంబాలు నేతన్యాహూ యుద్ధ విధానాలను తీవ్రంగా ప్రతిఘటిస్తూ దేశంలో దాదాపు ప్రతి రోజూ నిరసన ప్రదర్శనలు చేస్తున్నారు. హమాస్ ఉగ్రవాదులు 2023 అక్టోబరు 7 వ తేదీన ఇజ్రాయెల్ సరిహద్దు ప్రాంతంలో జరుగుతున్న సంగీత కచేరీపై దాడిచేశారు. సుమారు 1200 మందిని దారుణంగా కాల్చిచంపి మరో 250 మందిని బందీలుగా తీసుకుపోవడంతో గాజాలో సెర్చ్ ఆపరేషన్ పేరుతో ఇజ్రాయెల్ యుద్ధం ప్రకటించింది. ఇప్పటివరకూ జరిగిన యుద్ధంలో దాదాపు 62,000 మంది పాలస్తీనియన్లు మరణించారు. లక్షమందిపైగా గాయపడ్డారు. మధ్యవర్తి దేశాల బలవంతంవల్ల 45 రోజులు కాల్పుల విమరణను బలవంతంగా ఇజ్రాయెల్–హమాస్ పాటించాయి. ఆ తర్వాత మార్చి 18 నుండి తిరిగి దాడులు ప్రారంభించింది. కాల్పుల విరమణ ఒప్పందం ముందుకు కొనసాగకపోవడానికి నువ్వంటే నువ్వే కారణమని హమాస్, ఇజ్రాయెల్ పరస్పరం తగవులాడుకున్నాయి. ప్రపంచవ్యాప్తంగా పాలస్తీనియన్లకు బ్రహ్మాండమైన సానుభూతితోపాటు సంఘీభావం లభించగా నేతన్యాహూకు గడచిన 18 నెలలుగా తిట్లూ శాపనార్థాలు గిట్టాయి. నేతన్యాహూ చర్యలపై అంతర్జాతీయ న్యాయస్థానం అరెస్టు వారెంటు జారీ చేసింది. కాగా గడచిన 24 గంటల్లో గాజాలో ఇజ్రాయెల్ చేసిన మారణకాండలో 17 మంది పాలస్తీనియన్లు మరణించగా 69 మంది గాయపడ్డారు. ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్ ప్రాంతంలో 14 మంది పాలస్తీనియన్లను ఇజ్రాయెల్ సైన్యం అరెస్టు చేసింది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com